# లోకానికి నేనే వెలుగు



## పని, ప్రార్థన - వేదప్రచార సాధనాలు

సంపుటి : 45 జనవరి - మార్చి 2022 సంచిక : 1

భక్త యోహాను ప్రాంతీయ గురువిద్యాలయం, హైదరాబాదు

## ప్రచురణ

భక్త యోహాను ప్రాంతీయ గురువిద్యాలయ ప్రచురణలు
రామాంతపురం, హైదరాబాదు.



## సంపాదక వర్గం

ఫాదర్ పిల్లి అంతోని దాస్
ఫాదర్ పసుపులేటి ఫ్రాన్సిస్
ఫాదర్ దాసి సురేష్ కుమార్
ఫాదర్ కుర్మ తామస్

## గురువిద్యార్థుల బృందం

బ్రదర్ కొప్పుర డేవిడ్
బ్రదర్ గోన పీటర్
బ్రదర్ కంకిపాటి అనిల్
బ్రదర్ బొమ్ము మత్తయి
బ్రదర్ కదిరేపోగు జయన్న
బ్రదర్ రామంచ శరత్ కుమార్
బ్రదర్ బాపనపాటి అలెక్స్
బ్రదర్ కండి కిషోర్
బ్రదర్ కోడిగంటి శౌరి నిఖిల్ తేజ
బ్రదర్ చాట్ల అలెగ్జాండర్
బ్రదర్ నెకూరి జాయ్ చందు
బ్రదర్ పెండేల ఉమేష్ చంద్ర
బ్రదర్ వంపుగళ్ళ ప్రదీప్ కుమార్


## చందా వివరములు

సంవత్సరానికి మీ చందాను రూ॥ 100/- యం.ఓ., డి.డి.ల ద్వారా
**St. John's Regional Seminary Society, Hyderabad**
పేరున పంపించి మమ్ముల్ని ప్రోత్సహించమనవి. అన్ని సంప్రదింపులకు
మరియు మీ విరాళము పంపవలసిన అడ్రస్:


**St. John's Regional Seminary**
Ramanthapur, Hyderabad - 500 013.
Ph: 040-27201427, 27200370, Fax: 27209505
e-mail: stjohnshyd2@gmail.com

# లోకానికి నేనే వెలుగు

సంపుటి : 45 జనవరి–మార్చి 2022 సంచిక : 1

## పని, ప్రార్థన - వేదప్రచార సాధనాలు

సంచిక సంపాదకులు

**ఫాదర్ పసుపులేటి ఫ్రాన్సిస్**

ప్రధాన సంపాదకులు

**ఫాదర్ పిల్లి అంతోని దాస్**

భక్త యోహాను ప్రచురణలు, భక్త యోహాను ప్రాంతీయ గురువిద్యాలయం
రామాంతపురం, హైదరాబాదు–500 013.
ఫోన్ : 040–27201427, 27200370
E-mail : stjohnshyd2@gmail.com
Website : stjohnseminary.org

# విషయసూచిక


సంపాదకీయం................................................ 05

1. ప్రార్థించే పెదవుల కన్నా పని చేసే చేతులు మిన్న

*– బ్రదర్ రామంచ శరత్ కుమార్.......................* 08

2. పునీత ఫ్రాన్సిస్ శౌరివారి అధ్యాత్మిక, వేదప్రచార సాధనాలు

*– బ్రదర్ లక్క హృదయరాజ్.............................* 62

3. క్రీస్తు ఉత్థాన మహిమ

*– ఫాదర్ పసుపులేటి ఫ్రాన్సిస్..........................* 92




# సంపాదకీయం



ప్రియ పాఠకులారా,

దైవశాస్త్ర అధ్యయనంలో భాగంగా కాంక్షితాల పాక్షిక పరిపూర్తి నిమిత్తం (Papers submitted in partial fulfilment of the requirement for the Theological Studies) పునీత యోహాను ప్రాంతీయ గురువిద్యాలయానికి చెందిన ఇద్దరు విద్యార్థులు నా నేతృత్వంలో శాస్త్రీయ పత్రాలను (Scientific Papers) వ్రాసారు. వాటినే ఈ సంచికలో మీకు అందజేస్తున్నాం.

బ్రదర్ రామంచ శరత్ కుమార్ వ్రాసిన శాస్త్రీయపత్రం – "ప్రార్థించే పెదవుల కన్నా పని చేసే చేతులు మిన్న" అనే అంశాన్ని చక్కగా అవగాహన చేసికొని, అందరికి అర్థమయే తీరులో అందించాడు. ప్రార్థన గురించి ఏమాత్రం జ్ఞానమున్న మనిషి తప్పకుండ మదర్ తెరేసా చెప్పిన, "ప్రార్థించే పెదవుల కన్నా పనిచేసే చేతులు మిన్న" సూక్తిని ఆలకించగానే సందిగ్ధంలో పడటం ఖాయం. పని ముఖ్యమా? ప్రార్థన ముఖ్యమా? అన్న డోలాయమానతను అనుభవిస్తారు. సందేహాస్పదమైన ఆలోచన ఏర్పడుతుంది. విశదంకాని విషయంగా మిగులుతుంది. క్రైస్తవ జీవితానికి ప్రార్థన ఆలంబనని, అది లేనిదే దేవునితో సఖ్యత, సన్నిహితం పొందడం కుదరదని డంకాపథంగా ప్రతీ గురువు, ప్రతీ పీఠకాపరి, ప్రతీ దైవశాస్త్రజ్ఞుడు గంటాపథంగా బోధిస్తుంటారు. అన్ని విధాలా ప్రార్థన జీవితానికి ఊపిరి అని ప్రతీ పునీతుడు/పునీతురాలు వాదిస్తారు. ముఖ్యంగా పునీత అవిలాపురి తెరేసాగారు ప్రార్థనమీద ప్రతిపాదనలు చేసి, గొప్ప సిద్ధాంతాన్ని శ్రీసభ కతోలిక సాహిత్యానికి ఆణిముత్యంగా అందించారు. అటువంటిది, "ప్రార్థించే పెదవుల కన్నా పనిచేసే చేతులే మిన్న" అని ఎలా చెప్పగలుగుతారని ప్రశ్నించేవారు ఉంటారు. అందుకే

మదర్ తెరేసా పునీతపట్టం కట్టేముందు వాటికన్లో ఈ విషయాన్ని కూడ తీసుకున్నారు. వారు దీని గురించి ఏంచెప్పారో అన్నది చూసేకన్నా బ్రదర్ శరత్ ఆత్మ నడిపింపుతో, పర్యవేక్షణలో వివరణ పూరిత జవాబును ఈ పత్రం ద్వారా తెలుసుకోవడం మంచిది. ఇక అతని మాటలలోనే పాఠకులు చదివి, తెలిసికోవడం మంచిదని భావిస్తున్నాం.

బ్రదర్ లక్క హృదయరాజ్ వ్రాసిన శాస్త్రీయ పత్రం – "పునీత ఫ్రాన్సిస్ శౌరివారి ఆధ్యాత్మిక, వేదప్రచార సాధనాలు" లో పునీత శౌరివారు అనుసరించిన పద్ధతులు భారత శ్రీసభకు నేడు ఎలా ఉపయోగ పడగలవు? అన్న అంశం మీద ఆకళింపు చేసికొని, మా పత్రిక పాఠకులకు తన అనుశీలనం (study) ను అందిస్తున్నాడు. పునీత శౌరివారు సువార్తీకరణలో అనుసరించిన పద్ధతులు నేటి సువార్తికులు తెలుసుకోదగ్గ నీతిపాఠాలు. లక్షలకొలది ప్రజలకు క్రీస్తును పరిచయం చేయగలిగారంటే – అతని విజయ రహస్యాలను మనం తరచి చూడవలసిందే! అతనిలోగల అపోస్తలిక ఉత్సాహాన్ని గమనించవలసిందే! ఐరోపాభాషలే కాకుండా, దక్షిణాసియా–తూర్పు ప్రాంతాల భాషలను పట్టుబట్టి నేర్చుకొని, సువార్తను బోధించారంటే – అతనిలోగల అకుంఠిత దీక్ష, ఉత్సాహం, ప్రేమ, సృజనాత్మకత, తపస్సులను చాటుతున్నాయి. ఇంతటి ఘన చరిత్ర కలిగిన మహనీయుని పద్ధతులను మనం చదివి తీరవలసిందే! కనుక, గురువిద్యార్థి అందించిన ప్రతిపాదనను చదివి తరించండి.

ఈ సంచిక మీకు అందేసరికి క్రీస్తు ఉత్థాన మహోత్సవం దగ్గర పడుతుంది. పండుగు ప్రాధాన్యత–పరమార్థం, సప్తాహంపై క్రీస్తు విజయం, ఈస్టర్ తెచ్చే ధైర్యం, ఉత్థానం–ఇప్పుడే, ఇక్కడే, క్రీస్తుని నిగూఢ శరీరంలోకి ఉత్థానం అనే ఐదు అంశాలతో ఈస్టర్ సందేశాన్ని అందిస్తున్నాం. ఈ అంశాలు ఒక్కొక్కటి ఒక్కో ప్రసంగంగా కూడ వాడుకోవచ్చును. అలా కూడ లాభదాయకంగా ఉంటుందని ఈ శీర్షికను మీకు అందజేస్తున్నాం. ఇందు తాత్వికం, ఆధ్యాత్మికం, దైవశాస్త్ర అంశాలు ఇమిడున్నాయి. పాఠకులు చదివి ఈస్టర్ యొక్క మహాత్మ్యాన్ని గ్రహించగలరు.

ఇవ్విధంగా ఈ సంచిక "పని, ప్రార్థన – వేద ప్రచార సాధనాలు" ను వెలువరించుటకు సహకరించిన గురువిద్యార్థులకు శుభాశీస్సులు. సహకరించిన తోటి సంపాదకులకు వందనాలు. ప్రతులను పంపిణీ చేయుటలో ఉపయుక్తంగా సాయమందించిన జోసఫ్, బాల బృందానికి మా హృదయపూర్వక సన్నుతులు. ఆర్థిక సహాయమందించిన కోశధికారి, ఫాదర్ అంబటి అర్లాగారికి నమస్సు మాంజలులు. జీవన్ ఇన్సిట్యూట్ ఆఫ్ ప్రింటింగ్ వారికి, సహకరించిన గురువిద్యార్థుల బృందానికి, ముఖ్యంగా మా ప్రియ పాఠకులకు ప్రశంసలను అందిస్తున్నాం. సంపాదకునిగా ఇది నా చివరి సంచిక. గత ఏడు సంవత్సరాలుగా పాఠకులు నన్ను ఆదరించారు. అందుకు వారికి నా కృతజ్ఞతలు. ఇతర పత్రికల ద్వారా మిమ్ములను కలవగలనని ఆశిస్తూ . .

ఇట్లు ప్రభు సేవలో ...
**ఫాదర్ పసుపులేటి ఫ్రాన్సిస్**
సంచిక సంపాదకులు

# 1. ప్రార్థించే పెదవుల కన్నా పని చేసే చేతులు మిన్న

**- బ్రదర్ రామంచ శరత్ కుమార్**

## ఉపోద్ఘాతం



మదర్ తెరిసా చేస్తున్న సేవలను చూసేందుకు భారత ప్రథమ ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ, కలకత్తాలోని “నిర్మల హృదయం” గృహమునకు వెళ్లారు. ఆమె పనులన్నీ ప్రత్యక్షంగా చూసిన తర్వాత అభాగ్యుల కొరకు ఆమె రోజంతా అన్ని సేవలు ఎలా చేయగలుగుతుంది? అని ఆమెను అడిగారు. అప్పుడు ఆమె ప్రధానమంత్రిని తన చిన్న ప్రార్థనా మందిరానికి తీసుకుని వెళ్లి “నేను ఉదయాన్నే ఇక్కడ ఒక గంట పాటు ప్రార్థనలో, ధ్యానంలో గడుపుతాను. సిలువ పైన వేలాడుతున్న ఆ క్రీస్తు ప్రభువు నాకు బలాన్ని ఇస్తాడు. నేను ఆయన చెప్పినవన్నీ చేస్తున్నాను”అని చెప్పిందట. మదర్ తెరిసా చెప్పిన “ప్రార్థించే పెదవుల కన్నా పని చేసే చేతులు మిన్న” అనే సందేశంలోని పరమార్థం ఆమె మాటల ద్వారా, చేసే పనుల ద్వారా అర్థమవుతుంది. ప్రార్థన చేయడానికి పదాలు ఏమాత్రం అవసరం లేదని, మనం చేసే ప్రార్థన హృదయ అంతరంగములో నుండి వెలువడే ప్రార్థనతో పాటు, పని చేసే చేతులు ఎంతో అవసరమని ఆమె వ్యక్త పరుస్తుంది. దేవుడు మనం కోరుకునేది యివ్వక పోవచ్చు కాని దేవుడు మనకు యిచ్చేది మాత్రం మనం కోరుకున్న దానికంటే ఎంతో విలువైనదని గ్రహించాలి.

పునీత పౌలుగారు యేసుక్రీస్తు నందలి మీ జీవితమున దేవుడు మిమ్ము కోరునది మూడు కార్యములు మొదటిది సర్వదా సంతోషంగా ఉండడు. రెండవది సదా ప్రార్థింపుడు. మూడవది అన్నీ వేళల యందును కృతజ్ఞులై ఉండడు (1 తెస్స 5:16-18) అని తెలియజేస్తున్నారు. అదే విధముగా మదర్ తెరిసా

తన జీవితంలో పై మూడు కార్యములను అనుసంధించడం చేత ప్రార్థన జీవితంలోను, యితరులకు సేవ చేయుటలోను దైవికమైన శక్తిని పొందింది.

ఒకసారి సాధు సుందర్ సింగ్ "ప్రార్థన ఊపిరి వంటిది. ఊపిరాడక పోతే మనిషి చనిపోతాడు. ప్రార్థన చేయక పోతే క్రైస్తవుడు ఆత్మలో చనిపోతాడు" అని ప్రార్థన అనుదిన జీవితంలో ఎంతగా ప్రాముఖ్యతను కలిగి ఉందో చెప్పారు. యేసు ప్రభువు ప్రార్థన గూర్చి యింకను యిలా అన్నారు: మీలో ఒకడు అర్ధరాత్రి వేళ తన మిత్రుని వద్దకు వెళ్లి ఇట్లు చెప్పెననుకొనుడు. "మిత్రమా నీవు నాకు మూడు రొట్టెలు బదులు ఇమ్ము. నా స్నేహితుడు ఒకడు ప్రయాణమై పోవుచు, నా ఇంటికి వచ్చి ఉన్నాడు. అతనికి పెట్టుటకు నా యొద్ద ఏమియును లేదు. అప్పుడు ఆ మిత్రుడు లోపల నుండి 'నన్ను తొందర చేయకుము తలుపులు మూసి ఉన్నవి. పిల్లలు నా యొద్ద ప్రక్క మీద ఉన్నారు. నేను ఇప్పుడు లేచి యియ్యజాలను 'అని సమాధానము ఇచ్చెననుకొనుడు. అతడు మిత్రుడై ఉండియు లేచి ఏమియు ఈయక పోయినను, పదేపదే ప్రాధేయపడి అడిగినందున లేచి, అతని అవసరము తీర్చును (లూకా 11:5–8) అదే విధముగా మదర్ తెరిసా ఇతరులకు సహాయం (సేవ) చేయడానికి తన జీవితంలో ప్రార్థనకు, పనికి ఏ విధముగా ప్రాముఖ్యతను యిచ్చినదో వివిధ సంఘటనల ద్వారా తెలియజేశాను.

నేటి ఆధునిక ప్రపంచంలో దేవుని పిలుపునందుకొని, యితరులకు సేవ చేస్తున్న ప్రతి ఒక్కరిని దృష్టిలో పెట్టుకొని మదర్ తెరిసా చెప్పిన వాక్యములోని నిజమైన భావమును, లోతుగా తెలియజేయుటకు, ఆమె జీవితంలో జరిగిన కొన్ని సంఘటనలను ఆధారముగా చేసుకొని, శ్రీసభలోని ఆధ్యాత్మిక వ్యక్తుల రచనలను, సామెతలను, కథలను, పునీతుల జీవిత అనుభవాలను ఏకం చేసి, సరళమైన భాషలో అర్థవంతంగ మదర్ చెప్పిన వాక్యమును నా అనుదిన ప్రార్థన సమయములో ధ్యానించి, సరైన సమాధానంతో తెలియజేయుటకు ప్రయత్నం చేశాను.

పునీత బెర్నార్డ్ "తన ప్రార్థనల్ని దేవుడు ఆలకించాలని అనుకుంటునే నిర్లక్ష్యంగా ప్రార్థించే వ్యక్తి, పుచ్చు ధాన్యాన్ని మరలో పోసి మంచి పిండిని

స్వీకరించేందుకు ఎదురు చూసే వ్యక్తి లాంటివాడు" అంటారు. మదర్ తెరిసా తన అనుదిన జీవితంలో తన మొదటి ప్రాధాన్యమును ప్రార్థనకు లేదా పనికి యిచ్చినదా అనే కోణమలోను నా పరిశోధనను కొనసాగించాను. దేవుని అన్నింటి కంటే మిన్నగా ప్రేమించాలి ఎందుకంటే ఏ వ్యక్తి అయితే హృదయ పూర్వకంగా దేవుని ప్రార్థిస్తాడో అతడు తప్పకుండా ఆయన బోధించిన వాక్యానుసారముగా జీవించడమే కాకుండా యితరులకు సేవ చేయడానికి తన పనిచేసే చేతులను ఉపయోగిస్తాడు అనే నమ్మకం.

నేను నా పాఠ్యాంశమును మూడు అధ్యాయాలుగా విభజించాను. మొదటి అధ్యాయంలో పునీత మదర్ తెరిసా సంగ్రహ జీవిత చరిత్రతో పాటు ప్రార్థన, పనిని గురించి వివరించాను. రెండవ అధ్యాయంలో ప్రధాన అంశమైన "ప్రార్థించే పెదవుల కన్నా పని చేసే చేతులు మిన్న" అనే వాక్యంలో ఉన్న పరస్పర విరుద్ధమైన అంశాలను తెలియజేస్తూ, ప్రార్థన, పనిని గూర్చిన మూలాలను వివరించాను. మూడవ అధ్యాయంలో మదర్ తెరిసా చెప్పిన వాక్యములోని నిజమైన భావమును, లోతుగా ఆలోచించి దానిలోని విరుద్ధమైన అంశాలకు సరైన సమాధానలిస్తు వివిధ కోణంలో నుంచి మంచి సందేశమును నేటి ఆధునిక ప్రపంచమునకు యివ్వడానికి ప్రయత్నం చేశాను.

## మొదటి అధ్యాయం - ప్రార్థన : మదర్ తెరిసా

### 1.0 ఉపోద్ఘాతం

మొదటగా ప్రార్థన అంటే ఏమిటి ఎన్నిరకాలుగా మనం ప్రార్థించుకోవచ్చును అనే విషయాలను చాలా వివరంగా చూస్తేనే ఆమె యొక్క మాటలకు సంపూర్ణ అర్థం మనకు దొరకుతుంది. లేకుంటే ఆమె మాటలను పొడిగా తీసుకుంటే, ఆమె చెప్పిన సూక్తి – "ప్రార్థించే పెదవుల కన్నా పనిచేసే చేతులు మిన్న"ని అపార్థం చేసుకొనే అవకాసముంది. ప్రార్థన గురించి అనేక మంది పునీతులు చెప్పిన గొప్ప విషయాలు నీట మునుగుతాయి. ప్రభువు యేసు క్రీస్తు చెప్పిన విషయాలు కూడ అర్థం లేకుండా చేసి, ప్రార్థన అన్నది అనవసరం – పనే ముఖ్యమని ప్రేలాడుతాం. కనుకనే, మనం ఈ ప్రార్థన గురించి సవివరంగా తరచిచూడాలి.

## 1.1

అన్ని మతాలకు సమ్మతమైనది దైవ ప్రార్థన. ప్రార్థన దేవునితో సంభాషింపజేస్తుంది అదే ప్రార్థనలో దేవుడు మనతో మాట్లాడుతాడు. మహత్తరమైన విషయాలను ప్రార్థన ద్వారా సాధించవచ్చని ఆంగ్లకవి ఆల్ఫ్రెడ్ డెనిసన్ అంటాడు. కొందరు అది కావాలి, ఇది కావాలి అని దేవున్ని ప్రార్థించి అడుగుతారు. అది 'ఆర్తి'తో కూడిన ప్రార్థన. పిల్లలు మారాం చేసి తల్లిదండ్రులను ఆడిగినట్లు ఉంటుంది. అడపాదడపా దేవుని మహిమ, మోక్షానందం కావాలని కోరుకొంటూ చేసే ప్రార్థనను 'జిజ్ఞాసువు' అని అంటారు. మరికొందరు, ముఖ్యంగా మధ్య వయస్కులు ఇహలోక పరలోకాల మధ్య కొట్టు మిట్టాడతూ, మోక్షం చేరాలని ఆశిస్తూ ప్రార్థించే దానిని 'అర్థార్థి' అంటారు. ఎటువంటి కోరక లేకుండ, దేవుని పట్ల భక్తి, విశ్వాసాలు కలిగి, సదా దేవుని ప్రేమలో శరణార్థి అయిన వానిని 'జ్ఞాని' అంటారు. ఈ దశలో తండ్రి దేవుని చిత్తాన్ని గ్రహించి, నెరవేరుస్తు, మంచి మార్గంలో పయనిస్తారు. ఈ రకమైన ప్రార్థననే ప్రభువు కోరుకొనేది.

## 1.2. మదర్ తెరిసా చేసిన ప్రార్థన

మదర్ తెరిసా ప్రార్థన గూర్చి మాట్లాడుతు "ప్రేమించాలని మనం ఆశిస్తే, ప్రార్థించడం అలవర్చుకోవాలన్నారు". పరలోకం కచ్చితంగా ఎలా ఉంటుందని నాకు తెలియదు. కానీ ఒక సంగతి చెప్పగలను మనం మరణించి దైవ సన్నిధికి వెళ్లినప్పుడు నీ జీవితంలో నీవు ఎంత ప్రేమగా చేశావు? అని మాత్రమే అడుగుతాడని వర్ణించారు. మదర్ తెరిసా జీవితం ప్రేమతో కూడిన ప్రార్థన వంటిది. ప్రార్థన లేకుండా ఏ సేవను కూడా ప్రారంభించలేము. క్రీస్తు ప్రభువు తానెప్పుడూ ప్రార్థిస్తు తన తండ్రి పనిలో నిమగ్నం చెందేవారు. అలాగే మదర్ తెరిసా కూడా ఎల్లప్పుడు దైవ సన్నిధిలో గడుపుతు, ప్రార్థన చేస్తూ, పరుల సేవలో క్రీస్తును సేవించడమే ప్రార్థనగా అలవర్చుకుంది.

### 1.2.1. ప్రార్థన అనగా నేమి

"సర్వసృష్టికర్తయైన దేవునితో మనము ఏర్పాటు చేసుకునే సంబంధమే ప్రార్థన" అనబడుతుంది. ప్రార్థన మన హృదయాన్ని విశాలం చేస్తుంది

ఆవిశాలంలో దేవుడు ఆసీనుడవుతాడు నువ్వు ప్రార్ధించిన కొద్దీ నీ హృదయం విశాలమై దేవున్ని అందులో ప్రతిష్టించి నీ పరం చేస్తుంది.

## 1.2.2. ప్రార్థన నిర్వచనం

డాక్టర్ అలెక్సిస్ కారెల్ ప్రార్థనకు ఇలా నిర్వచనం ఇచ్చాడు. "ప్రార్థన అనేది మనిషి ఉత్పత్తి చేయ గలిగిన అత్యంత బలమైన శక్తి. గురుత్వాకర్షణ శక్తి ఎంత నిజమో ప్రార్థన శక్తి కూడా అంతే నిజమైనది. నేను వైద్యుడిగా చాలా మంది రోగులను చూశాను. వారిలో కొందరు చేయి దాటి పోయిన పరిస్థితుల్లో ఉన్నప్పుడు ఇక ఏ వైద్యమూ కుదరదని అనుకున్నప్పుడు ప్రశాంతమైన ప్రార్థన శక్తి చేత నిస్పృహలో నుంచి బయటపడి క్రమంగా కోలుకున్నారు" అని తన అనుభవమును తెలియజేస్తారు.

## 1.3. ప్రార్థనలో రకాలు

లుడ్విగ్ ఫ్యూయర్ బాక్ (Ludwing Feuer bach) అనే జర్మన్ తత్వవేత్త ప్రార్థన ప్రాముఖ్యతను ఇలా నిర్వచించాడు: "మతం యొక్క అత్యంత నిగూఢమైన సారం అతి సామాన్యమైన ఒక పనిలో కనిపిస్తుంది – అదే ప్రార్థన". ఈ ప్రార్థనను మూడు రకాలుగా వర్గీకరించవచ్చును.

## 1.3.1. శారీరక ప్రార్థన

క్రైస్తవులు తమ శారీరక భంగిమల ద్వారా, తమ దేహ భాష ద్వారా, తమ జీవిత సర్వస్వాన్ని దేవుని సన్నిధానంలో నిలుపుతారు: వారు దేవుని ఎదుట మోకరిల్లుతారు, తమ చేతులు జోడించి ప్రార్థన చేస్తారు. అలాగే పవిత్రుడైన దేవుని సన్నిధిలో మోకాళ్ళు వంచి గౌరవ సూచకంగా అభివాదం చేస్తారు. రెండు మోకాళ్ల మీద నిలిచి దేవుని ఆరాధిస్తారు అదే విధంగా నిలబడి సువార్త సందేశాన్ని ఆలకిస్తారు. కూర్చొని ధ్యానం చేస్తారు. ఈ విధముగా శరీరం చేత చేయబడిన ప్రార్థనను శారీరక ప్రార్థనగా వర్ణిస్తారు.

## 1.3.2. మానో ప్రార్థన

మనస్సును దేవుని మీద లగ్నం చేసి ఆయన చేసిన గొప్ప కార్యములకుగాను ధ్యాన పూర్వకంగా మన మనస్సు ప్రశాంతంగా చేసే ప్రార్థనను

"మానో ప్రార్థన" అనబడుతుంది. "నేనును నా తండ్రియు ఏకమై ఉన్నాము" (యోహాను 10:30)లో ప్రభువు ఏకాంత ప్రదేశానికి వెళ్ళి ప్రార్థన చేసే వారు పవిత్రాత్మయందు తండ్రితో ఏకమై ఉండే దైవ కుమారుడు యేసు ప్రభువు తన ఈ లోక జీవితంలో ప్రార్థన ద్వారానే తాను నడువవలసిన మార్గాన్ని తెలుసుకోగలిగే వారని ప్రవిత గ్రంథము తెలియజేస్తుంది.

### 1.3.3. నిశ్శబ్ద ప్రార్థన

నిశ్శబ్ద ప్రార్థన అంటే మనస్సును పరిపూర్ణమైన ఏకాగ్రతతో దేవునిపై లగ్నం చేసి పదాలు లేకుండా నిశ్శబ్దంగా దేవుని సన్నిధిలో గడపడమే. మనం పకృతిని గమనించినప్పుడు వృక్షాలు, పుష్పాలు, పచ్చని గడ్డిపోచాలు నిశ్శబ్దంగా ఎదుగుతాయి. అలాగే మనలోని ఆత్మలను స్పందించాలి అంటే మౌనంగా ఉండి ప్రార్థించాలి. క్రీస్తు కాంతి రేఖ చూపించలేని మాటలు చీకటిని పెంచుతాయని గ్రహించాలి.

## 1.4. మదర్ తెరిసా దృష్టిలో పని

మదర్ తెరిసా పని గురించి ప్రస్తావిస్తు "శ్రమ పడకుండా సేవ చేస్తానంటే అది కేవలం ఇతరుల మెప్పు కోసం మాత్రమే అవుతుంది. అది దైవ సేవ అనిపించుకోదు. యేసు ప్రభువు ఎల్లప్పుడు కష్టపడి పని చేశారు. తన జీవితమును పరుల సేవకై పణంగా పెట్టి మరీ జీవించారు. అలాగే ప్రతి వాళ్ళు గొప్ప సేవలు చేయలేక పోవచ్చు కానీ చేసిన చిన్న సేవ గొప్పగా ఉండాలనే తపనను కలిగి జీవించారు.

### 1.4.1. పని అంటే ఏమిటి?

పని అనగా "ధైర్యంతో నిలబడి, బాధ్యతను భుజాలకెత్తుకొని, ఉత్సాహంతో చేపట్టిన కార్యమును వదలకుండా కష్ట పడటమే". మనల్ని మనం మర్చిపోవడం, ఎల్లప్పుడు ఇతరులకు మంచి చేయడానికి ప్రయత్నించాలి. నిరంతరం ప్రకాశించే సూర్యుని చూసి చీకటి భయపడినట్లు నిరంతరం కష్టపడే మనిషిని చూసి ఓటమి భయపడుతుందని గ్రహించాలి.

### 1.4.2. పని నిర్వచనం

ఓర్పు, సహనం అనే పని ముట్లతో జీవితం అనే పొలంలో మన కర్తవ్యమును నిర్వహించడమే పని. మదర్ తెరిసా పనిని నిర్వచిస్తు "ఎవరిని ఖండించకు; అది ప్రేమ లేని తనానికి గుర్తు ఎదుటి వాళ్ళ అవసరాలు ఏమిటో గుర్తించు నీకు చేతనైనంత వరకు సహాయం చేయి; అప్పుడు నీకు దేవుడు సహాయం చేస్తారని తన మాటల ద్వారా మనల్ని ప్రభావితం చేశారు.

## 1.5. పనిలో రకాలు

పునీత ఇగ్నేషియస్ లయోలా ఇలా అన్నారు. "వివేకానికి రెండు కళ్లుంటాయి. ఒకటి, తాను చేయబోయే పని దూర దృష్టిలో చూడగలుగుతుంది. రెండవది, తాను చేసిన పనిని విశ్లేషించి చూస్తుంది" కనుక పనికి వివేకమును జోడిస్తే ఉన్నతమైన ప్రతిఫలాలను అందిస్తాయి. ఈ పనిని రెండు రకాలుగా విభజించవచ్చును

### 1.5.1. శారీరక పని

దేవుడైన యావే శిక్షను ప్రకటిస్తు నరునితో ఇట్లనెను. "నీవు నీ భార్య మాట విని నేను తిన వలదనిన పండును తింటివి. నీ వలన భూమి శాపము పాలయినది. నీవు బ్రతికినన్నాళ్ళు కష్టపడి కండలు కరిగించి, భూమి నుండి నీకు కావాలసిన పంట పండింతువు" (ఆది 3:17). ఇక్కడ శారీరక పనిలో ప్రధానముగా శరీరము తన కర్తవ్యమును నిర్వహించడానికి కృషి చేస్తుంది. మనం పుట్టినప్పుడు మనల్ని ఎవరు వచ్చి చూశారో మనకు తెలియదు, మరణించాక మనల్ని ఎవరు చూడడానికి వస్తారో కూడా మనకు తెలియదు. కావున మనం బ్రతికి ఉన్నప్పుడే కష్టపడి పని చేయడం అలవర్చుకోవాలి.

### 1.5.2 మానసిక పని

పునీత జాన్ మరియ వియాన్నిగారు దేవుని మనస్సును గూర్చి తెలియజేస్తు, "ప్రేమ గల మన దేవుడు మనం తనను పదే పదే ప్రార్థిస్తూ విసిగించడాన్ని ఇష్టపడతారు" అని తెలియజేస్తున్నారు. మానసిక పనిలో మనస్సు ప్రధానమైన పాత్రను పోషిస్తుంది "ఎదురు దెబ్బ తగిలినప్పుడు తొందరపడక

కాసేపు ఆగి ఆలోచించు, జీవితం నీకు ఏదో నేర్పడానికి ప్రయత్నిస్తుందని గ్రహించు” అన్నారు పెద్దలు. మనిషి జీవితంలో మానసిక పని ఎంతో ఉల్లాసమును ఇవ్వటమే కాకుండా మనిషి ఆలోచనలను నియంత్రిస్తుంది. కావున ప్రతి మనిషి మానో వికాశంగా ఆనందంగానే ఉండడం నేర్చుకోవాలి.

### 1.6. ముగింపు

మదర్ తెరిసా తన జీవితమును రోగులకు సేవ చేయడానికి, ఎవరు లేని ఆనాథలకు సహాయం అందించడానికి ఎల్లప్పుడు ప్రార్థన సహాయంతో పొందిన శక్తి చేత పని చేసింది. ఒక్క మహా కవి ఇలా అన్నారు: “పరిచయం, పలకరింపు, చిరునవ్వు అనేవి ప్రేమలో దాగి ఉన్న సద్గుణాలు” అలాగే మదర్ తెరిసా తన అనుదిన జీవిత ప్రయణంలో ఆపదలో ఉన్న వారిని ప్రేమతో పలకరిస్తు తనలోని దేవుని ప్రేమను అందించింది. ఆమె తన చిరునవ్వుతో బాధతో నిండిన ప్రతి హృదయమును తట్టి సంతోషముతో నింపింది. ప్రార్థన, పనికి అతీతంగా జీవించి ఎందరికో ఆదర్శ మూర్తిగా నిలిచింది. మనిషి హృదయం తనలోని సంతోషమును చిరునవ్వు ద్వారా, బాధను కన్నీరు కారుస్తు వ్యక్తపరుస్తుంది అని గ్రహించింది.

## రెండవ అధ్యాయం: ప్రార్థించే పెదవుల కన్నా పని చేసే చేతులు మిన్న

### 2.0. ఉపోద్ఘాతం

మనిషికి జీవితంలో చాలా వస్తువులు కావాలి. కోరికలు లేకుండా మనిషి జీవించలేడు. అయితే ఆ కోరికలు ఎలా తీర్చుకుంటాడనేది మనిషి మనిషికీ మారిపోతూ ఉంటుంది. తాను సాధించగలిగేదే అయితే మనిషి తన ప్రయత్నంతోనే సాధిస్తాడు. దీనినే “స్వప్రయత్నం” అంటారు. అయితే, అది అతడి శక్తియుక్తులకు మించినదైతే అతడు ఏదోవాక “అతీత శక్తి” నుంచి సహాయన్ని పొందడానికి ప్రయత్నిస్తాడు. ఇలా చేయడాన్నే సాధారణమైన భాషలో ప్రార్థన అంటారు. అలా చేసిన ప్రార్థన సఫలమైతే దాన్ని “దైవ కృప” అంటారు.

సాధారణంగా ప్రార్థన అంటే మనం నోటితో పలికేదే అనుకుంటాము. దేవుని నుంచి సహాయాన్ని అర్థించేదీ కూడ ప్రార్థన అని గ్రహించాలి. మదర్ తెరిసా చెప్పిన "ప్రార్థించే పెదవుల కన్నా పని చేసే చేతులే మిన్న" అనే వాక్యములోని లోతైన భావమును గ్రహించుట ద్వారా ప్రార్థన మనకు చేసే మేలును పొందవచ్చు.

## 2.1. పవిత్ర గ్రంథ పఠనము

వారు ప్రయాణము చేయుచుండగా యేసు ఒక గ్రామమునకు వచ్చెను. అచ్చట మార్తమ్మ అను స్త్రీ ఆయనను తన ఇంటికి ఆహ్వానించెను. ఆమెకు మరియమ్మ అను ఒక సోదరి కలదు. ఆమె ప్రభువు పాదముల చెంత కూర్చుండి ఆయన బోధనలు వినుచుండెను. మార్తమ్మ పెక్కు పనులతో సతమతమగుచు ఆయన యొద్దకు వచ్చి "ప్రభువా! నా సహోదరి పనులన్నియు నాపై వదిలి మీ చెంత కూర్చొని ఉండట మీరు గమనించుటలేదా? నాకు సహాయము చేయుటకు ఆమెను పంపుడు" అనెను. అందుకు యేసు "మార్తమ్మ! మార్తమ్మ! నీవు ఎన్నో పనులను గురించి విచారించుచు ఆతురపడుతున్నావు. కాని అవసరమైనది ఒక్కటే. మరియమ్మ ఉత్తమమైన దానిని ఎన్నుకొనినది. అది ఆమె నుండి తీసివేయబడదు" అని సమాధానమిచ్చెను (లూకా 10:38–42).

### 2.1.1. ప్రార్థన – పవిత్ర గ్రంథము

"ఎవరైతే చక్కగా జీవిస్తారో వారే చక్కగా ప్రార్థించగలరు" అని ఆంగ్లంలో ఒక సామెత ఉంది. ప్రార్థన అనేది హృదయంలో నుంచి పుట్టాలి. ప్రార్థనకు అసలు మాటలతో పని లేదు. మన హృదయాన్ని దేవుని ముందు ఉంచడమే మనం చేయవలసింది. నీ దేవుడైన ప్రభువును నీ పూర్ణ హృదయముతోను, పూర్ణ ఆత్మతోను, పూర్ణ మనస్సుతోను, పూర్ణ శక్తితోను ప్రేమింపవలెను ఇది ప్రధానమైన ఆజ్ఞ (మార్కు 12:30) అని తెలియజేస్తుంది. మరియమ్మ ఉత్తమమైన దానిని ఎన్నుకొనినది. అది ఆమె నుండి తీసివేయబడదని స్వయంగా యేసు ప్రభువువే ప్రార్థనకున్న ప్రత్యేకతను గూర్చి ప్రబోధించడం విశేషంగా భావించవచ్చును. మరియమ్మ జీవితమును మరింత లోతుగా ధ్యానిస్తే, ఆమె ప్రభువును ఎంతగా ప్రేమించిందో మనకు అర్థమవుతుంది.

పరిసయ్యులలో ఒకడు తన ఇంట విందు ఆరగింప యేసును ఆహ్వానించెను. ఆయన అందుకు అంగీకరించి, పరిసయ్యుని గృహమున భోజనమునకు కూర్చుండెను. ఆ పట్టణంలోని ఒక స్త్రీ, పాపాత్మురాలు, యేసు పరిసయ్యుని ఇంట భోజనమునకు వెళ్లాడని తెలుసుకొని, చలువరాతి పాత్రలో పరిమళ ద్రవ్యమును తీసుకొని వచ్చి, ఆయన పాదముల వెనకగా నిలబడి, ఏడ్చుచు, తన కన్నీటితో ఆ పాదములను తడిపి, తల వెంట్రుకలతో తుడిచి, ముద్దు పెట్టుకొనుచు, పరిమళ ద్రవ్యమును పూసెను (లూకా 7:36-38). తదనంతరం యేసు ప్రభువు మరియ చేసిన కార్యములను గూర్చి మాట్లాడుతు "ఈమె అధికంగా ప్రేమించినది కనుక ఈమె చేసిన అనేక పాపములు క్షమింపబడినవి. తక్కువగా క్షమించబడు వాడు తక్కువగనే ప్రేమించును అని నీతో చెప్పుచున్నాను" అని ఆ స్త్రీతో "నీ పాపములు క్షమింపబడినవి" అని పలికెను (లూకా 7:47-48). అపోస్తలుడైన యోహాను "యేసుకు పరిమళ తైలం పూసి ఆయన పాదములను తల వెంట్రుకలతో తుడిచినది ఈ మరియయే. (యోహాను 11:2) అని తెలియజేస్తున్నారు.

ఒక తత్వవేత్త "సూర్యుడి ప్రకాశంతో ప్రకృతి రమణీయంగా ఉన్న రోజున నీకు ప్రార్థించే అలవాటు లేకపోతే, గాలివానతో ప్రకృతి భయానకంగా ఉన్నప్పుడు కూడా ప్రార్థించకు!" అని చెప్పాడు. అంటే కష్టాల్లో ఉన్నప్పుడు మాత్రమే కాక, నిత్యం ప్రార్థనలు ఒక అలవాటుగా మలచుకోవాలి. చాలమంది, అసలు జీవితమే ప్రార్థన కదండీ! ఇంకా వేరే ప్రార్థనలు ఎందుకు? అంటుంటారు. అది నిజమే! అయితే మనుష్యులకు ఉండే ఇతర నైపుణ్యాల లాగనే ప్రార్థన కూడా తగినంత అభ్యాసంతో మరింత మెరుగైన ఫలితాలను ఇస్తుంది. అందుకు దేవునితో మనం రాత్రింబవళ్ళు సహవాసం చేయాలి.

మరియ దృష్టిలో ప్రార్థన జీవితం ఎంతో అమూల్యమైనది కనుకనే తాను యేసుప్రభుని బోధనలను ఆలకించడానికి ఎల్లప్పుడు సంసిద్ధంగా ఉండేది. యేసుప్రభువు చెప్పినట్లు "మొదట ఆయన రాజ్యమును నీతిని వెదకుడు. అప్పుడు అన్నీ మీకు అనుగ్రహింపబడును" (మత్తయి 6:33). మరియ యేసు ప్రభువు ప్రబోధించిన మాటలను తన హృదయంలో పదిలపరచుకోవటమే

కాకుండా వాటిని ఆచరణలో పెట్టుటలో కూడ ముందంజ ఉండెడిదని, పవిత్ర గ్రంథంలోని వివిధ సంఘటనలు తెలియజేస్తున్నాయి.

## 2.1.2. పని - పవిత్ర గ్రంథము

"మనిషి తాను చేసే పనులన్నిటినీ ప్రేమతోనే చేస్తాడు. ప్రేమ లేకుండా ఏ పనినీ చెయ్యలేడు. ప్రేమ ఉంటే మనిషి ఎంత కష్టమైన పనినైన సంతోషంగా చేస్తాడు" అని ఒక ప్రముఖమైన తత్వవేత్త చెప్పిన నిగూఢమైన సత్యం. మార్త పనులతో సతమత మగుచు యేసు వద్దకు వచ్చి "ప్రభువా! నా సహోదరీ పనులన్నియు నాపై వదిలి మీ చెంత కూర్చుని ఉండుట మీరు గమనించుట లేదా? నాకు సహాయము చేయుటకు ఆమెను పంపుడు" (లూకా 10:40) అనే మాటలు యేసుప్రభువును ఎంతగానో ఆశ్చర్యమునకు గురిచేసి ఉండవచ్చు. యూదుల సంప్రదాయం ప్రకారం అతిథి సత్కార్యములు చేయుట ప్రధానమైన కార్యముగా భావించేవారు. "మార్త అను స్త్రీ యేసును తన ఇంటికి ఆహ్వానించెను" (లూకా 10:38).

ఈ వాక్యానుసారంగా ధ్యానిస్తే అతిధిని ఆహ్వానించటము కూడ ఎంతో ప్రత్యేకతను చోటు చేసుకుంది. లాజరు మరణించిన సందర్భంలో యేసు వచ్చుచున్నాడని వినినంతనే మార్త ఆయనకు ఎదురు వెళ్ళెను. (యోహాను 11:21). మార్త చేసే ప్రతి కార్యములో ఎంతో ప్రేమ కనిపిస్తుంది. కాని ఆ ప్రేమ పనులను చేయుటకు మాత్రమే పరిమితమైనదిగా కనబడుతుంది. అందుకు యేసు "మార్తమ్మ! మార్తమ్మ! నీవు ఎన్నో పనులను గూర్చి విచారించుచు ఆతురపడుతున్నావు" (లూకా 10:41) అని స్వయంగా యేసు ప్రభువే ఆమె ఎన్నుకున్న మార్గమును తేటతెల్లము చేసి చూపిస్తున్నారు. కావున ఏమి తినెదమా, ఏమి త్రాగెదమా, అని మీరు కలత చెందకుడు. వీనిని అన్నిటిని ఈ జనులు కాంక్షింతురు. ఏలయన పరలోకమందున్న మీ తండ్రి ఈ మీ అవసరమునెల్ల గుర్తించును(లూకా 12:29-30) అని తెలియజేస్తున్నారు. మనం చేసే పనిని ఏ విధి విధానాలను అనుకరించి చేసున్నామో ఆలోచించుకోవాలి.

పునీత ఫ్రాన్సిస్ దె సేల్స్ (St. Francis de Sales) "ప్రేమను కొలిచే కొలమానం, కొలమానం లేని ప్రేమ మాత్రమే" అని ప్రబోధించారు. మార్తమ్మ

ఎన్నుకొన్న మార్గము ఎంతో విలువైనదిగా కనిపిస్తున్నప్పటికిని, యేసుప్రభువు చెప్పిన విధముగా ఉత్తమమైనది ప్రార్థన మార్గమే అని గ్రహించాలి. మార్త, మరియ అను ఇద్దరు సోదరీలు, భిన్న స్వభావులు, ఇద్దరు యేసు ప్రభువును ఎంతగానో ప్రేమించిన వారే. మార్తమ్మ ప్రభువుకు చేసిన పరిచర్యలలో ప్రేమ కొరవడిందా? తన పూర్ణ శక్తి తోనూ, పూర్ణ మనసుతోను, పూర్ణ ఆత్మతోను, ప్రభువుని ప్రేమించ లేదా! ప్రభువు తమ ఇంటికి రాగానే అతిథి సత్కార్యాలలో తలమునకలై యుండుటలో తన పూర్ణశక్తి కనబడుతుంది. ప్రభువుకు అన్ని సమకూర్చి ఎటువంటి లోటు చేయకూడదన్న దాంట్లో తన మనస్సును లగ్నము చేసింది. తన పూర్ణ ఆత్మను ప్రభువు మీద కేంద్రీకరించకపోవడమే ఆమెలోని లోపం. "దీపం వెలుగుతు ఉండాలంటే అందులో నూనె పోస్తూ ఉండాలి". అనేది గ్రహించినప్పుడు మనం చేయవలసిన ప్రధానమైన కర్తవ్యం ఏమిటో తెలుసుకోగలుగుతాము.

## 2.2. మదర్ తెరిసా భావాలు - ప్రార్థనలోని దశలు

ప్రార్థన అనేది హృదయాంతరంగములో నుంచి వెలువడే రహస్యమైన భక్తి గల సంభాషణ. ఉన్నది ఉన్నట్లు గ్రహించినది గ్రహించినట్లు వెల్లడి చేసే క్రియే ప్రార్థన. ప్రార్థనలో మనం ఉపయోగించే పదాలకు మనం ప్రత్యేకంగా వ్యాకరణం చూడనవసరం లేదు. వ్యాకరణం చూసి మెరుగు పరచవలసింది కాదు ప్రార్థన. యెషయా ప్రవక్త ద్వారా దేవుడు మనం హృదయముతో ప్రార్థించాలి అనే విషయాన్ని స్పష్టం చేస్తు "ఈ ప్రజలు వట్టి మాటలతో నా చెంతకు వచ్చుచున్నారు. కేవలము పెదవులతో నన్ను పూజించుచున్నారు. వీరి హృదయములు నాకు దూరంగా నున్నవి" (యెషయా 29:13) అని తెలియజేస్తున్నారు. పెదవులతో మాట్లాడు పరవశమైన పలుకులతో మనకు ఎలాంటి ప్రయోజనము రాదు. మనల్ని మనమే మోసంగించు కొనుచున్నాము. మదర్ తెరిసా ప్రార్థన పట్ల ఎలాంటి దృక్పథమును కలిగి ఉందో తెలుసుకోవడం ఎంతో అవసరం. మన అనుదిన జీవితంలో చేసే ప్రార్థనలో కూడా వివిధ దశలు ఉన్నాయనడంలో ఎలాంటి సందేహాలు లేవు. ప్రార్థనను మూడు దశలుగా విభజించవచ్చును.

### 2.2.1. మొదటి దశ – పెదవుల ప్రార్థన

మదర్ తెరిసా తన దినచర్యను గూర్చి తెలియజేస్తూ "ఒక గంట లేదా రెండు గంటలు నా దినచర్యను ప్రారంభించే ముందు ఆ దివ్య సత్ప్రసాదం ముందు ప్రార్థన చేసి, శక్తిని నేను తీసుకుంటాను. నాలో ఉన్న ఆ శక్తి నేను పని చేసేటప్పుడు ఆ పనిలో నేను పూర్తిగా నిమగ్నమైయ్యేలా చేస్తుంది. ఆ పనియే నా ప్రార్థనగా మలచబడుతుంది" అని అంటారు. మనం చేసే ప్రార్థన పెదవులతో కాక భక్తి గల హృదయంతో ప్రార్థించాలి. మొదటి దశలో పెదవులతో మాటలను పలకడం ద్వారా ప్రార్థిస్తాము. ప్రార్థించేటప్పుడు దేవుని మీద పరిపూర్ణంగా ఆధారపడి, ఇచ్చేవాడు భగవంతుడని నమ్మి పెదవులతో కాక హృదయంతో ప్రార్థిస్తే అది తప్పక జరుగును అని పునీత అగస్టిన్ గారు అంటారు.

### 2.2.2. రెండవ దశ – హృదయ ప్రార్థన

పునీత పౌలు గారు "ప్రార్థనను పట్టుదలతో చేయుడు. జాగరూకతతో మెలగుడు, కృతజ్ఞతా భావం కలిగి ఉండుడు"(కొలోస్సీ 4:2) అని తెలియజేస్తున్నాడు. మదర్ తెరిసా తన జీవితంలో హృదయంతో చేసే ప్రార్థనకు ఎంతో ప్రాముఖ్యతను యిచ్చింది. తద్వారా ఇతరులకు సేవ చేయడానికి తన పనిలో నిమగ్నమై ఉండెడిది. రెండవ దశలో మన మనసులను దైవీకమైన విషయాల మీద కేంద్రీకరిస్తాము. ప్రార్థన చేసేటప్పుడు నిర్లక్ష్యం పనికి రాదు. భక్తితో ప్రార్థించ వలెనని యేసుప్రభువు బోధిస్తున్నారు. ఆయన గెత్సమనే తోటలో తన పాటులను తలంచి రక్త చెమట వచ్చినప్పుడు ఘోరమైన వేదనలకు లోనైనారు. అప్పుడు ఆయన మరింత భక్తితో ప్రార్థించారు. ఆయన భక్తి గల ప్రార్థనకు తండ్రి దేవుడు చెవి యొగ్గి. తన దూతలను పంపి ఆయనను బలపరిచారు (లూకా 22:44) దీనిని గురించి చెప్పేటప్పుడు యేసుప్రభువు కన్నీరు కార్చి ప్రార్థించినట్లు కనిపిస్తుంది.

### 2.2.3. మూడవ దశ – దైవీకమైన ప్రార్థన

పునీత చిన్న తెరేజ గారు "ప్రార్థన గడియలలో సువార్త గ్రంథ పఠనాలు నాకు ఆలంబనలుగా నిలిచాయి, నన్ను ఆధ్యాత్మికంగా బలపరిచాయి. అవును దీనమైన నా ఆత్మకు అవసరమైన కృపావరాలను నేను సువార్త సందేశాల ద్వారా పొందగలిగాను, ప్రార్థన ద్వారానే నిగూఢ సత్యాలను అంతరార్థాలను సైతం గ్రహించగలిగాను" అంటారు. ఇక మూడవ దశలో దైవీకమైన విషయాల మీద నుంచి మన మనసును మరలించడమే మనకు కష్టమవుతుంది. మదర్ తెరిసా దైవికమైన ప్రార్థన దశలోనే ప్రార్థన చేయుట చేత దేవుని కృపా వరాలను పొందింది.

## 2.3. మదర్ తెరిసా వాక్య వివరణ

విక్టోరియా రాణి పంతొమ్మిది సంవత్సరాల వయసులో ఉన్నప్పుడు ఆమెను ప్రధానమంత్రి నిద్రలేపి, ఆమెను మహారాణి చేశారన్న వార్తలను అందించాడు. కొద్దిసేపు ప్రధానమంత్రిని అక్కడే వేచి ఉండమని చెప్పి, ఆమె ప్రార్థన చేయడానికి తన గదిలోకి వెళ్ళి పోయారు. అలానే వాటికన్‌లోని సిస్టైన్ దేవాలయాన్ని నిర్మించిన కాలంలో, ఆ దేవాలయంలోని గోడల మీద, లోపలి కప్పు మీద, మరియమాత చిత్రాలను చిత్రకారుడైన మైఖల్ ఆంజెలో చిత్రీకరించాడు. ఆ కాలంలో తాను వేసిన చిత్రాలు జీవంతో తొణికిస లాడాలని అతడు నిరంతరం మోకాళ్ళ మీద సాగిలపడి ప్రార్థన చేస్తూ ఉండేవాడట. ఆ చిత్రాలు నేటికీ అద్భుతమైన కళకు ప్రతిరూపాలుగా నిలిచి ఉన్నాయి. కానీ మదర్ తెరిసా "ప్రార్థించే పెదవుల కన్నా పని చేసే చేతులు మిన్న" అని చెప్పిన వాక్యము వినడానికి వింతగా ఉందని చెప్పడానికి అతిశయోక్తి లేదు. ఎందుకంటే ప్రార్థన అనేది జీవితంలో ఎంతో ప్రధానమైన విషయం అని చెప్పటం విధితమే. మదర్ తెరిసా "మార్త – మరియ" జీవితములతో  పోల్చినప్పుడు ఆమె స్వభావము మరియ  కంటే మార్తను పోలి జీవించినదిగా కనిపించవచ్చు. మరియమ్మ ఉత్తమమైనదని ఎన్నుకుంటే, మార్తమ్మ మాత్రం ఉత్తమమైన దాని కంటే పనినే ఎన్నుకుంది అలానే మదర్ తెరిసా కూడా ప్రార్థన కంటే ఎక్కువ పనికే ప్రాముఖ్యతను యిచ్చినదని తోచుచున్నది. దీనిని గురించి చర్చించుదాం.

## 2.4. ప్రార్థించే పెదవులు – పని చేసే చేతుల పరస్పర విరుద్ధమైన అంశాలు

యూదా మతానికి చెందిన ఒక కథ ఉంది. ఒక రోజు సాయంత్రం ఒక పేద రైతు బండిలో కూరగాయలు తీసుకెళ్ళి సంతలో అమ్మిన తరువాత తిరిగి ఇంటికి వెళ్తున్నాడు. రోజు ఆ సమయానికి అతడు ప్రార్థన చేస్తాడు. కానీ ఆ రోజు ప్రార్థన పుస్తకం తెచ్చుకోవడం మర్చిపోయాడు. ఇక దారి మధ్యలో అడవి మార్గంలో వస్తుండగా బండి చక్రం ఊడిపోయి, దారిలో ఆగవలసి వచ్చింది. దానికి తోడు ప్రార్థన పుస్తకం కూడా తన దగ్గర లేదు. దీనితో ఆ యూదుడు చాలా బాధపడి ఇలా ప్రార్థన చేశాడు:"ఓ దేవా! ఇవ్వాళ నేను చాలా తెలివి తక్కువ పని చేశాను. ఈరోజు ఉదయం ఇంటి దగ్గర నుంచి బయలు దేరినప్పుడు, నా ప్రార్థన పుస్తకాన్ని మర్చిపోయాను. నా జ్ఞాపక శక్తి ఎంతటిదో నీకు తెలియనిది కాదు. ఆ పుస్తకం లేకుండా నేను ఒక ప్రార్థన కూడా చేయలేను. ఓదేవా! ఒక పని చేస్తాను. నేను అక్షరమాల మొత్తాన్ని ఐదుసార్లు అప్పచెపుతాను. నీకు ఆ ప్రార్థనలన్నీ తెలుసు కాబట్టి నేను అప్పజెప్పిన అక్షరాలను ఆ ప్రార్థనల క్రమంలో నీవే అమర్చుకుని అర్థం చేసుకో" దేవుడు ఈ ప్రార్థన విని తన పరిచారకులతో ఇలా అన్నాడు: "నేను ఈ రోజు విన్న ప్రార్థనలన్నింటిలోకి ఇదే అత్యుత్తమమైనది. ఎందుకంటే ఈ ప్రార్థన ఒక సరళమైన, చిత్తశుద్ధి గల హృదయంలో నుంచి వెలువడింది" కనుక ప్రార్థన అనేది ఎంతో ప్రత్యేకతను కలిగి ఉంది. ప్రార్థనను పనితో పోల్చడం ఎంత వరకు సాధ్యమో ఆలోచించుకోవాలి? మదర్ తెరిసా చెప్పిన "ప్రార్థించే పెదవుల కన్నా పని చేసే చేతులు మిన్న" అనే వాక్యములోని ప్రార్థన, పని మధ్యగల పరస్పర విరుద్ధమైన అంశాలను గమనించుదాం!.

### 2.4.1. ప్రార్థన కంటే పని ప్రధానమైనదా?

మదర్ తెరిసాకు నిజంగా ప్రార్థన చేసుకునే అలవాటు ఉన్నదా లేదా? తన మనస్సును ఎల్లప్పుడును తాను చేసే పని మీదనే ఎక్కువగా లగ్నం చేసిందా? అమెరికా దేశపు అధ్యక్షులలో ఎంతో గొప్పవాడుగా పేరు పొందిన అబ్రహాం లింకన్ జీవితంలో ఎన్నో కష్టనష్టాల కోర్చి పైకెదిగాడు. ఆయన ప్రార్థన గురించి చెబుతూ, "అనేకసార్లు దేవుని దగ్గర తప్ప వేరే ఎక్కడ సమాధానం

దొరకదని రూఢిగా తెలిసినప్పుడు, నేను దేవుని ముందు మోకరిల్లాను!” అని చెప్పాడు. యేసు ప్రభువు తన పన్నిద్దరు శిష్యులను ఎన్నుకొనే విషయంలో “ఆ రోజులలో యేసు ప్రార్థన చేసుకొనుటకు కొండకు వెళ్ళెను రాత్రి అంతయు దైవ ప్రార్థనలో మునిగియుండెను”(లూకా 6:12) అని తెలియజేస్తుంది. అనగా ప్రార్థన అనేది మనం చేయుచున్న పనులను సఫలం చేస్తుంది. దేవుని కుమారుడైన యేసు ప్రభువు తాను చేయుచున్న పని దీవించమని తన తండ్రి పై ఆధారపడి ఉన్నారు. అలాగే ఉన్నతమైన అధికారం గల అబ్రహం లింకన్ కూడా తాను చేయవలసిన పనిని దేవునికి సమర్పించి ప్రార్థనలు చేసేవారు. కాని మదర్ తెరిసా విషయంలోఈ ప్రార్థన అనేది చాలా విభిన్నంగా కనిపించడం విశేషం. ప్రార్థన కంటే పని ముఖ్యమైనదా?అనే ఆలోచనలు పుట్టుకొస్తున్నాయి. ప్రార్థన లేని జీవితం సూర్యుడు లేని ఆకాశం లాంటిదని గ్రహించే స్థాయికి మదర్ తెరిసా ఆలోచించక పోవటంలో ఏమైనా ఆటంకాలు ఉన్నాయా అని ఆలోచించాలి.

## 2.4.2. పనికి మొదటి ప్రాధాన్యం యివ్వాల్నా?

“ఒక జీవితం మరొక జీవితాన్ని వెలుగిస్తుంది” గొప్ప వ్యక్తుల జీవితాలను ఆదర్శంగా తీసుకోవడం ద్వారా మనము కూడా అటువంటి వ్యక్తిత్వాలను, జీవితాలను నిర్మించుకోవడం సాధ్యమవుతుంది. మదర్ తెరిసాను ఎంతో మందికి ఆదర్శంగా తీసుకుని జీవించే వాళ్ళు ఉన్నారనడంలో ఎలాంటి సందేహాలు లేవు. అలాగే ఆమె చేసిన పనులు అనేక మందిని ఎంతగానో ప్రభావితం చేసాయి. ఆమె ప్రార్థనకు మొదటి ప్రాధాన్యతను యిచ్చిందా? లేదా పనికి మొదటి ప్రాధాన్యతను యిచ్చిందా?అనే ప్రశ్నలకు సమాధానాలు తెలుసుకొవటం ఎంతో అవసరం.“అడుగుడు, మీకు అనుగ్రహింపబడును. వెదకుడు మీకు దొరుకును, తట్టుడు మీకు తెరవబడును”(లూకా 11:9) అని యేసు ప్రభువు వాగ్దానం చేశారు. కాని మదర్ తెరిసా దేవునిపై అపార నమ్మకం కలిగి ఉండి, ఎల్లప్పుడు పనికి మొదటి ప్రాధాన్యత ఇవ్వడానికి ప్రయత్నిస్తుందా? అనే సందేహాలను, పరమార్థమును గ్రహించాలి.

## 2.4.3. ప్రార్థనలు నిజంగా పనిచేస్తాయా?

మదర్ తెరిసా చెప్పిన వాక్యమును మరింత లోతుగా ఆలోచిస్తే మనం చేసే పని మంచిదైతే దేవునికి ప్రార్థన చేయడం వ్యర్థమే అనే భావన కలిగిస్తుంది. ప్రార్థనలు నిజంగా పనిచేస్తాయా? అనేది ప్రశ్న? ఒక ప్రత్యేకమైన ఫలితాన్ని కోరకుండా చేసే ప్రార్థనలు ఏదో ప్రతిఫలాన్ని కోరే ప్రార్థనల కంటే ప్రభావితంగా పని చేస్తాయి. ఎందుకంటే ఏది తనకు మంచి చేస్తుందో మనిషికి తెలియదు. ప్రత్యేకంగా ఫలానా ఫలితం కావాలని కోరే ప్రార్థన  దాని ప్రభావాన్ని పరిమితం చేస్తుంది. ఈ విషయాన్ని వివరిస్తు సోక్రటీస్, "మనం అందరికి మేలు కోరి ప్రార్థన చేయాలి. ఎందుకంటే మనకు ఏది మేలు చేస్తుందో దేవునికి తెలుసు కదా!" అని చెప్పాడు. అస్సిరియా రాజు నుండి కాపాడుమని హిజ్కియా రాజు యెషయా ప్రవక్త ద్వారా యావేను ప్రార్థింపగ, "ఆ రాత్రి ప్రభువు దూత అస్సిరియా శిబిరముకు పోయి లక్ష యెనుబది ఐదు వేల మంది సైనికులను సంహరించెను. వేకువనే లేచి చూడగా వారందరూ చచ్చిపడియుండిరి(రాజులు రెండవ గ్రంథము 19:35). ప్రార్థన ఫలితంగానే దేవుని కృపను సహాయమును పొందగలము. అలాంటిది మదర్ తెరెసా చెప్పిన వాక్యము వలన ప్రార్థనలు నిజంగా పని చేస్తాయా అనే ఆలోచనలు పుట్టిస్తున్నాయి, అదే విధముగా ప్రార్థనల ఫలితం శూన్యము అనే భావన కలిగిస్తుంది.

## 2.4.4. ప్రార్థన అవసరమా?

మదర్ తెరెసా చెప్పిన "ప్రార్థించే పెదవుల కన్నా పని చేసే చేతులు మిన్న" అనే వాక్యానుసారంగా ఆలోచిస్తే, ప్రార్థించే పెదవుల కంటే పని చేసే చేతులు ముఖ్యం, కనుక ఈ మాటల ద్వారా ప్రార్థన అవసరమా అనే భావన కలిగిస్తుంది. తొలి మానవులు కూడా ప్రార్థనలు చేసేవారు అయితే అది కొంత వేరుగా ఉండేది. కనికట్టు ద్వారా, ఇంద్రజాలం ద్వారా వారి దేవునికి ప్రార్థన చేయడానికి ప్రయత్నించారు. ప్రకృతిలోని విపరీత పరిణామాలను చూసి తల్లడిల్లిన ఆది మానవుడు తనకు శక్యం కాని పనులను దేవుడు చేస్తున్నాడని, తాను కూడా దేవుని అనుకరించి, ప్రకృతికి అతీతంగా కనిపించే పనులను చేసి చూపితే భగవంతుడు సంతోషిస్తాడని భావించి ఉంటాడు. దేవుని మీద

విశ్వాసమే ప్రార్థనకు పునాది. వినయం దానికి తోడు నీడగా ఉండాలి. విశ్వాసం అనే ఒక్క నియమంతో మనం చేసే ప్రార్థనలన్నీ సాఫల్యాన్ని సాధించగలుగుతాయి. హృదయ పూర్వకంగా ప్రార్థన చేసినప్పుడు అది ప్రార్థన అవుతుంది. హృదయమే లేని మానవ జీవితం ఎంత చప్పగా, నిస్సారంగా, ఎండిపోయి ఉంటుందో ఊహించుకోండి! మదర్ తెరిసా ప్రార్థన పట్ల అవిశ్వాసనీయత కనబరుచుటను ఎట్లు సమర్థించగలం? అనేది ప్రశ్నార్థకం.

## 2.4.5. పనినే ప్రార్థనగా అలవర్చుకోవడం?

మదర్ తెరిసా పనినే ప్రార్థనగా అలవర్చుకుందా? పునీత చిన్న తెరిసా "అందమైన ప్రార్థనల కోసం వేటాడేందుకు నాకు శక్తి లేదని ప్రభువు ఎప్పుడు నన్ను అర్థం చేసుకుంటాడు" అని ఆమె వెల్లడించింది. "నాకు ప్రార్థన అంటే నా హృదయాన్ని పైకి ఎత్తి స్వర్గం వైపు చూడడం. ఈ ప్రార్థన గొప్పది, మన ఆత్మలను ఆ ప్రభువుతో ఏకం చేస్తుందని వ్యక్తపరిచింది. మదర్ తెరిసా ఎల్లప్పుడును పనినే దైవముగా లేదా ప్రార్థనగా భావించిందా? 13వ శతాబ్దానికి చెందిన మెథల్డ్ ఆఫ్ మాగ్డ్‌బర్గ్ (Mechthild of Magdeburn) అనే జర్మన్ యోగి ఇలా చెప్పాడు."మనిషి తన శక్తినంతా ఉపయోగించి చేసే ప్రార్థనకు గొప్ప శక్తి ఉంటుంది". ప్రార్థనకు పనికి అవినాభావ సంబంధముంది. కానీ పనినే ప్రార్థనగా అలవర్చుకోవడం, ఎంతవరకు అంగీకరించవచ్చు? అని వ్యక్తిగతంగా ప్రతి ఒక్కరు ఆలోచించుకోవాలి?

## 2.4.6. పనికి లేని శక్తి ప్రార్థనకు కలదా?

మదర్ తెరిసా చెప్పిన విధంగా ఆలోచిస్తే సాధారణముగా ప్రార్థనకు లేని శక్తి పని ద్వారా పొందవచ్చు అనే భ్రమలో పడిపోతుంటారు. మొదటి ప్రపంచ యుద్ధ కాలంలో జనం దేవాలయంలోకి చేరి తమ శత్రువులు నాశనం కావాలని ప్రార్థన చేసే వారు. వారి ప్రార్థన స్వార్థ పూరితమైనదన్న ప్రస్తావనను ప్రస్తుతానికి పక్కన పెట్టండి. అసలు విషయం ఏమిటంటే జీవితంలో ఎప్పుడు దేవాలయం ముఖం చూడని వారు కూడా ఆ సమయంలో దేవాలయంలోనికి వెళ్ళి ప్రార్థనలు చేశారు. అనగా ప్రార్థన ఎంతో శక్తివంతమైనది, కాని మనం చేసే పనుల ద్వారా దేవుని దీవెనలు పొందుతామేమో కావచ్చు గానీ, మదర్ తెరిసా చెప్పిన

మాటల ద్వారా పని చేసే చేతులకు, ప్రార్థనకు సమానమైన సరితూగు శక్తి ఉన్నదా? అని ఆలోచించుకోవాలి? ఈ రెండు అంశాలు ఎల్లప్పుడు విభిన్న అభిప్రాయాలన్ని వ్యక్తపరుస్తున్నాయి.

## 2.4.7. దేవుని ప్రార్థన కంటే పని ద్వారా ఎక్కువగా ప్రేమించగలమా?

మదర్ తెరిసా చెప్పిన "ప్రార్థించే పెదవుల కన్నా పని చేసే చేతులు మిన్న" అను వాక్యములో దేవుని ప్రార్థించే పెదవుల కంటే మిన్నగా పనిచేసే చేతుల ద్వారానే ప్రేమించగలమా? అనే అర్థానికి దారినిస్తుంది. ఇస్లాం మతంలో ప్రతి ఒక్కరిని రోజుకు ఐదు సార్లు ప్రార్థన చేయమని కోరతారు. సూఫిమతం ప్రకారం ప్రార్థన చేసే జీవితంలో మూడు దశలు ఉంటాయి. మొదటి దశలో పెదవులతో మాటలతో పలకడం ద్వారా ప్రార్థిస్తాము. రెండవ దశలో మన మనస్సులను దైవికమైన విషయాలమీద కేంద్రీకరిస్తాము. ఇక మూడవ దశలో దైవికమైన విషయాల మీద నుంచి మన మనస్సును మరలించడమే మనకు కష్టమవుతుంది. అలాంటప్పుడు దేవుని ప్రార్థన కంటే పని ద్వారానే ఎక్కువగా ప్రేమించగలమని, ఎలా చెప్పగలము? గాంధీజీ ప్రార్థనను గూర్చి హెచ్చరిస్తూ, "మీరు చేసే ప్రార్థన ఏ రూపంలో ఉన్నా ఫర్వాలేదు కానీ మీ నోటిలో నుంచి మాటలు వెలువడేటప్పుడు మీ మనస్సు ఎటో పారిపోకుండా జాగ్రత్త పడండి" అని చెప్పారు. అలాంటిది మదర్ తెరెసా ఆలోచనల ప్రకారం దేవుని ప్రార్థన కంటే పని ద్వారా ఎక్కవగా ఏ విధముగా ప్రేమించగలమో? ధృఢంగా ఆలోచించాలి.

## 2.5. ప్రార్థన – ఆధునిక ప్రయోగాలు

కట్టెలు కొట్టుకుని జీవించేవాడు ఒకడు ఉండేవాడు. అతడు అడవిలో కట్టెలు కొట్టి తీసుకువచ్చి ఊరిలో అమ్మేవాడు. వాడు ఒకసారి అడవిలో కట్టెలు కొడుతున్నాడు. అప్పుడు అతడికి ఒక గురువు ఎదురుపడి, "కుమారా, ముందుకు సాగిపో!" అని సలహా ఇచ్చి తన దారిన తాను వెళ్ళిపోయాడు. ఆ సలహా ఆ కట్టెలు కొట్టేవాడికి వెంటనే అర్థం కాలేదు. ఆ రోజుకు అమ్మగలిగినన్ని కట్టెలు కొట్టి తీసుకుపోయి, ఊరిలో అమ్మి, సాయంత్రానికి ఇంటికి చేరాడు. కానీ ఆ గురువు చెప్పిన మాట వాడి మనస్సులో మెదులుతునే ఉంది.

"ఆ గురువు నన్ను ఎందుకు ముందుకు సాగిపొమ్మన్నాడు?" అని ఆలోచించాడు. ఇలా ఆలోచిస్తూ ఉండగానే కొన్ని రోజులు గడిచిపోయాయి. ఒకరోజు వాడు, "ఆ గురువు చెప్పినట్టు ఈ రోజు అడవిలో ముందుకు వెళ్ళిచూడాలి", అనుకున్నాడు. అడవిలో కొంతదూరం ముందుకు వెళ్ళి అక్కడ ఏముందో చూశాడు. వాడికి అక్కడ లెక్కలేనన్ని మంచిగంధం చెట్లు కనిపించాయి. తన అదృష్టానికి వాడు ఎంతో సంతోషపడి బండ్లలో మంచిగంధపు చెక్క తెచ్చి అమ్మి, చాలా భాగ్యవంతుడయ్యాడు. కాలం గడుస్తూనే ఉంది. మరి కొంతకాలానికి గురువు తనతో, "ముందుకు సాగిపో!" అని చెప్పిన మాటలు వాడికి మళ్ళీ గుర్తుకు వచ్చాయి. అడవిలో మరికొంత దూరం ముందుకు వెళ్ళాడు. అక్కడ ఒక నది, దాని ఒడ్డున ఒక వెండి గని కనిపించాయి. వాడి ఆశ్చర్యానికి అంతులేదు. దానిలో నుంచి వెండిని త్రవ్వి తెచ్చి విక్రయించాడు. దానితో తన దగ్గర ఎంత ధనముందో తెలియనంత ధనవంతుడై పోయాడు. కొంతకాలం గడిచింది. ఒకరోజు ఆ కట్టెలు కొట్టేవాడు ఆలోచిస్తూ, "ఆ గురువు నన్ను ముందుకు సాగిపొమ్మన్నాడు కానీ అక్కడ గంధపు చెట్లు, వెండిగని ఉంటాయని చెప్పలేదు కదా! కాబట్టి అడవిలో ఇంకా ముందుకు పోయి, అక్కడ ఏమి ఉంటాయో చూస్తాను" అనుకున్నాడు. ఈసారి నదిని దాటి ఇంకా ముందుకు వెళ్ళాడు. అక్కడ వాడికి ఒక బంగారం గని కనిపించింది. "అరె! చూశావా! ఇందు కోసమే గురువు నన్ను ముందుకు పొమ్మన్నాడు" అని అనుకున్నాడు. ఆనందంతో గంతులు వేశాడు. అలాగే మనం అనుదిన జీవితపు ప్రయాణములో ఎల్లప్పుడును పెద్దలు చెప్పిన మాటలను గౌరవించి, దేవుని వైపుగా నడిచినపుడు మనము చేయుచున్న ప్రార్థనలు, తలంచిన పనులు మరింతగా దీవింపబడుతాయని కట్టెలు కొట్టుకుని జీవించే వాని కథ నుండి గ్రహించాలి.

## 2.5.1. ఆధునిక వైద్యుల ప్రయోగాలు

కొందరు శాస్త్రజ్ఞులు ప్రార్థనకు జబ్బులను నయం చేసే శక్తి ఉందని కనిపెట్టారు. గుండెజబ్బుల వైద్యుడైన డాక్టర్ రాం డాల్ఫ్ బైర్డ్, ప్రార్థనలు హృద్రోగుల మీద చూపిన ప్రభావాన్ని గురించి కొన్ని వింతైన విషయాలను

వెలిబుచ్చాడు. శాన్ ఫ్రాన్సిస్కోలోని వైద్యశాలలో వీరు పరిశోధనకు గురిచేయాలనుకున్న రోగులను రెండు వర్గాలుగా విభజించారు. ఒక వర్గం కోసం ప్రార్థన చేశారు, రెండవ వర్గం కోసం ప్రార్థన చేయలేదు. హృద్రోగులను ఎన్నుకునేటప్పుడు క్రమరహితంగా ఎన్నుకున్నారు. వారి పేర్లను బయట ఎవరికో చెప్పి, ప్రార్థన చేయించారు. రోగులకు కానీ, నర్సులకు కానీ, డాక్టర్లకు కానీ, ఏ రోగులు ఏ వర్గంలో ఉన్నారో చెప్పలేదు. చివరకు ఫలితాలను చూసినప్పుడు ఏయే రోగుల కోసం ప్రార్థన చేశారో వారు మరింత మెరుగ్గా కోలుకున్నట్టు గమనించారు. వారికి తక్కువ మందులు సరిపోయాయి. ఊపిరితిత్తుల్లో నీరు చేరడం (పల్మొనరీ ఎడీమా) కూడా తగ్గింది. ఆక్సిజన్ ఎక్కించవలసిన అవసరం, మొత్తంగా మరణాల సంఖ్య తగ్గాయి. ప్రపంచవ్యాప్తంగా ప్రార్థనలకు అసలు రోగ నివారణా సామర్థ్యం (థిరప్యూటిక్ వాల్యూ) ఏమైనా ఉందా అని వైద్యులు అనుమానిస్తూనే ఉన్నారు. అయితే ప్రార్థన యొక్క సామర్థ్యాన్ని ఋజువు చేస్తున్న ప్రయోగ ఫలితాలు నెమ్మది నెమ్మదిగా వెలుగులోకి వస్తున్నాయి. త్వరలోనే వైద్యుల సిఫారసులలో మందులతో పాటు ప్రార్థనలను గురించిన సూచనలను కూడా చేర్చవచ్చు. ఈ 'సత్యం' యొక్క అంశాలను పూర్తిగా అర్థం చేసుకోవడానికి ఆధునిక విజ్ఞానశాస్త్రానికి ఇంకా సమయం పడుతుంది.

## 2.5.2. ప్రార్థనల మీద జరిగిన కొన్ని పరిశోధనలు

జీవవ్యవస్థల మీద ప్రార్థనలు ప్రభావం చూపగలుగుతాయా? ఈ ప్రశ్న మీద స్పిన్‌డ్రిఫ్ట్ అనే సంస్థ పరిశోధనలు చేసింది. ఈ సంస్థ కార్యాలయం. సేలమ్, ఓరెగాన్, అమెరికా సంయుక్త రాష్ట్రాలలో ఉంది. వీరు మొలకెత్తుతున్న విత్తనాలు పరిశోధనలు చేసి ఇంతవరకు శాస్త్రబద్ధంగా నిరూపించని ఒక కొత్త విషయాన్ని వెలుగులోకి తెచ్చారు. వారు అలా చేసిన ప్రయోగాలలో మనం కొన్నింటిని పరిశీలిద్దాం. వీటిని గురించి 'రికవరింగ్ ది సోల్' (ఆత్మను స్వస్థపరచడం) అనే పుస్తకంలో డాక్టర్.లారీ డొస్సీ ప్రచురించాడు. వీరు చేసిన ప్రయోగాలలో తొట్టెలలో మొలకెత్తుతున్న విత్తనాలను తీసుకుని కొన్నింటి కోసం ప్రార్థన చేస్తూ, కొన్నింటి కోసం ప్రార్థన చేయకుండా ఉన్నప్పుడు ఏమవుతుందని పరిశోధించారు.

ఒక పరీక్షలో 'రై' విత్తనాలను తీసుకుని వాటిని ఒక తొట్టెలో నాటారు. తొట్టె మధ్యలో ఒక దారాన్ని ఉంచి దాన్ని రెండు సమాన భాగాలుగా చేసి వాటికి ఎ, బి అని పేర్లు పెట్టారు. ఒక భాగంలో విత్తనాలు బాగా మొలకెత్తాలని ప్రార్థనలు చేశారు. రెండవ భాగం కోసం చేయలేదు. ఆ తర్వాత ఎన్ని విత్తనాలు మొలకెత్తాయో లెక్కబెడితే, ప్రార్థన చేసిన భాగంలో ఎక్కువ విత్తనాలు మొలకెత్తడాన్ని గమనించారు. ఇదే ప్రయోగాన్ని అనేక సార్లు చేసినా అవే ఫలితాలు వచ్చాయి.

సాధారణంగా మనం ఆరోగ్యంగా ఉన్నవారికంటే అనారోగ్యంగా ఉన్నవారి కోసం ఎక్కువగా ప్రార్థన చేస్తాము. దీనినే మనస్సులో ఉంచుకుని, ఆ విత్తనాలను అనారోగ్యానికి గురిచేయడం వలన ఎటువంటి ఫలితాలు వస్తాయో ప్రయోగాలు చేశారు. విత్తనాలు నాటిన తర్వాత ఆ తొట్టెలో ఉప్పునీరు పోయడం ద్వారా మొలకెత్తే విత్తనాలను ఒత్తిడికి గురిచేశారు. మిగిలిన ప్రయోగం పైన చెప్పినట్టుగానే చేశారు. అయితే ఈసారి ఫలితాలలో తేడాలు కొట్టొచ్చినట్టు కనిపించాయి. ప్రార్థన చేయబడిన విత్తనాలే ఎక్కువ సంఖ్యలో మొలకెత్తాయి. రెండుజట్ల విత్తనాల మొలకల్లో చాలా ఎక్కువ తేడా కనిపించడం ద్వారా ఒత్తిడికి గురైన పరిస్థితిలో ప్రార్థన మరింత మెరుగుగా పని చేస్తుందని నిరూపించబడింది.

"ఇంకా ఎక్కువ ఒత్తిడికి గురిచేస్తే ఏమవుతుంది?" అని ఆ డాక్టర్.లారీ డోస్సీ ఆలోచించి, ఇంకా ఎక్కువ ఉప్పు నీటిని పోశారు. ఇలా ఎక్కువ ఒత్తిడిని కలిగించిన పరిస్థితిలో ప్రార్థనల ప్రభావం మరింత ప్రస్ఫుటంగా కనిపించింది. రెండు జట్లలో మొలకల తేడాల శాతంలో మరింత వ్యత్యాసం కనిపించింది. దీనిని బట్టి ఒత్తిడి ఎక్కువైన పరిస్థితులలో, భౌతిక పరిస్థితులు గడ్డుగా మారినప్పుడు, ప్రార్థనలు మరింత బాగా పని చేస్తాయని అర్థమయింది. తదుపరి ప్రయోగాలలో రకరకాల విత్తనాలతో పాటు, ఉష్ణోగ్రతలోను, తేమలోను తేడాలు సృష్టించి తద్వారా ఒత్తిడిని కలిగించి ప్రయోగాలు చేశారు. అన్ని ప్రయోగాలకు అటువంటి ఫలితాలే వచ్చాయి.

ఆపైన, మరొకరకం ప్రయోగం చేశారు. ప్రార్థన చేసిన వ్యవధిని బట్టి

ఫలితాలు ఎలా ఉంటాయో వాళ్ళు పరిశీలించి చూశారు. సోయా విత్తనాలు నాటిన ఒక తొట్టె కోసం రెండుసార్లు ప్రార్థన చేస్తే, మరొక దాని కోసం ఒక్కసారే చేశారు. ఒకసారి కన్నా రెండుసార్లు ప్రార్థన చేసిన తొట్టెలో విత్తనాలు మరింత పెరుగుదలను చూపాయి.

ఇంకా చేసిన రకరకాల ప్రయోగాలలో ప్రార్థన చేసేవారికి, తాము ఎవరి కోసం ప్రార్థన చేస్తున్నామో వారి గురించి ఎంత ఎక్కువ అవగాహన ఉంటే వారి ప్రార్థన అంత ఫలవంతంగా ఉంటుందని తెలుసుకున్నారు. ఇది చాలా అద్భుతమైన విషయం. అదే విధంగా ప్రార్థన చెయ్యడంలో ప్రావీణ్యత సాధించిన వారి ప్రార్థనలు అంత ప్రావీణ్యత లేని వారి కన్నా మెరుగ్గా పనిచేస్తాయి.

## 2.6. ముగింపు

పునీత అస్సిసి ఫ్రాన్సిస్,"మనం దేవుని ప్రార్థించేటప్పుడు దేనినీ కోరకూడదు" అని చెప్పాడు. ఎందుకంటే దేవుడు మన హృదయ అంతరంగములను ఎరిగిన వాడు. ప్రతి మనిషి జీవితంలో ప్రార్థించే పెదవులు మరియు పని చేసే చేతులు రెండు ముఖ్యమైనవే కానీ, మన అనుదిన జీవితంలో వాటిలో దేనికి ఎక్కువగా ప్రాముఖ్యతను యిస్తున్నామో? దానిని బట్టి ప్రతిఫలం ఉంటుంది. "సముద్రమంతా హృదయం మనకు ఉన్నా గాని దేవుని ప్రేమను తెలుసుకోవడం అసాధ్యమే" ఎందుకంటే దేవుని ప్రేమ అనంతమైనది ఆ అనంతమైన ప్రేమను పొందడానికి ప్రార్థన, పని అనే రెండు ఆయుధాలు అవసరమే. కాని మదర్ తెరిసా ఎక్కువగా పని మీదనే తన మనస్సును లగ్నం చేసినట్లు కనిపిస్తుంది. ఆ విషయం తదుపరి అధ్యాయంలో చుద్దాం.

# మూడవ అధ్యాయం : ప్రార్థించే హృదయం-పని చేసే చేతులు

## 3.0. ఉపోద్ఘాతం

"ధైర్యంగా వేసే ప్రతి అడుగులోను భయపెట్టే విమర్శలు వస్తుంటాయి. వింటూ ఆగి పోవడమా లేక వినకుండా సాగి పోవడమా అనేది నీ అడుగులోనే ఉంటుంది" అనేది ఒక సామెత. మదర్ తెరిసా చెప్పినట్లు "వంద మందికి నీవు సహాయపడ లేక పోవచ్చు కాని కనీసం ఒక్కరికైనా సహాయపడు"అని

ప్రపంచానికి మంచి సందేశాన్ని అందించిన మహనీయురాలుగా చరిత్రలో నిలిచిపోయింది. అదే విధంగా ప్రతి మనిషి జీవితం చరిత్రలో నిలిచి పోవాలంటే మొదటగా ప్రార్థన జీవితంతో పాటు, కష్టపడి పని చేసే చేతులు ఎంతో అవసరం. “సోమరీ! చీమలను చూడుము. వాని జీవితమును చూచి బుద్ధి తెచ్చుకొనుము” (సామెతలు 6:6) అని తెలియజేస్తుంది. ఒక్కరు నిజంగా ప్రేమిస్తే మనం తప్పు చేస్తే మొదట కోప్పడతారు కొంతకాలం దూరంగా పెడతారు కాని చివరికి అన్నీ మర్చిపోయి దగ్గరవుతారు అంతే గాని, కారణం దొరికింది కదా అని వదిలి వెళ్ళిపోరు. అలాగే జీవితం నీకు విజయాన్నివ్వదు కేవలం అవకాశాలను విజయాలుగా మార్చుకునే శక్తి నీ చేతుల్లోనే ఉంటుంది. కావున ప్రార్థన, పని అనే ఆయుధాలను ధరించి జీవిత ప్రయాణమును సఫలం చేయుటయే మన గమ్యంగా మార్చుకోవాలి.

## 3.1. మదర్ తెరిసా ముందున్న రెండు ప్రార్థన మార్గాలు

16వ శతాబ్దపు జర్మనీ దేశపు ప్రసిద్ధి వైద్యుడు పెరాసలస్ (Perasulus) “నమ్మకంతోనే అన్ని రోగాలను నివారించవచ్చు” అన్నాడట. కానీ అందరికీ ఈ దృఢమైన నమ్మకం ఉంటుందని చెప్పలేం. మదర్ తెరిసా జీవితమును క్షుణ్ణంగా ధ్యానిస్తే దేవుని మీద అపారమైన నమ్మకంతో జీవించింది అనడంలో ఎలాంటి సందేహాలు లేవు. పూర్వ నిబంధనలో మోషే యిస్రాయేలీయులందరిని ప్రోగుచేసి, దేవుని వాక్కు గూర్చి ప్రబోధిస్తు “జీవమును, మేలును, కీడును, మరణమును నేడు నేను మీముందట ఉంచుచున్నాను”(ద్వితీయోపదేశ కాండము 30:15) అని తెలియజేశాడు. తద్వారా యిస్రాయేలీయుల జీవితంలో పెను మార్పులు సంభవించాయి అని పవిత్ర గ్రంథం తెలియజేస్తుంది. అదే విధముగా మదర్ తెరిసా ముందు దేవుడు రెండు మార్గాలను చూపెడుతూ ఆమెకు సంపూర్ణమైన స్వేచ్ఛను దయ చేస్తున్నారు. ఆమె తన జీవిత ప్రయాణంలో ఎన్నో అవరోధాలను, అవమానములను ఎదుర్కొని దేవుని యందు తన ప్రగాఢమైన విశ్వాసం కనబరుస్తూ, పేద ప్రజలకు ఎనలేని సేవలు అందించారు. అంత గొప్ప మహనీయురాలు చేసిన ప్రార్థనను దేవుడు ఎల్లప్పుడు ఆలకించి, తన దైవ కృపచేత అనేక వరములతో దీవించారు. మరి ఆమె చేసిన ప్రార్థనకు

పునాది విశ్వాసమే అనేది నిగూఢమైన సత్యం. మదర్ తెరిసా ముందు ఉంచబడిన రెండు మార్గాలను గమనించుదాం!.

### 3.1.1. పెదవులతో చేసే ప్రార్థన

యేసు ప్రభువు ప్రార్థన విధానము గూర్చి తెలియజేస్తు, “కపటభక్తుల వలె మీరు ప్రార్థన చేయవలదు. ప్రార్థన మందిరములలో, వీథుల మలుపులలో నిలబడి, జనులు చూచుటకై ప్రార్థనలు చేయుట వారికి ప్రీతి. వారికి తగిన ఫలము లభించెనని మీతో వక్కాణించుచున్నాను. పార్థన చేయునప్పుడు నీవు నీ గదిలో ప్రవేశించి, తలుపులు మూసుకుని అదృశ్యుడైయున్న నీ తండ్రిని ప్రార్థింపుము. అట్లయిన రహస్య కార్యమునెల్ల గుర్తించు నీ తండ్రి నీకు తగిన బహుమానము ఒసగును. అన్యుల వలె అనేక వ్యర్థ పదములతో మీరు ప్రార్థింపవలదు”(మత్తయి6:5-7) అని యేసు ప్రభువు ఎంతో చక్కగా, అర్థవంతముగా ప్రార్థనను గూర్చి వివరించారు. ఏలియా జీవించు కాలంలో దేశమంతా పాపంలోనే ఉంది. దేశంలో ఒక ప్రక్క బాలు దేవతను పూజించడం, మరొక ప్రక్క యావేను నమ్మడం. ఇలా రెండు పడవల మీద కాళ్ళు పెట్టి జీవనం సాగిస్తున్నారు ప్రజలు. రాజ్యాన్ని పరిపాలించే ఆహాబు రాజు విగ్రహారాధకుడు. అతడు తూరు రాజు కుమార్తెయైన యెసెబెలును పెండ్లి చేసుకున్నాడు. యెసెబెలు పుట్టింటి వారు బాలును కొలిచేవారు. కాబట్టి ఆ రాణి యిస్రాయేలు దేశంలో బాలు దేవున్ని ప్రచారం చేసింది. భార్య ప్రోద్బలంపై సమరియాలో బాలు దేవతకు దేవళాన్ని నిర్మించాడు ఆహాబు. ఏలియా తప్ప రాజ్యంలో అందరు బాలు దేవతను కొలుస్తున్నారు. ఏలియా ఒక్కడే బాలు దేవతను పూజించ లేదు కావున అందరితో కలువలేదు. అతడు ఒక్కడైనా సరే యావేను పూజించి, యావేకు సాక్ష్యం పలికి అందరిని యావే వైపు తిప్పిన నాయకుడు. 1 రాజులు 18వ అధ్యాయంలో కార్మెలు కొండపై ఏలియా రాజుకి సవాలు విసిరాడు. యెసెబెలు రాణిని, రాణి పోషించే 450 మంది బాలు ప్రవక్తలను, యిస్రాయేలు ప్రజలందరిని ఆహాబు రాజు కొండ మీద ప్రోగు చేసెను. అప్పుడు ఏలియా “ఎన్నాళ్ళని మీరు ఇద్దరు దైవములను

పూజిస్తారు?" అని పలికి రాజుకి, బాలు ప్రవక్తలకు ఒక సవాలు విసిరాడు. మీరు కొలిచే బాలు దేవత నిజ దేవుడో లేదా నేను కొలిచే యావే నిజమైన దేవుడో తేలిపోవాలి. మాకు రెండెద్దులును యిప్పింపుడు. మీ ప్రవక్తలు ఒక ఎద్దును కోసి మాంసమును కట్టెల మీద పేర్చవలెను కాని నిప్పంటింప రాదు. నేను ఇంకో ఎద్దును కోసి, దాని మాంసాన్ని బలిపీఠంపై పేరుస్తాను గాని నిప్పంటించను. బాలు ప్రవక్తలు వారి దేవున్ని ప్రార్థింతురు, నేను ప్రభువును పార్థింతును. ఆ ప్రార్థనను విని నిప్పు పంపి, మాంసమును దహించు దేవుడే నిజమైన దేవుడు అని ఏలియా సవాలు విసిరాడు. ప్రజలందరు ఈ సవాలునకు సరియే అనిరి. మొదట బాలు ప్రవక్తలు ఎద్దును సంహరించి బలి పీఠంపై పేర్చి ఉదయము నుండి మధ్యాహ్నము వరకు ప్రార్థించారు. "బాలు! మా మొర వినుమని అరిచారు". బలి పీఠం చుట్టు తిరిగి చిందులు తొక్కిరి కాని బాలు దేవత నిప్పు పంపలేదు. మధ్యాహ్నం తర్వాత ప్రవక్తలింకను పెద్దగా ప్రార్థించిరి. తమ ఆచారము చొప్పున నెత్తురు కారు వరకు కత్తులతో, బాకులతో శరీరము కోసుకొనిరి. సాయంకాలము వరకు వారు ప్రార్థించిరి కాని బాలు దేవత నిప్పు పంపలేదు. ఏలియా పడిపోయిన యావే పీఠమునకు మరమ్మతులు చేసి, బలి పీఠంపై కట్టెలు పేర్చి వాని మీద ముక్కలుగా కోసిన ఎద్దును పెట్టెను. నాలుగు కడవల నీరు కూడా కట్టెలపై, మాంసముపై క్రుమ్మరింప చేసెను. మూడు సార్లు అలా నీరును క్రుమ్మరించిన తర్వాత ఏలియా పీఠమును సమీపించి దేవునికి ప్రార్థన చేసెను. యావే ప్రభువు నిప్పును పంపి పీఠం మీద ఉన్న మాంసాన్ని దహించాడు. అగ్నిని చూచిన ప్రజలు నేల మీద బోరిగిల పడి "యావే ప్రభువే దేవుడు" అని పలికిరి. ప్రజలు బాలు ప్రవక్తలందరిని పట్టుకొనగా ఏలీయా వారందరిని వధించెను. ఇలా కార్మెలు కొండపై ఏలియా ఒక్కడే యావే తరుపున పోరాడి గెలిచాడు. యావేపై తన దైవభక్తిని ప్రజలందరకు బోధించెను. మదర్ తెరిసా కూడా వట్టి పెదవులతో చేసే ప్రార్థనలను వ్యర్థముగా భావించి ప్రార్థించే పెదవుల కన్నా సాయం చేసే చేతులు మిన్న అని ప్రబోధించారు.

## 3.1.2. హృదయంతో చేసే ప్రార్థన

మదర్ తెరిసాగారు ఎక్కువ శాతం ఇతరులకు సహాయం (పని) చేయటలో గడిపేవారు కాని, ఆమె తన హృదయంలో ఎల్లప్పుడు ప్రార్థన చేస్తు, దేవుని శక్తిని పొందుతు "ఈ ఆనందంతో ఉండే హృదయం, ప్రేమతో తపించే హృదయం, నిత్యం మాటల్లో, చేతల్లో ప్రభువును స్తుతిస్తూ ఉంది అంటారు. దానియేలు జీవితంలో దేవునితో సంభాషించడంమే మొదటి పనిగా పెట్టుకుని జీవించాడు. అతడు ప్రతి రోజు మూడు సార్లు దేవునికి ప్రార్థించినట్లు మనం పరిశుద్ధ గ్రంథంలో చదువుతాము. మాదియుల రాజు బబులోనియా రాజ్యమును తన అరువది రెండవ యేట ఆక్రమించుకొన్నాడు. అతని కాలంలో దానియేలు, రాజుకు భద్రతను చేకూర్చి పెట్టటానికి నియమింపబడ్డాడు. రాష్ట్ర పాలకులు, పర్యవేక్షకులు, దానియేలు పరిపాలనలో తప్పులు పట్టజూచిరి కాని వారికి అతనిలో దోషమేమి కన్పింపలేదు. కనుక రాష్ట్రపాలకులందరు కలసి ఒక శాసనములు జారీ చేసి దానిని దేవరవారు ఖండితముగా అమలు పరచవలెనని కోరెను. రానున్న ముప్పదినాళ్ళ వరకు ఎవడును మీకు తప్ప అన్యదేవతకు గాని, అన్య నరునికి గాని ప్రార్థన చేయరాదు. ఈ ఆజ్ఞను మీరిన వానిని సింహముల గుంటలో పడవేయుదుమని శాసనము చేయించెను. కానీ దానియేలు ఇంటి మీద గది కిటికీలు యెరుషలేము వైపు తెరుచుకుని ఉండెను. అతడెప్పుడు చేస్తునట్లే ఆ కిటికీల ముందుకు మోకాళ్లూని రోజుకు మూడు మార్లు దేవునికి ప్రార్థన చేసి వందనములర్పించెను (దానియేలు 6:10) తద్వారా దానియేలును సింహాల గుంటలో పడవేసిన గాని తన హృదయముతో ప్రార్థన చేయాటం చేత దేవుడు దేవదూతలను పంపి సింగముల నోళ్లను మూయించెను(దానియేలు6.22) అని పవిత్ర గ్రంథం తెలియజేస్తుంది.

ఒక ప్రముఖమైన ఆధ్యాత్మిక గురువు ప్రార్థనను గూర్చి తెలియజేస్తు "దేవుడు తన పనిముట్లుగా వాడటానికి సమర్థులైన మనుష్యుల కోసం వెతుకుతుంటాడు. ఆయనకు మీరు సమర్థులని తోస్తే మిమ్మల్ని పూర్తిగా అరిగిపోయే" దాకా ఉపయోగిస్తాడు. ఆ విధంగా చూసినప్పుడు అన్నిటి కన్నా కష్టమైన ప్రార్థన "నన్ను నీ పని ముట్టుగా చేసుకో" అని కోరడమే. కాని అలా

ప్రార్థన చేయడానికి వెనుదీయకూడదు. ఒకసారి ఆయన చేతిలో పనిముట్టుగా మారాక, మన బాధ్యతను ఆయనే తీసుకుంటాడు కదా! అని అన్నారు. మదర్ తెరిసా కూడా ఎన్నో ఉన్నతమైన కార్యాలను సమర్థవంతంగా చేయడానికి తాను హృదయ పూర్వకంగా చేసిన ప్రార్థనయే ప్రధాన కారకముగా నిలుస్తుందని అనేక సందర్భాలలో తెలియజేశారు.

## 3.2. మదర్ తెరిసా చేసిన ప్రధానమైన పని

"దేవుని హస్తంలో నేనొక చిన్న పెన్సిల్ ముక్కను. వ్రాసేవాడు ఆయనే. ఆలోచించేవాడు ఆయనే. నడిపించే వాడు ఆయనే. నేను చేయాల్సిందంతా ఒక చిన్న పెన్సిల్ ముక్కగా నుండడమే" అని మదర్ తెరిసా ఒకసారి రోమ్ నగరంలో జరిగిన సభలో 1979లో చెప్పారు. ప్రపంచ ప్రఖ్యాతి చెందిన ఆమె, దీనతకు వినమ్రతకు ఒక రూపం. అవే సుగుణాలు ఆమెను ప్రపంచమునకు సుందరమైన తారగా, దేవునికి అందమైన కానుకగా చేశాయి. మదర్ తెరిసా దేవుని పిలుపునందుకొని మురికి వాడలలోనున్న, తనను సేవించ రమ్మని యేసు ఆహ్వానించాడు అని గ్రహించి, దేవుని మీద గట్టి నమ్మకంతో, పేదవారికి సేవ చేయడానికి తన పాదములను కదిపింది. పునీత అస్సీసీ ఫ్రాన్సిస్ "మానవుడు దేవుని రూపురేఖలతో సృష్టించబడ్డాడు ఇదే రూపంలో (మానవ రూపంలో) తాను గౌరవింపబడాలని దేవుడు కోరుకుంటారు" అన్నారు. కతోలిక శ్రీ సభ సత్యోపదేశం ప్రకారం దేవుడు మనుష్యులను ఈ లోకంలో తనను తెలుసుకొని ప్రేమించి, సేవించి అటువెనుక మోక్షము పొందుటకు మనుష్యులను సృష్టించెనని తెలుపుతుంది. మదర్ తెరిసా జీవితంలో కూడా తాను హృదయపూర్వకంగా దేవుని ప్రేమించడంలోను, మానవులను సేవించడంలోను ఎల్లప్పుడు నిమగ్నమై ఉండెడిది. తాను యేసుప్రభువును ప్రపంచానికి తన సేవల ద్వారా తెలియజేసింది.

### 3.2.1. దేవుని ప్రేమించడం

"దేవుడు లోకమును ఎంతో ప్రేమించి, తన ఏకైక కుమారుని ప్రసాదించెను. ఆయనను విశ్వసించే ప్రతివాడును నాశనము చెందక నిత్యజీవమును పొందుటకై అట్లు చేసెను" (యోహాను 3:16) అని పవిత్ర

బైబిల్ గ్రంథం తెలియజేస్తుంది. మదర్ తెరిసా జీవితంలో జరిగిన ఒక సంఘటన ఆధారంగా ఆమె దేవుని ఎంతగా ప్రేమించిందో మనకు అర్థమవుతుంది. దేవుని పిలుపులో ప్రత్యేక పిలుపును అందుకొని పేద వారికి సహాయం చేయడానికి ఎన్నుకోబడిన సందర్భంలో తన క్రొత్త జీవితాన్ని ప్రారంభించడానికి తన దగ్గర ఉన్నదంతా మొత్తం ఐదు రూపాయలు అనగా దేవుని యందు ఆమె కనబరిచిన నమ్మకమును మాటల్లో వర్ణించడం సాధ్యం కాదేమో! అనిపిస్తుంది. ఒకసారి కుష్వంత్ సింగ్ మదర్ తెరిసాను ఇంటర్వ్యూ చేస్తూ, "మిమ్మలను ప్రభావితం చేసిన వారు ఎవరు? గాంధీ? నెహ్రూ? అని అడిగితే "యేసుక్రీస్తు" అని తడుపుకోకుండా చెప్పింది. యేసే ఆమె నాయకుడు, ఆమె ప్రేరణ, ఆయనపై అభిమానం కేవలం ప్రేమతోనే సాధ్యమవుతుంది అని చెప్పారు. ఈ సంఘటనను ఆధారంగా చేసుకుని ధ్యానిస్తే, ఆమె జీవితంలో దేవున్ని ఎంతగా ప్రేమించిందో మనకు అవగతమవుతుంది. మరియతల్లి జీవితంలో కూడా యేసు జనన-సూచన ఒక ప్రకటనలో "ఇదిగో నేను ప్రభువు దాసురాలను నీ మాటచొప్పున నాకు జరుగును గాక!"(లూకా 1:38) అని తన సంపూర్ణ నమ్మకంతో తండ్రి దేవుని ఆజ్ఞను శిరసావహించినందుకు "అనుగ్రహ పరిపూర్ణరాలుగా" ఎన్నుకోబడింది. మదర్ తెరిసా జీవితంలో కూడా దేవుని పిలుపుకు విధేయించడం ద్వారా ఎంతోమంది పేద ప్రజలకు అమ్మగా ఎన్నుకోబడింది. దీని అంతటికి కారణము దేవుని సంపూర్ణంగా ప్రేమించడముతో పాటు, ఆమె చేసిన ప్రార్థనయే ప్రధాన కారకంగా నిలుస్తుంది.

## 3.2.2. మానవుని సేవించడం

ఒక సారి మదర్ తెరిసా కలకత్తా వీధుల వెంబడివెళ్తుందట. అక్కడ ఓ పెద్ద ఆసుపత్రి ఉంది. దాని ముందు ఒక అభాగ్యుడు చనిపోతూ చివరి గడియల్లో విలవిలలాడిపోతున్నాడట. అతన్ని ఎవరూ పట్టించుకోవడం లేదు. అంతా తమ దారిన తాముపోయే వాళ్ళు. అతను మదర్ తెరిసా కంట పడ్డాడు. వెంటనే అతని దగ్గరకు వెళ్లి పరామర్శించి, ధైర్యం చెప్పి ఆసుపత్రిలో చేర్పిస్తా ఉండు అని చెప్పి గబగబ ఆస్పత్రిలోకి వెళ్లి డాక్టర్లతో మాట్లాడింది కాని అతన్ని ఆస్పత్రిలో చేర్చుకోవడానికి డాక్టర్లు ఒప్పుకోలేదు. అతను ఏ క్షణంలోనైనా

చనిపోవచ్చు, అలాంటి వాళ్ళను తీసుకోము అని చెప్పారు. "అతను చనిపోవడం ఖాయమే అయితే కాస్త ప్రశాంతంగా మనుష్యుల మధ్య మనుషిలా చావనివ్వండి. రోడ్డు ప్రక్క దిక్కు మొక్కు లేని చావు చావడం మానవ జాతికే అవమానం" అని మదర్ తెరిసా ఎంత పయత్నం చేసిన గాని ప్రయోజనం లేకపోయింది. వెంటనే మరణించే వాని దగ్గరకు పరిగెత్తింది. ఇంకా కొన ఊపిరితో ఉన్నాడు అక్కడే ఉన్న మందుల కొట్టుకి వెళ్లి మందులు తెచ్చేసరికి అతను కన్నుమూశాడు. అప్పుడు మదర్ తెరిసా పొందిన ఆవేదన మామూలు మాటల్లో చెప్పలేం. యేసు ప్రభువు విందునకు ఆహ్వానము గూర్చి ప్రబోధిస్తూ "నీవు విందు చేయునప్పుడు పేదలను, వికలాంగులను, కుంటి వారిని, గ్రుడ్డి వారిని పిలువుము. వారు నీకు ప్రతిఫలము ఈయలేరు. కనుక నీవు ధన్యుడవు అగుదువు. నీతిమంతుల పునరుత్థాన కాలమున దీనికి ప్రతిఫలం లభించును" అనెను(లూకా14:13-14). అలాగే మదర్ తెరిసా చేసిన పనులను మాటల ద్వారా వర్ణించలేము అక్షరాల ప్రభువు చెప్పిన విధముగా తు.చ. తప్పకుండా చేసింది.

పునీత ఫ్రాన్సిస్ దేసేల్స్ "ప్రేమతో మనం దేవునికి భయపడాలి అంతే గాని భయంతో దేవుని ప్రేమించడం కాదు" అన్నారు. మన ఆధునిక ప్రాపంచిక జీవన ప్రయాణంలో కూడ తోటి మానవుని ప్రేమించమని అనేక గ్రంథాలు ప్రబోధిస్తున్నాయి. మదర్ తెరిసా చెప్పిన విధముగా "ప్రార్థించే పెదవుల కన్నా పని చేసే చేతులు మిన్న" అనే దానికి సారాంశముగా నిలుస్తుంది. యేసుప్రభువు లూకా సువార్త 10:25-37లో సమరీయుని ఉపమానం గూర్చి చెప్తుతూ, "ఒకనిని త్రోవలో దొంగలు చుట్టుముట్టి, దోచుకుని, గాయపరిచి కొన ఊపిరితో విడిచి వెళ్లారు. ఆ మార్గమున ఒక యాజకుడు, లేవీయుడు, వెళ్లుచు వాణ్ని చూచియు తప్పుకొని పోయెను. కాని ఒక సమరీయుడు అటు ప్రయాణమై పోయి అతనిని చూసెను. వారిని చూడగానే అతడు జాలిపడి, వాని దగ్గరకు వెళ్లి గాయములకు తైలము, ద్రాక్షరసము పోసి కట్టు కట్టెను. పిమ్మట వానిని తన వాహనంపై కూర్చుండబెట్టి ఒక సత్రమునకు తీసుకొనిపోయి పరామర్శించెను. అదే విధముగా మదర్ తెరిసా చేసిన పనిని గమనిస్తే మంచి సమరీయుడు ఏ విధముగా అయితే యేసుప్రభువు చేత అభిమానింపబడ్డాడో

అలాగే ఆమె తోటి మానవుల పట్ల చూపిన ప్రేమ ఎంతో ఉన్నతమైనదిగా వర్ణించవచ్చును.

## 3.3. మదర్ తెరిసా చెప్పిన వాక్య నిరూపణ

మదర్ తెరిసా చెప్పిన "ప్రార్థించే పెదవుల కన్నా పని చేసే చేతులు మిన్న" అనే వాక్యంలో రెండవ అధ్యాయంలో ప్రార్థన, పని మధ్య గల పరస్పర విరుద్ధమైన అంశాలను గూర్చి విని ఉన్నాము. ముందుగా మదర్ తెరిసా చెప్పిన వాక్యమును మొదటగా వినినప్పుడు అందరు ఏదో అందులో పెద్ద తప్పు ఉన్నాదనే భ్రమలో పడిపోతుంటారు. మదర్ చెప్పిన వాక్యమును లోతుగా ధ్యానిస్తే, ఆమె చెప్పినది అక్షరాల నిజమనిపిస్తుంది. "ప్రభువా! ప్రభువా! అని నన్ను సంబోధించే ప్రతివాడును పరలోక రాజ్యములో ప్రవేశింపడు కాని, పరలోకమందలి నా తండ్రి చిత్తానుసారముగా వర్తించు వాడే పరలోక రాజ్యమున ప్రవేశించును (మత్తయి 7:21) అని యేసుప్రభువు స్వయంగా చెప్పుతున్నారు. అదే విధముగా మదర్ తెరిసా కూడా ప్రార్థన అనేది దేవుడు మెచ్చుకునే విధముగా హృదయముతో చేయాలే గాని పెదవులతో చేసే ప్రార్థన, సరైన ప్రార్థన అనబడదు అనేది ఆమె ఉద్దేశ్యము. ప్రభువా! ప్రభువా! అని సంబోధించి వాక్యములు హృదయ అంతరంగములో నుండి వచ్చినవి కావు కాని పెదవుల నుండి వచ్చే మాటల్లో ప్రేమ ఉండదు. కనుక ప్రార్థనకు కావలసినవి మాటలు కావు మాటలు లేని మంచి హృదయం కావాలి. మదర్ తెరిసా పెదవులతో చేసే పార్థన కంటే హృదయంతో చేసే ప్రార్థనకే ఎక్కువ ప్రాముఖ్యతను యిచ్చింది. అలాగే తాను చేసే ప్రతి పని దేవునికి సమర్పించి దానిని సఫలం చేయమని దివ్యమందసం ముందు మోకాళ్ళ మీద ఉండి గంటల తరబడి దేవుని మీద భారం వేసి ప్రార్థన చేసింది కావున ఎంతోమంది అభాగ్యులకు సేవ చేయగలిగింది. ప్రార్థన చేయలేని క్షణం ఆ అమ్మ జీవితంలోనే లేదు.

మదర్ తెరిసా జీవితంలో ప్రార్థన కంటే పనికే మొదటి ప్రాధాన్యము నిచ్చిందా? అనే ప్రశ్నలకు సమాధానం ఆమె ప్రతి రోజు చేసిన ప్రార్థన సమాధానమిస్తుంది మదర్ "హే ప్రభువా, ఈ లోకంలో దరిద్రంతో, ఆకలితో మృతి చెందే వాళ్లకు మమ్మును సహాయపడ నిమ్ము, మా చేతుల మీదుగా

పిడికెడు మెతుకులు వాళ్లకు పెట్టనివ్వు: అణగారి పోయిన జీవితాలలో ఆశా జ్యోతిని వెలిగించ నివ్వు, ప్రేమతో ఆదరించి ఆనందాన్ని కలిగించే శాంతి సాధనాలుగా మమ్ము రూపొందించు ప్రభువా" అని హృదయ పూర్వకంగా ప్రార్థన చేసే వారు. ఏ విధముగా అలోచించినగాని మదర్ పని కంటే ప్రార్థనకు ఎక్కువ ప్రాముఖ్యతను యిచ్చినదిని తెలుస్తుంది. తాను చేయుచున్న పనికి కావాలసిన శక్తిని ప్రార్థన ద్వారానే పొందేది.

యేసు ప్రభువు తన జీవితంలో ప్రార్థనకు ఎంతో ప్రాముఖ్యతను యిచ్చారు పన్నిద్దరు శిష్యులను ఎన్నుకోవడానికి" ఆ రోజుల్లో యేసు ప్రార్థన చేసుకొనుటకై కొండకు వెళ్ళెను. రాత్రి అంతా దైవ ప్రార్థనలో మునిగి యుండెను (లూకా 6:12) అని పవిత్ర గ్రంథం తెలియజేస్తుంది. ప్రార్థన అనేది ప్రతి మనిషి జీవితంలో ఎంతో అవసరం. ప్రార్థన ద్వారానే ఉన్నతమైన సత్ఫలితాలను పొందగలుగుతాము. ప్రార్థనను ఎప్పుడును కూడ పనితో పోల్చలేము కాని మనం చేసే ప్రతి పనిని కూడా ప్రార్థనపై ఆధారపడి యున్నప్పుడు దాని ఫలితం ఎంతో అద్భుతంగా ఉంటుంది. పవిత్ర గ్రంథంలో ప్రార్థన ద్వారా ఎందరో తమ జీవితంలో ఉన్న అంధకార చీకటిని తొలగించుకొని, వెలుగు ప్రకాశించెలా చేసుకున్నారు. మదర్ తెరిసా ప్రార్థన అనుగ్రహించే ఫలాల గూర్చి తెలియజేస్తూ "మౌనం యొక్క ఫలితం పార్థన. ప్రార్థన యొక్క ఫలితం నమ్మకం. నమ్మకం యొక్క ఫలితం ప్రేమ. ప్రేమ యొక్క ఫలితం సేవ. సేవ యొక్క ఫలితం సంతృప్తి" అని చెప్పారు.

## 3.4. మదర్ తెరిసా చేసిన సేవా కార్యములు

జగద్గురువు రెండవ జాన్ పాల్ గారు, అక్టోబర్ 19, 2003 వాటికన్‌లో ఉన్న సెయింట్ పీటర్స్ బసిలికా ప్రాంగణంలో మదర్ తెరిసాను "ధన్యురాలుగా" ప్రకటిస్తూ ఈ విధంగా అన్నారు. "మదర్ తెరిసా బహు ధైర్యశాలి, ఆమె ఎప్పుడును నా పక్కనే ఉన్నట్టు భావిస్తాను. నాకు అదొక ధైర్యాన్ని కలిగిస్తుంది. అందుకు ఆమెకు వందనస్తుడను. అనాథలను, అన్నార్తులను ఆదుకున్న తెరిసా "మంచి సమరీయుడు" అని యేసు పేర్కొన్న వ్యక్తి లక్షణాలకు ప్రతీక, సజీవ ప్రతిమ. అతి సాధారణమైన జీవితాన్ని జీవిస్తూ, అల్పులైన నిరుపేదల పెన్నిధియై,

వాళ్ల కోసం అహర్నిశలు శ్రమించిన ఘనురాలు. యేసుప్రభువు మీద అచంచలమైన విశ్వాసమును కలిగి దీనస్థితిలో ఉన్న దీనాతి దీనుల సేవలో, ఆయనను చూసింది. ఆ సేవలన్నీ తాను యేసుప్రభువుకు చేస్తున్నట్లు విశ్వసించింది" అని కొనియాడారు. మదర్ తెరిసా జీవితము ద్వారా తాను ప్రార్థనకు, పనికి ఎంతగా ప్రాముఖ్యతను ఇచ్చిందో అవగతమవుతుంది. నాణేనకి బొమ్మ, బొరుసు ఏ విధంగా ప్రతిరూపాలుగా ఉంటున్నాయో అదే విధంగా ఆమె జీవితంలో కూడా ఈ రెండు కార్యములు ఎంతో ఉన్నతమైన స్థానమును కలిగి యున్నవి. తోబితు తన కుమారుడైన తోబియాతో "ఆకలిగొన్న వారికి అన్నము పెట్టుము, బట్టలు లేని వారికి బట్టలు లిమ్ము. నీకు సమృద్ధిగా నున్న ప్రతి వస్తువు నుండి కొంత భాగము దానముగా నిమ్ము. ఇచ్చే దానిని ప్రీతితో నిమ్ము (తోబితు 4:16)" అని ప్రబోధించాడు. మదర్ తెరిసా చేసిన ఆధ్యాత్మిక, భౌతికకారుణ్య క్రియలను గమనించుదాం.

### 3.4.1. ప్రార్థన - ఆధ్యాత్మిక కారుణ్య క్రియలు

మదర్ తెరిసా యేసుప్రభువు నోటి నుండి వెలువడిన "మీ తండ్రి వలే మీరును కనికరము గలవారై యుండుడు (లూకా 6:36) అను వాక్యమును ఆధారంగా చేసుకుని ఆధ్యాత్మికంగా దేవుని సేవలో ఎదిగింది. పవిత్ర గ్రంథములో యేసుప్రభువు ఆధ్యాత్మిక కారుణ్య క్రియల ద్వారా ఎంతో మందికి దేవుని ప్రేమను అందించారు.నాల్గవ శతాబ్దంలో మిలన్ నగరంలో పునీత అంబ్రోస్ గారు "మంచి కాపరి" అనే సామెత మీద ఒక ఉపన్యాసమిచ్చాడు. అతని భావన ప్రకారం క్రీస్తు మన మంచి కాపరి. మనమంతా పాపపు పొదల్లో చిక్కి దిక్కు మాలిన వారిగా ఉండగా ఆ కాపరి జాలితో మనలను వెతుక్కుంటూ వచ్చాడు. అతడు శిలువ మీద తాను చాచిన భుజాల మీదికి మనలను ఎక్కించుకున్నాడు. మనకు పాప విముక్తి కలిగించాడు. ఆ నెనరుగల కాపరికి మనం చేతులెత్తి మొక్కాలి" అన్నారు. అలాగే మదర్ తెరిసా ఎల్లప్పుడును ఆధ్యాత్మిక కార్యక్రమాలను చేయుటలో సంసిద్ధంగా ఉండేది. ముఖ్యంగా వివిధ రోగాలతో బాధపడుతున్న వారిని ఓదార్చి, బాధితులకు ఉపశమనం కలిగించడంలో వారికి సహాయం చేస్తూ వారిలో మానవత్వ విలువలను

పెంపొందించటం ద్వారా ఎందరికో ఆదర్శ మూర్తిగా నిలబడింది. ఆమె ఇతరుల మేలు కోరి ప్రార్థించడంలోనూ, మరణించిన వారి ఆత్మలకు నిత్య విశ్రాంతిని దయ చేయుమని తన హృదయంతో ప్రార్థన చేస్తూ మరణించిన వారిని సమాధి చేయుటలో అనుసరించవలసిన అంత్యక్రియలను ఎంతో ప్రేమతో చేసి, ప్రార్థన ద్వారా తాను చేసే పనుల ద్వారా ఎంతో మందికి ఆదర్శప్రాయులుగా నిలిచారు.

## 3.4.2. పని - భౌతిక కారుణ్య క్రియలు

కతోలిక శ్రీ సభ సత్యప్రదేశం కారుణ్య క్రియల గురించి తెలియజేస్తూ, “ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టడం, నిరాశయులకు ఆశ్రయం కల్పించడం, వస్త్రాలు లేని వారికి వస్త్రాలు ఇవ్వడం, అనారోగ్యంగా ఉన్న వారిని సందర్శించడం, వీటన్నిటిలో పేదలకు దానధర్మాలు చేయడం ప్రధానంశం. ఇది సోదర ప్రేమకు ముఖ్యమైన నిదర్శనం, సాక్ష్యం, ఇది న్యాయసమ్మతమైన కార్యం. దేవునికి ఇష్టమైన క్రియ (2447)” అని ప్రబోధిస్తుంది. మదర్ తెరిసా జీవితంలో పైన పేర్కొన్న వాటిని ప్రేమతో, ఓర్పుతో, ఎల్లప్పుడు చేసింది అనడంలో ఎలాంటి సందేహం లేదు. ఆమె భౌతిక కారుణ్య క్రియల పట్ల, తాను చేసే పని పట్ల ఉన్న ప్రేమను ఒక సంఘటన ద్వారా తెలుసుకోవచ్చును, అది మదర్ తెరిసా ఆహ్వానం మేరకు జగద్గురువు రెండవ జాన్ పాల్ గారు కలకత్తాలోని నిర్మల హృదయ గృహానికి వచ్చారు. లోపల అడుగుపెట్టిన జగద్గురువుకు మృత్యుముఖం కొట్టుమిట్టాడుతున్న అభాగ్యులు ముకుళిత హస్తాలతో స్వాగతం పలికారు. వారి పక్కన మదర్ తెరిసాతో పనిచేసే మఠకన్యలు సవినయంగా నమస్కరించి తమ పనిలో నిమగ్నమయ్యారు. ఒకరిద్దరి పరిస్థితి మరీ దారుణంగా ఉంటే మదర్ వెంటనే లేచి వారిలో ఒక అతని దగ్గరకు వెళ్లి అతన్ని తన అక్కున చేర్చుకుని ఓదార్చడం మొదలు పెట్టింది. యావత్తు ప్రపంచమునకు అధిపతియైన జగద్గురువులు నిశ్చేష్టుడయ్యాడు. అంతగా అంకితభావంతో సేవ చేస్తున్న మదర్ తెరిసా ఆయన్ని ఆశ్చర్యముతో ముంచివేసింది.

యేసు ప్రభువు తుది తీర్పు సమయంలో నీతిమంతులు చేసిన భౌతిక కారుణ్య క్రియలను గూర్చి తెలియజేస్తు “ఈ నా సోదరులలో అత్యల్పుడైన

ఏ ఒక్కనికి మీరు ఇవి చేసినప్పుడు అవి నాకు చేసితిరి అని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాను అని వారితో పలికెను (మత్తయి 25:40). మదర్ తెరిసా తన జీవితంలో ప్రార్ధనతో పాటు, పనికి ఇచ్చిన ప్రాముఖ్యతను బట్టి ఆమెలోని ఔదార్యం కనిపిస్తుంది. మరొక మాటలో చెప్పాలంటే ఆమె చేసిన భౌతిక క్రియల ద్వారా యేసు ప్రభువు "ఈ జనులు మూడు దినముల నుండి ఇక్కడ ఉన్నారు. వీరికి తినుటకు ఏమియు లేదు. వీరిని చూడ నాకు జాలి కలుగుచున్నది" (మత్తయి 15:32) పలికిన మాటల్లోని ప్రేమ, జాలి ఆ అమ్మలో కనిపిస్తున్నాయి. రెండవ వాటికన్ మహాసభ "పేదల పట్ల విశేష ప్రేమను కనబరచడం అనేది మన ప్రధాన విధి. ఆ విధి ప్రకారం మనం వాళ్లకోసం కారుణ్య క్రియలు చేపట్టక తప్పదు" అని ప్రబోధిస్తుంది. హోషేయా ప్రవక్త దేవుని ప్రేమను వెల్లడిస్తూ "నేను మీ నుండి కోరినది ప్రేమ గాని బలులు కాదు" (హోషేయా 6:6) తెలియజేస్తున్నాడు. అదే విధముగా దేవుని ఆజ్ఞ మేరకు కరువు కాలంలో ఏలియా ప్రవక్తకు "ప్రతి దినము ఉదయ సాయంకాలమందు కాకులు అతనికి రొట్టెను, మాంసమును కొనివచ్చెను" (1 రాజుల గ్రంథము 17:6). మదర్ తెరిసా కూడా ఆకలితో అలమటించే వారికి భోజనం అందించడం ఆమెలోని మాతృత్వపు ప్రేమని అమూల్యమైన వజ్రాల కంటే మిన్నగా చేసింది.

## 3.5. మదర్ తెరిసా జీవితంలో ప్రార్థన ప్రాముఖ్యత

మానవ జీవితంలో ప్రార్థనకు అత్యంత ప్రాధాన్యం యివ్వబడినది. ఎందుకంటే ఈ ప్రార్థన సరైన మార్గంలో నడుచుటకు మనకు కావలసిన దైవీకమైన శక్తిని ప్రసాదిస్తుంది. మన అనుదిన జీవితంలో ప్రార్థన చేసుకోవడానికి ఎంత సమయం కేటాయిస్తున్నాము? ప్రార్థనకు దైవ అనుగ్రహ శక్తి ఉందని ఎంతవరకు మనం విశ్వసిస్తున్నాము అని ఆత్మపరిశీలన చేసుకోవాలి. ప్రార్థనకు ఎంత శక్తి ఉందంటే మాటల్లో గాని, చేతుల్లో గాని, చెప్పలేనంత శక్తి దాగి ఉంది. దేవుని శక్తి అనంతమైనది, పరిధిలు లేనిది అనగా అంతము లేనిదిగా భావించడం జరిగింది. ప్రార్థన శక్తి అన్ని శక్తుల కంటే ఎంతో ఉన్నతమైనది. కావున మన అనుదిన జీవితంలో ప్రార్థనకు మొదటి స్థానాన్ని యిస్తే మన జీవితంలో దేవుని వెలుగు అనే ప్రేమ, శాంతి, కరుణ ఫలాలు నిరంతరంగా

ఫలిస్తాయి అనడంలో అతిశయోక్తి లేదు.

ఓ మహాకవి ఇలా అంటాడు: "ఈ విధంగానే నిర్దిష్టంగా ప్రార్థించాలని ఏ ఒక్కరూ కూడా చెప్పలేము, చెప్పకూడదు. ఎందుకంటే ఒక దృశ్యం అనేది అందరికీ కూడా ఒకేలా కనబడదు. దానిని ఒకే విధంగా చిత్రీకరించలేరు". అలానే ప్రభువుతో మనలను ఏకం చేసే ఈ ప్రార్థన తీరు ఇలానే ఉండాలి అని చెప్పలేం. ప్రతీ వ్యక్తి తనకు తానుగా ఈ ప్రార్థనానుభవంలోకి వెళ్ళాలి. కొన్ని పద్ధతులు, కొన్ని సూత్రాలు పనిచేస్తాయి. కాని, వ్యక్తిగతంగా ఉండాలని సూచిస్తున్నారు. 1 తెస్సలోనిక 5:17 లో జీవితంలో ప్రార్థన అనేది ఒక భాగం కావాలి. జీవితంలో మిళితమైపోవాలి. అందుకే అగస్టీనుగారు ఈ విధంగా అంటారు: "ప్రార్థించడం అనేది నీ జీవితంలో ఒక కోరిక కావాలి. (Your prayer is your desire) నీ కోరికకు, నీ ఆలోచనకు అనుగుణంగా నీ ప్రార్థన ఉండాలి.

### 3.5.1. ప్రార్థనకు విశ్వాసమే పునాది

ఒకానొక సమయంలో ఒకానొక ప్రాంతంలో పెద్ద కరువు వచ్చింది. ఏళ్ళ తరబడి వర్షాలు కురవడం లేదు. ఊరి వారందరూ దూర ప్రాంతానికి చెందిన ఒక ఆధ్యాత్మిక గురువు వద్దకు వెళ్లి సలహా అడిగారు. ఆయన "మనమందరం కలిసి ఒక నూతన బలిపీఠము తయారు చేసి దివ్యబలి పూజ దేవునికి సమర్పించుదాం ఆ సమయంలో మీరందరూ హృదయపూర్వకంగా ప్రార్థించాలి. మీరు అలా చేయగలిగితే వెంటనే వానలు కురుస్తాయి" అని వారికి భరోసా ఇచ్చారు. దానికి సరైన రోజును కూడా నిర్ణయించారు. ఆ దివ్యబలి పూజను సమర్పించే రోజున వేకువనే ఊరి వారందరు నూతనంగా నిర్మించిన పూజబలి పీఠము చెంతకు బయలు దేరారు. ఒక ఆరేళ్ల బాలుడు కూడా వారితో బయలుదేరి ఒక గొడుగును కూడా చేతపట్టుకుని వారితో నడవసాగాడు. మిగిలిన వారందరూ ఆశ్చర్యంతో "ఆకాశంలో మబ్బుతునకైనా లేదు కదరా! ఇప్పుడు ఆ గొడుగుతో ఏం పని"? అని ఆ బాలుని ప్రశ్నించారు. దివ్యబలిపూజ జరుగుతున్నప్పుడు మనమందరం ప్రార్థనలు చేస్తాం కదా! ఆ ప్రార్థనలు విన్న దేవుడు వెంటనే వానలు కురిపిస్తాడు కదా! మరి ఆ జోరున

కురిసే వర్షంలో తిరిగి రావడం ఎలా? అందుకోసమే ఈ గొడుగు! అని ఆ బాలుడు జవాబిచ్చాడు. ఊరి వారి ప్రార్థనలు తప్పక ఫలిస్తాయన్న నమ్మకం ఆ బాలుడొక్కడికే ఉంది. ఆ ఊరి పెద్దలలాగా అరకొర విశ్వాసంతో చేసే ప్రార్థన వల్ల కలిగే ప్రయోజనం శూన్యం! కనుక ప్రార్థనకు విశ్వాసం అనే పునాది చాలా అవసరం. దేవుడు అబ్రాహామును పరీక్షించి, "నీ కుమారుని, ఈసాకును వెంటబెట్టుకొని మోరియా ప్రదేశమునకు వెళ్ళుము. అక్కడ నీకొకకొండను చూపుదును. దానిమీద నీ కుమారుని దహన బలిగా సమర్పించుము(ఆది 22:2) అని చెప్పెను. అందులకు అబ్రాహాము దేవుని యందు కనబరిచిన విశ్వాసమునకు మూలంగా దేవుని దీవెనలతో పాటు దేవుని దృష్టిలో విశ్వాసపాత్రుడుగా మిగిలాడు. "ఆత్మ లేని శరీరము నిర్జీవమైనట్లే, చేతులు లేని విశ్వాసము మృతప్రాయమే"(యాకోబు 2:26) అని పవిత్ర గ్రంథము తెలియజేస్తుంది.

## 3.5.2. ప్రార్థన ద్వారా మహనీయులైన వారు

రాష్ట్రపతి నీలం సంజీవరెడ్డిగారు మదర్ తెరిసాకు"భారత రత్న" పురస్కారం అందచేస్తున్నప్పుడు "తోటి మానవుల పట్ల ప్రేమను, దయను, తమ వ్యక్తిత్వంలో భాగంగా చేసుకున్న వారు చరిత్రలో చాలా అరుదుగా కనిపిస్తారు. ఆమె తన జీవితాన్ని మానవ సేవకు పణంగా పెట్టిన మహనీయురాలు. ఇలాంటి గుణాలు ఆదర్శాలుగా చెప్పుకోవడమే గాని ఆచరణలో పెట్టే వారు బహు తక్కువ"అన్నారు. మదర్ తెరిసా అనుదిన జీవితంలో ప్రార్థనతో చేసిన సేవాకార్యాలకు గాను చరిత్రలో మహనీయురాలుగా నిలిచిపోయారు అనడంలో మరొక్క ఆలోచనలు లేవు. "ప్రార్థన అనే తాళం చెవితో దేవుని హృదయం అనే గదిని తెరవగలం" అనే సామెత మనల్ని ఎంతగానో ప్రభావితం చేస్తుంది. మోషే దేవుని పిలుపును అందుకొని యిస్రాయేలు ప్రజలను నలభై సంవత్సరాల పాటు ఎడారిలో నడిపించుటకు కావాల్సిన శక్తిని ప్రార్థన ద్వారా పొందారు. "మోషే ప్రభువుతో నలువది పగళ్లు నలువది రాత్రులు గడిపెను(నిర్గమ 34:28) తదనంతరం కొండమీది నుండి దిగి వచ్చినప్పుడు యావేతో మాటలాడి వచ్చుట వలన అతని ముఖం

ప్రకాశించుచుండెను(నిర్గమ 34:29) అనగా ప్రార్థన అనేది సాధారణమైన వ్యక్తులను మహనీయులుగా మార్చుతుందనడంలో దైవికమైన దేవుని శక్తి మనకు కనిపిస్తుంది. దేవుని కుమారుడైన యేసు ప్రభువు సహితం ఈ భూలోకంలో తన తండ్రి చిత్తాన్ని నెరవేర్చడానికి ప్రతి నిత్యం ప్రార్థనలో గడిపారు. "ఆ జన సమూహములను పంపి వేసిన పిమ్మట యేసు ప్రార్థించుకొనుటకై ఏకాంతముగా కొండ మీదికి వెళ్లెను. సాయం సమయం వరకు ఆయన ఏకాంతముగా అచ్చటనే ఉండెను"(మత్తయి 14:23) ఈ సంఘటన ద్వారా యేసుప్రభువు తన జీవితంలో ప్రార్థనకు యిచ్చిన ప్రాముఖ్యతను తెలియజేస్తుంది.

మహాత్మాగాంధీ ప్రార్థన గూర్చి తెలియజేస్తు "మన హృదయపు లోతులలోనున్న దైవత్వాన్ని మేల్కొల్పడమే ప్రార్థన యొక్క ఉద్దేశం. ప్రార్థన యొక్క సామర్థ్యాన్ని అర్థం చేసుకొన్న వాడు రోజుల తరబడి ఆహారం లేకుండా ఉండగలడు. కాని ప్రార్థన చేయకుండ ఒక క్షణమైన జీవించలేడు. అతడి జీవితానికి ప్రార్థన ఊపిరిగా మారుతుంది. మనిషికి ఆహారం ఎంత అవసరమో ప్రార్థన కూడా అంతే అవసరం, శరీరానికి ఆహారం అవసరం, ఆత్మకు ప్రార్థన అవసరం. నిజమైన ప్రార్థనకు సమాధానం లభించకుండా ఉండదు. ఎప్పుడైతే మనస్సు ప్రార్థన పూర్వకమైన ఆలోచనలతో నిండిపోతుందో అప్పుడు ఈ ప్రపంచంలోని వన్నీ మంచివిగాను, మనసుకు నచ్చినవి గాను తోస్తాయి. మనిషిని మహనీయునిగా మార్చే శక్తి కేవలం ప్రార్థనకు మాత్రమే కలదు" అని అన్నారు. ప్రపంచంలో ఎందరో ప్రార్థన ద్వారా మహనీయులుగా చరిత్రలో తమ పేర్లను బంగారు అక్షరాలతో లిఖించుకున్నారు.

### 3.5.3. స్వార్థమైన ప్రార్థనలు -నిస్వార్థమైన ప్రార్థనలు

ఒకసారి ఇద్దరు స్నేహితులు ప్రార్థన చేసుకోవడానికి అడవిలోనికి వెళ్లారు. ఒకరు నదికి ఎడమ వైపున, మరొకరు నదికి కుడి వైపున ప్రార్థన చేయుటకై కూర్చుండి దేవుని ధ్యానంలో నిమగ్నమయ్యేరు. కొన్ని రోజులు గడిచిన తరువాత వారి ప్రార్థనలను ఆలకించిన దేవుడు పరలోకమును వీడి భూలోకంలోనికి వారి కోరికలు తీర్చడానికి వచ్చారు. ఆయన నదికి ఎడమ వైపున కూర్చున్న

వ్యక్తి దగ్గరకు వెళ్లి,నాయనా నీవు ఎందుకు ప్రార్థన చేయుచున్నావు? నీ కోరిక ఏమిటో చెప్పుము దానిని దయ చేయుదును అనెను. అప్పుడు అతడు నా స్నేహితుడు నొక్కడు నదికి కుడి వైపున కూర్చుని ఉన్నాడు. ముందుగా వాని దగ్గరికి వెళ్లి, వాని కోరిక అడుగుము అనెను. దేవుడు మంచి మనస్సును చేసుకొని భక్తితో ప్రార్థన చేయుచున్న రెండవ వ్యక్తి దగ్గరికి వెళ్లి, నాయనా నీవు ఎందుకు ప్రార్థన చేయుచున్నావు? నీ కోరిక ఏమిటో చెప్పుము దానిని దయ చేయుదును అనెను. అతడు తిరిగి తన స్నేహితుడు ఇచ్చిన సమాధానమే ఇచ్చెను. అందులకు దేవుడు నీ స్నేహితుడు మొదటగా నిన్నే కోరిక కోరుకోమనెను అనెను. అందులకు అతడు కొంతసేపు ఆలోచించి, ప్రభువా! దయచేసి నాకున్న ఒక కన్నును తొలగించండి అని కోరుకొనెను. దేవుడు దిగులు చెంది వెంటనే వాని కోరికను నెరవేర్చెను. తిరిగి దేవుడు బాధతో మొదటి వానివద్దకు వచ్చెను, అప్పుడు అతడు వెంటనే దేవుడు చెప్పే వరకు కూడా వినకుండా, ప్రభువా! నా స్నేహితుడు కోరుకున్న దాని కంటే రెండంతలు ఎక్కువగా దయ చేయుము అని ప్రార్థించెను. దేవుడు మళ్లీ బాధతో వెంటనే మొదటి వాన్ని రెండు కన్నులు తీసి వేసెను. మన అనుదిన జీవితంలో కూడా మనం చేసే ప్రార్థనలు ఈ విధంగానే స్వార్థంతో కూడికొని ఉంటుంన్నాయి. మీ పాపములను విడనాడి ప్రభువు నొద్దకు రండి. ఆయన ఎదుట ప్రార్థన చేసి మీ దోషములను తొలగించుకొనుడు (సీరా 17:25) తెలియజేస్తున్నాడు. దేవుడు నరుని మట్టి నుండి చేసెను, అలాగే అదే మట్టిలో తిరిగి కలిసి పోవునట్లు చేసెను. అనగా దేవునికి ఉన్న శక్తి ఈ లోకంలో ఎవరికి కూడా లేదు. నరుడు ఏవిధంగా జీవించాలో దేవుడు ఎన్నోమార్లు చెప్పినగాని నరుడు మాత్రం తన వక్రబుద్ధిని ఎప్పుడు చూపుతునే ఉన్నాడు. ఆకాశంలోఉన్న నక్షత్రాలను సహితం దేవుడు లెక్క పెట్టగలడు, దేవుడు ఈ లోకమును నాశనం చేయాలనుకుంటే అతనికి ఎవరు ఎదురు నిలబడగలరు? దేవుడే నీకు శత్రువుగా ఉంటే నీవు ఎక్కడకు వెళ్లగలవు? అందుకే ప్రతి ఒక్కరు కూడ ఆలోచించి, నిస్వార్థ హృదయముతో ప్రార్థించాలి.

## 3.6. మదర్ తెరిసా విశ్వాసంలోని ప్రార్థన సత్యాలు

జీవితం అనేది సముద్రంలో ప్రయాణించే నావ లాంటిది. సముద్ర ప్రయాణంలో నావ తీరాన్ని చేరడానికి ఎన్నో అలలను ఎదుర్కొనవలసి వస్తుంది. అలాగే మన అనుదిన జీవితంలో కూడా ఎన్నో మార్లు సమస్యలను ఎదుర్కొనవలసి వస్తుంది. ముఖ్యంగా ఆధ్యాత్మిక జీవితంలో విశ్వాస పరీక్షలను చాలా వరకు మనం గమనిస్తూనే ఉంటాము. ప్రార్థన జీవితం ప్రతి పరీక్షను ఎదుర్కొని నిలబెడుతుంది. అలాగే సహనం ముఖ్యంగా దేవుని ప్రేమను అందుకొనుటకు ఎంతో సహాయపడుతుంది. మరణించిన ధనికుని గతి ఎంత ఘోరంగా ఉంటుందో అలాగే దేవుని యందు విశ్వాసం లేని వ్యక్తి జీవితం కూడ అంతే ఉంటుంది. దుష్ట వాంఛలు పాపమునకు గురిచేసి మనలో ఉన్న విశ్వాసాన్ని బలహీనం చేస్తాయి కావున మనం మాట్లాడే ముందు వినాలి తద్వారా మనం చేయవలసిన కార్యమును కొనసాగించాలి. ప్రార్థించటంలో మన హృదయం, ఆలోచన, ఆత్మ, శరీరం అన్ని ఏకమైతే దానికి పరమార్థం చేరుతుంది. ప్రార్థనలో నిర్మల హృదయం అవసరము. పవిత్ర హృదయాన్ని పొందడానికి మనం ఇతరులు మనకు విరుద్ధంగా చేసిన తప్పులను క్షమించి, వాటిని మరచి, మంచి హృదయంతో ప్రార్థించాలి. “తండ్రి వీరు చేయునదేమో వీరు ఎరుగరు వీరిని క్షమింపుము”(లూకా 23:24) ప్రభువు ప్రార్థించినట్లు మనము కూడా ప్రార్థనలో ఇతరులను క్షమించి, అట్టి మనోభావముతో ప్రార్థించినప్పుడే మన ప్రార్థన దేవుడు ఆలకిస్తారు. మదర్ తెరిసా “పదే పదే ప్రార్థించడం కన్నా పరోపకారానికి కొంత సమయం కేటాయించడం మిన్న” అంటారు.

### 3.6.1. ప్రార్థన - దేవుని సంకల్పం

యేసు తన శిష్యులతో గెత్సమనే తోటకు వచ్చి, “ నేను ప్రార్థన చేసుకొని వచ్చే వరకు మీరు ఇచ్చట కూర్చుండుడు అని చెప్పెను. పేతురు, యాకోబు, యోహానులను తనతో వెంట బెట్టుకొని పోయెను. అప్పుడు ఆయన ఆవేదన పడుతూ చింతాక్రాంతుడయ్యెను. ఆయన వారితో“ నా ఆత్మ మరణ వేదన పడుచున్నది. మీరు ఇచ్చటనే ఉండి జాగరణ చేయడు” అని పలికెను. పిమ్మట

ఆయన రాయి వేటు దూరం వెళ్లి మోకరిల్లి, “తండ్రీ! నీ చిత్రమైనచో ఈ పాత్రను నా నుండి తొలగింపుము. కాని నా ఇష్టము కాదు. నీ చిత్తమే నెరవేరును గాక అని ప్రార్థించెను.(మార్కు 14:32–34) దేవుని సంకల్పం లేకుండా మన జీవితంలో ఏమి చేయలేము. మనం చేసే ప్రతి ప్రార్థన కూడా దేవుని ప్రణాళికకు అతీతంగా ఉండాలి. పునీత పౌలు గారు కూడా తనకు కలిగిన పెద్ద శోధనను తన నుంచి దూరం చేయమని ప్రార్థిస్తుంటే. అందుకు దేవుడు నా కృప నీకు చాలును (2 కొరింతీ 12:9) అని చెప్పి నీ శక్తికి మించి నేను నిన్ను శోధించనని ఓదార్పును ఇస్తున్నారు. దేవుడు అన్ని ప్రార్థనలను ఆలకిస్తారు. దేవుడు వినని ప్రార్థన లేదు. దీని గురించి పునీతులు చాలా చక్కగా చెప్పారు దేవుడు మన ప్రార్థనలకు సమాధానం ఇస్తారు. ఔను, లేదు, వేచి ఉండు, అనే ఈ మూడింటిలో ఒక దానిని తప్పక ఇస్తారు. ప్రార్థనలో గట్టి విశ్వాసంతో ఉన్న వారికి ఈ సత్యం విదితమవుతుంది.

## 3.6.2. ప్రార్థన - ప్రకృతి నియమము

పార్థన అనేది మన జీవితాన్ని నిర్ణయించే ప్రకృతి నియమాలను, విధులను పునాదిగా కలిగి ఉంటుంది. జీవితానికి ప్రకృతి నియమాలు అత్యవసరము. వాటితో కలిసి పోవాలే తప్ప విరుద్ధంగా పోకూడదు. ఎదిరించినట్లయితే అది కలవడానికి పనికిరాని, విభిన్న పరిస్థితికి దారి తీస్తుంది. ఉదాహరణకు పదవ అంతస్తు నుంచి ఒకడు పొరపాటున కింద పడి పోతున్నాడు. అతడు భక్తి పరుడు, విశ్వాసమున్నవాడు. ప్రభువా! నన్ను కాపాడు. నేను క్రింద పడటాన్ని అడ్డు కొండని ప్రార్థిస్తే ఆ పార్థన దేవుడు ఆలకిస్తాడు! నిశ్చయంగా ఆలోచించరు. ఎందుకంటే ప్రకృతి నియమం ప్రకారం భూమి ఆకర్షణ శక్తి అతన్ని క్రిందకు లాగుతుంది మనం ప్రార్థనలో ప్రకృతి నియమాలతో కలిసి పోయినప్పుడే ప్రార్థన విజయాన్నిస్తుంది. పునీత అంతోని వారి జీవితంలో జరిగిన ఒక్క అద్భుతాన్ని గుర్తుకు చేసుకోవచ్చు, వారు ప్రసంగిస్తుంటే జనులు తండోప తండములుగా వచ్చే వారు, అందువలన ఏ దేవాలయముగానీ, సమావేశ మందిరములు సరిపోయేవి కావు. అందువలన నగరము వెలుపల ఒక పొలమును అద్దెకు తీసికొని దానిలో ప్రార్థనలు ఏర్పాటు చేశారు. అది వేసవి కాలము. పునీత

అంతోనివారు తన మొదటి ప్రసంగమును ప్రారంభించినప్పుడు వాతావరణము చాలా ఆహ్లాదకరముగా వుంది. అంతలోనే వాతావరణము పూర్తిగా మారి పెద్ద గాలులు వీచటం ప్రారంభించాయి. నల్లని మేఘాలు ఆవరించాయి. ఉరుములు, మెరుపులు వస్తున్నాయి. జనులు తలదాచుకొను స్థలము ఏదైనా దొరుకుతుందేమో అని గమనిస్తుంటే, జనుల కదలికను గమనించి ఆయన నెమ్మదిగా ఇలా పలికారు. "భయపడవద్దు, మీ స్థలములోనే వుండండి, ఒక్క వర్షపు చుక్క కూడా మిమ్ములను తాకదు" అన్నారు. ఈ విధముగా ప్రార్థన శక్తి చేత, దేవుని సహాయముతో పునీత అంతోని వారు ప్రకృతి నియమాలను సహితం ఛేదించారు.

### 3.6.3. ప్రార్థన ఫలాలు

పునీత తోమా వారి జీవిత చరిత్ర నుంచి ఒక సంఘటన. యేసు ప్రభువు తోమాతో నేను నిన్ను ఎక్కడికి పంపుతానో అక్కడకు వెళ్ళుటకు సిద్ధమా? అని అడుగగా తోమా నన్ను ఎక్కడికి వెళ్ళమన్నా వెళ్తాను. కానీ భారతదేశానికి మాత్రం పంపకండి అని అన్నాడు. "నేను నిన్ను భారతదేశానికి పంపుటకే నిర్ణయించి యున్నాను. నీవు భారతదేశ పునీతుగా మారాలన్నదే నా ప్రణాళిక" అని యేసు చెప్పారట. కలలో యేసు చెప్పిన రీతిగా తోమాగారు భారతదేశం వచ్చి బోధించి అనేకులను విశ్వాసులను చేసి, గొప్ప పునీతునిగా మారారు. ప్రార్థనలో విశ్వాసం మొదటి మెట్టు. దేవుడు అంటే మంచితనం. మంచికి మారుపేరైన దేవుడు నాకు ఎల్లప్పుడు మంచినే చేస్తారు. నేను ఆయన చిత్తానుసారం జీవిస్తే చాలన్న లోతైన అవగాహననే విశ్వాసమంటున్నాము. "విశ్వసించు వారికి అన్ని ప్రాప్తించును"(మార్కు 9:29)

మనము కూడా మన ప్రార్థనలు విశ్వాసముతో అడుగవలెను పునీత యాకోబుగారు చక్కగా పలుకుతున్నారు. మనం దేవుని ప్రార్థించిన వెంటనే మనకు ఇవ్వకపోవచ్చు కానీ మన అవసరాలను గుర్తించిన దేవుడు మన ప్రార్థనకు తప్పకుండా ఫలితం దయచేస్తారు అనడంలో ఎలాంటి సందేహం లేదు. సోలోమోను కలలో కనిపించిన దేవుని "ఈ సేవకునకు మంచి చెడ్డల నెంచి, పరిపాలించు వివేకమును ప్రసాదింపుము.(1 రాజులు 3:9) అనెను.

సొలోమోను కోరుకొనిన కోరిక ప్రభువుకు ప్రీతి కలిగించెను కనుక ప్రపంచంలో ఎవరికీ లేని వివేకమును, విజ్ఞానమును ప్రసాదించెను. "నువ్వు యితరులలోని లోపాలను వెతకడం ప్రారంభిస్తే ఎవరిని ప్రేమించలేవు" అని మదర్ తెరిసా చెప్పుతున్నారు. మనం ప్రార్థనలో ఫలాలను సాధిచాలంటే ఎల్లప్పుడు దేవుని నిబంధనలకు శిరసావహించాలి.

## 3.7. ప్రార్థించే హృదయం - పని చేసే చేతులు

ఎల్లప్పుడు ప్రార్థన సలుపుటకు, నిరుత్సాహ పడకుండుటకు యేసు వారికి ఒక ఉపమానము ఇట్లు చెప్పెను:ఒకానొక పట్టణమున న్యాయాధిపతి ఒకడు కలడు. అతడు దేవుడనిన భయపడడు. మానవులను లక్ష్యపెట్టడు. అచ్చట ఒక వితంతువు ఉండెను. ఆమె అతని వద్దకు వచ్చి 'నాకు న్యాయము చేకూర్చుము, నా ప్రత్యర్థి నుంచి కాపాడుము'అని తరచుగా మొరపెట్టుకొను చుండెడిది. అతడు కొన్నాళ్లు ఆమె మొరను పెడ చెవిని పెట్టెను. కాని అతడు నేను దేవునికి భయపడను. మానవులను గౌరవింపను. అయినను ఈ విధవరాలు నన్ను విసిగించుచున్నందున, ఈమె పదే పదేవచ్చి నన్ను బాధ పెట్టకుండుటకై ఈమెకు న్యాయము చేకూర్చెదను అని తలంచెను(లూకా18:1-5) మనం చేసే ప్రార్థనలో ఓర్పు, పట్టుదలతో ఉంటే దేవుడు మనకు తప్పకుండా న్యాయం చేస్తాడు. అని వితంతువు ప్రార్థన-న్యాయాధిపతి ప్రవర్తన అనే ఉపమానం ద్వారా బోధిస్తున్నారు. అలాగే మనం చేసే పనిలో కూడా అభిరుచి, చేయాలనే తపన, అనేవి చాలా ముఖ్యం. చెట్టుకి పువ్వులు అందాన్నిస్తాయి. ఆకాశానికి సూర్య చంద్రులు అందాన్నిస్తాయి అలాగే ప్రతి మనిషి జీవితంలో కూడా ప్రార్థించే హృదయం, పని చేసే చేతులు అనేవి అందాన్నిస్తాయి అని గ్రహించాలి.

### 3.7.1. యేసు ప్రభుని ప్రార్థన జీవితం

యేసుప్రభును ప్రార్థించే మనిషిగా సువార్తలు ప్రకటిస్తున్నాయి. ఆయన యూదుడై యుండి, వారి సంప్రదాయ ప్రకారం భక్తి కలిగి ప్రార్థించేవాడు. ఆయన జీవితంలో జరిగిన వివిధ సంఘటనల ఆధారంగా ఆయన ప్రార్థనకు ఎంత ప్రాముఖ్యతను యిచ్చారో అర్థమవుతుంది. ఆయన ప్రార్థించే విధానమును చూసిన శిష్యులు కూడా మాకును ప్రార్థన ఏ విధంగా చేయాలో నేర్పమని

అడిగారు. యేసు సైతానుచే శోధింపబడుటకై ఆత్మ వలన ఎడారికి కొనిపోబడిన సందర్భంలో సైతానుకు ఏ విధముగా కూడా ఆయనపై అధికారం యివ్వకుండా, ప్రార్థన శక్తి చేత ఎదుర్కొన్నారు. యేసుప్రభువు యొక్క దీన ప్రార్థనను గురించి పునీత పౌలుగారు వ్రాసిన లేఖలో "తన ఇహలోక జీవితంలో మృత్యువు నుండి తనను రక్షింప శక్తి కలిగిన దేవుని గూర్చి యేసు ఏడుపులతోను, కన్నీటితోను పెద్దగా ఎలుగెత్తి ప్రార్థించెను. ఆయన భక్తి విధేయతలు గల వాడగుట చేతనే దేవుడు ఆయన ప్రార్థన ఆలకించెను"(హెబ్రీయులకు 5:7) అని తెలియజేశారు. యేసు ప్రభువు ప్రార్థనతో పాటు, కష్టపడి పని చేయుటలో కూడా ముందంజలో ఉండేవాడు. ఒకసారి ఆయన శిష్యులు "బోధకుడా! భోజనము చేయుడు అని అడిగినప్పుడు, ఆయన "నన్ను పంపిన వాని చిత్తమును నెరవేర్చుటయు, ఆయన పనిని పూర్తి చేయుటయు నా ఆహారము''(యోహాను 4:34) అని సమాధానమిచ్చారు. మదర్ తెరిసా తన జీవితంలో కూడా కష్టపడి పని చేయడంలో ఎల్లప్పుడు ఎంతో ఓర్పును ప్రదర్శించేవారు. యేసు ప్రభువుని ప్రార్థన జీవితమును, మదర్ తెరిసా ప్రార్థన జీవితమును పోల్చినప్పుడు ఇద్దరు మొట్టమొదటగా ప్రార్థనకు ప్రాధాన్యమిచ్చి, దేవుని ప్రేమను అందరికి అందించడానికి కష్టపడి పనిచేశారు.

### 3.7.2. అపోస్తలుల ప్రార్థన జీవితం

యేసుప్రభువు మోక్షారోహణం అయిన తర్వాత అపోస్తలుల జీవిత విధానంలో పెను మార్పులు సంభవించాయి. వారందరు ఒక చోట చేరి ఎడతెగక ప్రార్థన చేయుచుండిరి(అపోస్తలు కార్యములు 1:14) పెంతెకోస్తు పండుగ రోజున పవిత్ర ఆత్మ శక్తి చేత అభిషేకించబడిన తరువాత అనేక మంది వారి బోధనను విని జ్ఞానస్థానము పొందిరి. వారందరు కూడా బోధనయందు, సహవాసమందు, రొట్టె విరచుటయందు, ప్రార్థించుటయందు నిమగ్నమై ఉండిరి. విశ్వాసుల సంఘము ఒకే మనసుతోను, ఒకే హృదయంతోను జీవించుచుండెను. వారికి చెందిన ఆస్తిపాస్తులను 'ఇది నా సొంతము' అని ఎవడును చెప్పుకొనుట లేదు. వారికి ఉన్న దానిని అందరు పంచుకొనుచుండిరి. ప్రభువైన యేసు పునరుత్థానమును గూర్చి అపోస్తలులు మహాశక్తితో

సాక్ష్యమిలిచ్చిరి. సర్వేశ్వరుడు తన దైవ కృపను సమృద్ధిగా వారిపై కుమ్మరించెను. ఆ సంఘములో ఏ ఒక్కనికిని కొరత లేదు. ఏలయన పొలము గలవారు, ఇండ్లు గలవారు వానిని అమ్మి, వచ్చిన పైకమును, అపోస్తులుల పాదముల యొద్ద ఉంచుచుండిరి. ఆ పైకము వారివారి అవసరములకు తగినట్లు పంచిపెట్టుచుండిరి (అపోస్తులుల కార్యములు 4:32-35) అని పవిత్ర గ్రంథము తెలియజేస్తుంది. మదర్ తెరిసా కూడా తనతో పనిచేసే మఠకన్యలతో చిరునవ్వులు చిందిస్తూ, ప్రేమతో అందరినీ పలకరిస్తూ జీవించేవారు. అనగా యేసు ప్రభువుని విశ్వసించే వారి మధ్యన ప్రార్థన జీవితము ఎంతో అవసరమని తెల్పుతుంది.

## 3.7.3. మరియ తల్లి - ప్రార్థన జీవితం

ప్రార్థన జీవితంలో మనకు ఒక గొప్ప ఆదర్శం మరియ తల్లి. దేవుడు తన ఇష్టాపూర్వకంగా కన్య మరియమ్మను ఎన్నుకొన్నారు. గబ్రియేలు దూత యేసు జననం గురించి మరియమాతకు ప్రకటించినపుడు కలత చెంది, "ఇది ఎట్లు జరుగును" అని ఆశ్చర్యపడింది. కాని ప్రభువు దూత పలుకులను విశ్వసించి "ఇదిగో నేను ప్రభువు దాసురాలను నీ మాట చోప్పున నాకు జరుగును గాక" (లూకా 1:7) తన సంపూర్ణమైన అంగీకరమును తెలియజేసింది. అందువలననే ఎలిశబేతమ్మను మరియమ్మ దర్శించినపుడు "ప్రభువు పల్కిన వాక్కులు నెరవేరునని విశ్వసించిన నీవు ఎంత ధన్యురాలవు"? అని తల్లి మరియ విశ్వాసాన్ని ఆమె అభినందిస్తుంది. మరియు వినయ విధేయతలతో నిండియుండింది. ఆమె విశ్వాసం ఎంత గొప్పది అంటే "ఇకనుండి తరతరములవారు నిన్ను ధన్యురాలని పిలిచెదరు", అని దీర్ఘదర్శనం పలుకుటకు కూడా వెనుకంజ వేయలేదు. బాలయేసును మరియ దేవాలయములో సమర్పించినపుడు సిమియోను "ఈ బాలుడు వివాదాస్పదమైన గురుతుగా నియమింపబడి ఉన్నాడు. అనేకుల మనోగత భావములను బయలు పరచును. ఒక ఖడ్గము నీ హృదయమును దూసుకొని పోనున్నది" అన్నారు. తల్లిదండ్రులతో యెరూషలేము వెళ్ళిన బాలుడు యేసు దేవాలయములోనే ఉండిపోయాడు.

అయితే మూడవ రోజు ఆయనను కనుగొనినపుడు మీరు నా కొరకు ఏల వెదికితిరి? నేను నా తండ్రి పనిమీద ఉండవలయునని మీకు తెలియదా? అంటున్నారు. ఆయన మాటలు వారికి అర్థం కాలేదు. అయినను ఆయన తల్లి మరియమ్మ ఆ విషయములన్నియు మనస్సున పదిలపరచుకొని ధ్యానించెను. (లూకా 1:51) సువార్తలో అనేక చోట్ల మరియమ్మ దేవునితో ప్రార్థనలో పాల్గొనటం చూస్తున్నాము. ప్రార్థన ఇచ్చిన ఆ శక్తియే జరుగునని ఆమె వలన నమ్మశక్యం కానిది దేవుడు చెప్పినప్పుడు కూడా తన సంపూర్ణమైన అంగీకరమును సమర్పించుకుంది. యేసుప్రభువుని మరణ పునరుత్థానముల తర్వాత కూడా మరియమ్మ అపోస్తలులతో ప్రార్థనలో పాల్గొనెను (అపోస్తలుల కార్యములు 1:14) శిష్యులతో ఏక మనస్కురాలై ప్రార్థనలో పాల్గొని పవిత్రాత్మతో నింబడింది. మరియమ్మ ప్రార్థన చేసే తల్లిగా ప్రార్థనలో మనల్ని నడిపించి దైవాశీస్సులను నిండుగ పొంది, ఇచ్చే తల్లిగ ఉంటుంది.

మన ఒక్కొక్కరికి దైహికంగా ఒక తల్లి ఉన్నప్పటికీ, ఆధ్యాత్మిక జీవితంలో మంచి మార్గదర్శియైన తల్లి మనకు అవసరమైనందు వలన "ఇదిగో నీ తల్లి", అని మన అందరికి తల్లిగ మరియమ్మను స్లీవ నుంచి యేసు మనకిచ్చారు. ఆ ప్రేమ గల తల్లి మన ప్రార్థన జీవితానికి ఒక గొప్ప సుమాతృకగ ఉండి, పరిశుద్ధాత్మ వలన మనం ఒక్కొక్కరము నింపబడేందుకు ఈ లోకంలో సహాయకులుగా ఉండేందుకు ఇతరుల అవసరముల కొరకు విజ్ఞాపన చేయు గుణముగల వారిగ జీవించేందుకు సహాయం చేస్తున్నారు.

మిక్కిలి నెనరుగల తల్లీ! మీ శరణుకు పరుగెత్తి వచ్చి మీ యుపకార సహాయములను అడిగిన వారిలో ఒక్కరైనను మీ వలన చేయి విడువబడినట్లు ఎన్నడును లోకములో వినినది లేదని తలంచండి అని సగర్వంగా మరియతల్లిని పునీత బెర్నార్డుగారు కీర్తించారు. ఎల్లప్పుడు సహాయం చేసే నిత్య సహాయ మాతగా మనకు ప్రార్థన జీవితములో మార్గాన్ని చూపి దేవునితో ఐక్యమయ్యేందుకు ఆ తల్లి సహాయము చేస్తున్నారు. మరియతల్లి ద్వారా యేసుని చేరటం ప్రార్థించటం మనకు పట్టుదలను, ఉత్సాహాన్ని ఇస్తుంది.

### 3.7.4. శ్రీ సభ బోధన

జగద్గురువు ఫ్రాన్సిస్ 14 ఏప్రిల్, 2021 ఈస్టర్ కాలంలోని రెండవ బుధవారం రోజున "ఈ శ్రీసభకు ఇవ్వబడిన ప్రధానమైన కార్యము ప్రార్థన. ఆ ప్రార్థనను ఎలా చెయ్యాలో నేర్పించడం ఎంతో ముఖ్యమన్నారు. అలాగే విశ్వాసం అనే దీపమును, ప్రార్థన అనే నూనెతో వెలుగుతున్న దీపమును తరతరములకు అందించాలి" అన్నారు. 16వ బెనడిక్ట్ జగద్గురువుల విశ్వ లేఖ "దేవుడు ప్రేమ స్వరూపుడు" రెండవ భాగంలో శ్రీ సభ ప్రధాన బాధ్యత: ప్రేమ – సేవ అనేవి ఏ విధముగా కొండ గుర్తులుగా నిలుస్తాయో చారిత్రాత్మక ఆధారాలతో నిరూపించారు. "మీరు ఎక్కడైతే ప్రేమతో చేసే సేవ కార్యాలను చూస్తారో అక్కడ మీరు త్రియేక దేవుని దర్శిస్తారు" అన్న పునీత అగస్టీను వారి ప్రబోధాన్ని ప్రస్తావిస్తూ, తండ్రి దేవుని ప్రేమ ప్రణాళికను నెరవేర్చి, సిలువపై ప్రేమ యాగాన్ని సమర్పించిన పుత్ర దేవుడు, ఆయన తన భక్తజనులకు ప్రసాదించిన పవిత్రాత్మ దేవుడు, శ్రీ సభను ఏ విధంగా సేవ పథంలో నడుపుతున్నారో వివరిస్తూ "ప్రభువు తన శిష్యుల పాదాలను కడగడంలో చూపిన ప్రేమ సేవ భావాలను అనుకరిస్తూ, ప్రతి ఒక్కరు కూడా తమ సాటి మానవులను ప్రేమించడానికి పవిత్రాత్మ దివ్యశక్తి తోడ్పడుతుందని" చెప్పారు.

శ్రీ సభను నడిపించిన ఎంతో మంది జగద్గురువులు తమ విశ్వ లేఖల ద్వారా ప్రార్థనకున్న ప్రత్యేకతను తెలియజేస్తు, యేసుక్రీస్తు వలే జీవించాలని అభిప్రాయపడ్డారు. రెండవ జాన్ పాల్ జగద్గురు నవ ప్రపంచ నిర్మాణం జరగాలంటే ప్రపంచ క్రైస్తవులందరూ ఒక్కమాటపై నిలబడడం ఎంతో అవసరమని స్పష్టం చేశారు. ముఖ్యంగా "మానవ మౌలిక హక్కుల పరిరక్షణ విషయంలోనూ, అవసరాలలో ఉన్న సాటి మానవులను నిరుపేదలను ఆదరించే విషయంలోను" క్రైస్తవ సోదరులంతా ఒకే బాటన నడవాలని పిలుపునిచ్చారు. దీనిని బట్టి చూస్తే శ్రీసభ ప్రార్థన చేయుటలోను, ఇతరులకు సహాయం చేయుటలోను ఎంతో శ్రద్ధ కనబరుస్తోందని అర్థమవుతుంది.

## 3.8. మదర్ తెరిసా గురుత్వ జీవితానికి యిచ్చే మార్గదర్శకాలు

మదర్ తెరిసా గురువిద్యార్థులను ఉద్దేశించి "మీరు నిజంగా దేవుని కోసం అన్వేషించ తలుచుకుంటే, ముందుగా ప్రార్థించడం నేర్చుకోండి. ప్రతి రోజు క్రమం తప్పకుండా ప్రార్థించండి. దేవునికి చేరువయ్యే దారి కనిపిస్తుంది" అన్నారు. పరిశుద్ధ గ్రంథంలో చదివినట్లుగా దేవుడు లోకమును ఎంతో ప్రేమించి, తన ఏకైక కుమారుని ప్రసాదించెను. ఆయనను విశ్వసించు ప్రతివాడును నాశనము చెందక నిత్యజీవమును పొందుటకై అటుల చేసేను(యోహాను 3:16) అదే విధముగా గురువు కూడా ప్రపంచమునకు దేవుని ప్రేమను అందించడానికి పంపబడుతున్నాడు. అతడు ప్రతినిత్యం మండుచున్న అగ్ని వలె ప్రజల మధ్యన ఉంటు, అంధకారమున నివసిస్తున్న వారందరికీ వెలుగై నడిపిస్తున్నాడు. సూర్య కిరణాలు భూమిని తాకినట్లు దేవుని ప్రేమ కిరణాలు అభిషేకం పొందిన గురు హస్తాల నుండి వెలువడుతాయి. కనుక మదర్ తెరిసా ఎల్లప్పుడు పవిత్రమైన గురువులను, ప్రార్థించే గురువులను ప్రసాదించమని ప్రార్థన చేసేదట. గురువంటే ప్రజల మనిషి, ప్రజల అవసరాలకు మించిన మరేపని గురువులకు ముఖ్యం కాదని పునీత జాన్ మరియ వియాన్ని జీవితం తెలుపుతుంది. రెండవ వాటికన్ మహాసభ "గురువుల సేవ ధర్మం- జీవన విధానం" అనే అధికార పత్రం ద్వారా గురువుల సేవలను అభినందిస్తూ తన గురుత్వ బాధ్యతలను మరొకమారు తెలియజేస్తూ గురువును ప్రజల కోసం జీవించే త్యాగ మూర్తిగా కొనియాడుతోంది. మదర్ తెరిసా కూడా ఈ ఆధునిక ప్రపంచంలోని గురువులకు రెండు విధములైన మార్గదర్శకాలను అందిస్తుంది.

### 3.8.1. ప్రార్థించే గురువులు

పునీత జాన్ మరియ వియాన్ని "ప్రేమ గల మన దేవుడు మనం తనను పదేపదే ప్రార్థిస్తూ విసిగించడం ఇష్టపడతాడు" అన్నారు. యేసు ప్రభువు తన శిష్యులను "తనతో నుండుటకు, సువార్త ప్రకటన పంపుట కొరకు ఆయన పన్నిద్దరు శిష్యులను నియమించెను"(మార్కు 3:14) అని దేవుని పిలుపులోని అంతరార్థమును తెలియజేస్తున్నారు. గురుత్వ జీవితంలో ప్రార్థన అనేది ప్రధాన

కార్యముగా పరిగణించవచ్చు. నిత్య గురువైన యేసు ప్రభువు సహితం ఓలీవు కొండపై ఉన్న గెత్సమనే తోటలో "ఆయన రాయి వేటు దూరం వెళ్లి మోకరిల్లి ప్రార్థించెను(లూకా 22:41) అని తెలియజేస్తుంది. మదర్ తెరిసా "ఒక గురువు భక్తి గల ప్రార్థన చేయడానికి ఆయన దేవుని ముందు నిశ్శబ్దంగా ఉండటం తెలుసుకోవాలి. ఆ హృదయపు నిశ్శబ్ద సమయంలో దేవుడు మాట్లాడుతాడు. ప్రార్థన అనేది భక్తి గలిగి సంభాషించడంమే కాదు వినడం కూడా ప్రార్థనగా అనబడుతుంది. గురువుకు ప్రార్థన ఎలా చేయాలో నేర్చుకోవడం అతి ప్రధానమైన అంశము" అంటారు. యేసు ఒకచోట ప్రార్థన చేయుచుండెను. ప్రార్థన ముగియుట తోడనే ఆయన శిష్యుడు ఒక్కడు "ప్రభువా! యోహాను తన శిష్యులకు నేర్పిన విధమున మీరును మాకు ప్రార్థన చేయుటనేర్పుడు" (లూకా 11:1) అని అడిగెను. అందులకు ఆయన వారికి "పరలోక ప్రార్థన" నేర్పించారు. అదే విధముగా యేసుప్రభువు అభిషేకం పొందిన గురువు హస్తాల ద్వారా అందరికి దీవెనెలిస్తారు. అందువలన గురువు పవిత్రతను కలిగి ఉండాలి. గురు జీవితానికి ప్రార్థనే ఆహారమైనదిగా ఉండాలి. ఏ గురువైతే ప్రార్థన చేయలేడో, యేసుప్రభువుకు అతి దగ్గరలో ఉండలేడు. అలాగే తన ద్వారా దేవుని కార్యములు నెరవేర్చడానికి అడ్డుగోడగా మిగిలిపోతాడు. ఫలప్రదమైన ప్రార్థనకు విశ్వాసమే పునాది. "మనుష్య కుమారుడు సేవించుటకే కాని సేవింపబడుటకు రాలేదు" (మత్తయి 20:28) అని తెలియజేస్తు గురుత్వ జీవితంలో ప్రార్థన ప్రాముఖ్యతను గుర్తు చేస్తుంది.

### 3.8.2. పని చేసే గురువులు

మదర్ తెరిసా "మనం లేకపోతే పనులు ఆగిపోతాయని అనుకోరాదు. దేవుడు ఎన్నో రకాల సాధనాలను సృష్టించాడు. అతను తలచుకుంటే ఎంతో నైపుణ్యంతో చేసిన పనిని కూడా తలక్రిందులుగా చేయగలడు. దేవుని దృష్టిలో ప్రేమ ఒక్కటే గొప్పది. ఎంత కష్టపడి పని చేసిన, ఆ పనిలో ప్రాణాలు కోల్పోయిన, ఆ పని ప్రేమ రాహిత్యమైతే అది నిరుపయోగమే" అన్నారు. నీవు

ఆపదలో ఉన్నవారికి సహాయం చేస్తే దేవుడు మరొక రూపంలో నీవు ఆపదలో ఉన్నప్పుడు సహాయం చేస్తాడు అనేది మన జీవిత ప్రధానమైన అంశముగా గుర్తుంచుకోవాలి. యేసు అన్ని పట్టణములను గ్రామములను తిరిగి, ప్రార్థన మందిరములలో బోధించుచు, పరలోక రాజ్యమును గూర్చిన సువార్తను ప్రజలకు ప్రకటించుచు, జనుల వ్యాధి బాధనెల్లా పోగొట్టు చుండెను. నిస్సహాయులై, బాధలతో ప్రగ్గుచు, కాపరి లేని గొర్రెల వలె చెదరియున్న జనసమూహము చూచి ఆ కరుణామయుని కడుపు తరుగుకొని పోయెను. అప్పుడు యేసు తన శిష్యులతో "పంట మిక్కుటము, కాని కోతగాండ్రు తక్కువ. కావున పంటను సేకరించుటకు కావలసిన కోత గాండ్రను పంపవలసినదని యజమానికి మనవి చేయుడు"(మత్తయి 9:35-38) అని పలికెను. శ్రీసభ పంట పొలంలో పని చేయుటకు గురువు నేటి ఆధునిక ప్రపంచమునకు ఎంత అవసరమో తెలియజేస్తుంది. ఒకసారి మదర్ తెరిసా గురుత్వ అంతస్తునకు అతి దగ్గరలో ఉన్న గురు విద్యార్థులతో "మీ హస్తములను మరియతల్లి హస్తములలో పెట్టి యేసుక్రీస్తు వైపు నడిపించమని ప్రార్థించండి.ఎప్పుడైతే యేసు మరియతల్లి జీవితములోనికి వచ్చినప్పుడు సంతోషముతో యితరులకు ప్రభువును అందించింది. ఒక విషయము గుర్తుకుపెట్టుకోండి, మీ దగ్గర లేనిది ఇతరులకు యివ్వలేరు. నీవు యితరులకు యివ్వాలనుకుంటే ఏక మనస్సుతో దివ్య మందసంలో ఉన్న యేసుక్రీస్తుతో మమైకమవ్వాలి. మీ జీవితంలో మొదటిగా దేవునికి ప్రాధాన్యతను యివ్వాలి. యేసుతో పని చేయటం, ఆయన కొరకు జీవించడం నేర్చుకోవాలి" అనే సందేశమును యిచ్చారు. ఆమె మాటల్లోని పరమార్థమును గ్రహిస్తే నేటి ఆధునిక ప్రపంచమునకు ప్రతి గురువుకు ప్రార్థనతో పాటు, కష్టపడి పనిచేసే తత్వం ఎంతో అవసరమని తెలియజేస్తుంది. నేనొక్కడినే ఏమిచెయ్యగలను అనుకునే ప్రతి ఒక్కరు "వెలుగుతున్న ఒక్క క్రొవ్వొత్తితో వేయి క్రొవ్వొత్తులను వెలిగించవచ్చని గ్రహించాలి" అందుకుగాను నిరంతరం ప్రకాశించే సూర్యుని వలె ప్రతి గురువు పని చేయాలని ఆమెలోని తపన.

## 3.9. ముగింపు

"ప్రార్థన ద్వారానే హృదయశుద్ధి కలుగుతుంది. ఆత్మ శుద్ధి ఉంటేనే దైవశక్తి పొందవచ్చు. దైవ శక్తి పొందితేనే సేవ చేయవచ్చు. సేవ చేస్తేనే సంతోషం కలుగుతుంది. సంతోషం ఉంటేనే మనశ్శాంతి సిద్ధిస్తుంది" అంటారు మదర్ తెరిసా. ప్రార్థించే హృదయంతో పాటు కష్టపడి పనిచేసే చేతులు ఉంటే ఆకాశంలో వెలుగునిచ్చే సూర్యచంద్రుల వలె మన జీవితం వెలుగుతునే నిలబడుతుంది. ప్రార్థన మనస్సును శుద్ధిపరిస్తే, పని శరీరమును శుద్ధీకరిస్తుంది. పునీత పౌలు గారు "సోమరులుగా ఉండక కష్టపడి పని చేయుడు. భక్తి పూరితమగు హృదయముతో ప్రభువును సేవింపుడు (రోమీ 12:11) అని తెలియజేస్తున్నారు. కనుక మన అనుదిన జీవితంలో కూడా మదర్ తెరిసా వలె ప్రార్థనకు మొదటి ప్రాముఖ్యతను యిచ్చినప్పుడు దేవుని కృపావరములను పొందగలమని గ్రహించాలి.

"నీవు నా గురించి ఆలోచించు, నా గురించి మాత్రమే ఆలోచించు, నేను నీ గురించి ఆలోచిస్తాను, నీకు సంబంధించిన అంతటి గురించి ఆలోచిస్తాను" ఈ మాటల్లోని పరమార్థమును గ్రహిస్తే యేసుప్రభువు మన అందరి జీవితాలలో నుండి ఏమి కోరుకుంటున్నారో అర్థమవుతుంది. దేవుని ముఖాముఖిగా సందర్శించాలంటే భక్తి కలిగి హృదయంతో చేసే ప్రార్థన అనేది ఎంతో అవసరం. అలాంటి ఒక సంఘటన పవిత్ర గ్రంథంలో కనిపిస్తుంది. "యెరూషలేము దేవాలయంలో బాల యేసు సమర్పణ" సమయంలో అచట అన్నమ్మ యనే ప్రవక్త్రిని ఉండెను. ఆమె ఆషేరు వంశీయుడగు ఫనూవేలు పుత్రిక. ఆమె కాడా వృద్ధురాలు. వివాహమైన పిదప ఏడు సంవత్సరములు సంసారము చేసి, ఆ తరువాత ఎనుబది నాలుగు సంవత్సరములుగా విధవరాలై దేవాలయము చెంతనే ఉండిపోయాను. ఉపవాసములు, ప్రార్థనలు చేయుచు, రేయింబవళ్ళ దేవుని సేవలో మునిగి యుండెను"(లూకా 2:36-37) ఆమె దేవుని సేవలో నిష్ఠగా ఎన్నో సంవత్సరాలుగా చేసిన ప్రార్థన, ఉపవాసములకు ప్రతిఫలముగా బాల యేసుని సందర్శించు గొప్ప భాగ్యమును పోందెను.

మదర్ తెరిసా కూడా యేసు ప్రభువు చెప్పిన "ఈ నా సోదరులలో అత్యల్పుడైన ఏ ఒక్కనికి మీరు ఇవి చేసినప్పుడు అవి నాకు చేసితిరి అని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాను"(మత్తయి 25:40) అను వాక్యమును ఆధారముగా చేసుకొని, విశ్వసించి ప్రార్థన ద్వారా శక్తిని పొందుతు ఇతరులకు సేవ చేసింది. పునీత విన్సెంట్ "దేవుడు నరుని పరిపూర్ణంగా ప్రేమిస్తున్నాడు కాబట్టి నరుడు కూడా తన తోటి వానిని సంపూర్ణంగా ప్రేమించాలి" అంటారు. యెహోషువ ప్రార్థింపగా "సూర్యాస్తమయం" ఆగిపోయింది. ఏలీయా ప్రార్థించగా మూడున్నర సంవత్సరములు వర్షములు కురియ లేదు. మళ్లీ ప్రార్థించగా వర్షములు కురిశాయి. దానియేలు ప్రార్థించగా సింహములు హాని చేయలేదు, అనే వివిధ సంఘటనలు ప్రార్థనకు ఉన్న శక్తిని తెలుపుతున్నాయి.

పునీత పౌలు గారు "క్రీస్తు అనుగ్రహించు శక్తిచే నేను అన్నిటిని చేయగలను" (ఫిలిప్పీ 4:13) అని తన ప్రగాఢ విశ్వాసమును వెల్లడి చేశాడు. అలాగే మదర్ తెరిసా చెప్పిన "ప్రార్థించే పెదవుల కన్నా పని చేసే చేతులు మిన్న"అనే వాక్యమును మొదటిసారిగా విన్నప్పుడు అందులో ఏదో విరుద్ధమైన అంశము దాగి ఉందనిపిస్తుంది. కాని, దానిలోని లోతైన భావమును గ్రహించినప్పుడు ఆ అమ్మ అనుసరించిన ఆధ్యాత్మిక మార్గము కనిపిస్తుంది. ప్రార్థన, పని అనే ఆయుధాలు ప్రతి హృదయాన్ని గెలిచేలా ఎంతో సహకరిస్తాయి. నిజమైన ప్రేమ ఇతరులను సేవించడంలోనే దాగి ఉందని నిరూపిస్తుంది. "వినయం, సహనం, ఓర్పు, నీ స్నేహితులయితే ప్రేమ అనేది వాటికి హృదయంగా మారుతుందని గ్రహించాలి. పునీత గ్రెగొరి నజియాజెన్ "మనం ఎంత తరచుగా ఊపిరి పీల్చుకుంటామో, అంత తరచుగా దేవుని నామాన్ని స్మరించుకోవాలి" అంటారు.

16వ బెనడిక్ట్ జగద్గురువులు మనలోని ప్రతి ఒక్కరిని ఉద్దేశించి వెలువరించిన దేవుడు ప్రేమ స్వరూపుడు తొలి విశ్వ లేఖ "దేవుడు ప్రేమ స్వరూపుడు ఏ వ్యక్తి ప్రేమామయుడై జీవించినో అతడు దేవుని యందును

దేవుడు అతని యందును ఉందురు" (1 యోహాను 4:16) అంటు విశదీకరించాడు.

మదర్ తెరిసా దినచర్యలో సాధారణంగా మార్పు ఉండదు. రోజూ ఉదయమే 4:30కు నిద్రలేవడము, తోటి మఠ కన్యలతో కలిసి ప్రార్థనలు చేయడం, స్నానం చేసాక, పని చేయడం, ప్రేమించడం, సేవ చేయడం, ఆదరించడం వారి ముఖ్యమైన పనులు. ఇలా రోజులు, నెలలు, సంవత్సరాలు గడిచి పోయాయి. కాని, అతి సాధారణంగా కనిపించే ఈ మామూలు కార్యక్రమంలోనే ఆమె శక్తి దాగి ఉంది. "పేద ప్రజలకు సేవ చేయడమే ప్రభువును సేవించడం" అని ఆమె ఎప్పుడు, ఎన్నో విధాలుగా చెప్పారు. ఆమె మాటల్లోని సత్యమును గ్రహిస్తే ప్రార్థనయందు, పనియందు కనబర్చిన ప్రేమ మనకు కనిపిస్తుంది.

మదర్ తెరిసా తన అనుదిన జీవితంలో ప్రార్థనకు ఎంతగా ప్రాముఖ్యతను యిస్తున్నారో మనకు అవగతం అవుతుంది. మనం ప్రార్థన చేసినప్పుడు దేవుడు తప్పకుండా మనకు కావలసిన శక్తిని దయ చేస్తారని ప్రవిత బైబిలు గ్రంథములోని వివిధ సంఘటనలు తెలియజేస్తున్నాయి. యేసు ప్రభువు తన తండ్రి చిత్తాని నెరవేర్చుడానికి ప్రార్థన మీదనే ఆధారపడి తాను చేయుచున్న ప్రతి పనిని ఎంతో విజయవంతముగ పరిపూర్తి చేశారు. మోషే ప్రవక్త యిస్రాయేలులను వాగ్దాన భూమికి నడిపించే క్రమంలో అగ్ని స్తంభ రూపంలో దాగియున్న యావే మీద ఆధారపడి, తమ ప్రయాణములను కోనసాగించే వాళ్ళు. యిస్రాయేలులను పరిపాలించిన దావీదు మహా రాజు ప్రార్థన ద్వారా యావే పలుకులను ఆలకించిన తదుపరి యుద్ధం చేయడానికి వెళ్ళాడు. ఈ విధముగా ఎంతో మంది ప్రార్థన బలంతో ఎన్నో ఉన్నతమైన కార్యములను చేశారు.

మదర్ తెరిసా ప్రతినిత్యం కష్టపడి పని చేయుటకు కావలసిన శక్తిని ప్రతిరోజు దివ్యబలి పూజలో పాల్గోని పొందింది. అలాగే ప్రతిదినము కూడ తన దినచర్యను ప్రారంభించే ముందు తప్పకుండా దివ్యమందసం ముందు మోకరించి ప్రార్థన చేయాటం చేత దైవికమైన శక్తిని పొందుకొని, తాన పనులను

ఎంతో విజయవంతముగ చేయగలిగింది. ప్రతి మనిషి జీవితములో ప్రార్థన ఎంతో అవసరమని మదర్ తెరిసా జీవితము నుండి నేర్చుకుంటున్నాము. ప్రార్థనకు ప్రతీకగ జీవించడం చేత మన అనుదిన జీవితములో ఎన్నో అద్భుతాలను కాంచవచ్చు. కావున ప్రార్థనకు మొదటి ప్రాధాన్యమునిచ్చి, దేవుని మీద ఆధారపడి జీవించటం ఎంతో మేలు చేస్తుంది.

మదర్ తెరిసా చెప్పిన వాక్యములోని భావమును గ్రహించాలంటే ముందుగా ప్రార్థనలోని సత్యాలను తెలుసుకోవాలి. పెదవుల పైన చిగురించే నవ్వు ఎప్పుడు శాశ్వతముగా నిలిచిపోదుచి ఆలాగే పెదవుల ద్వారా వెలువడే పలకులలో లేదా. ప్రార్థనలో సత్యము లేదు. ప్రార్థన అనేది తప్పకుండ హృదయ అంతరంగములో నుండి వ్యక్తపరచాలి.

చివరిగా మదర్ తెరిసా చెప్పిన "ప్రార్థించే పెదవుల కన్నా పని చేసే చేతులు మిన్న" అనే వాక్యములో దాగి ఉన్న హృదయతోచేసే ప్రార్థన "ఇదిగో నేను ప్రభువు దాసురాలను నీ మాటచొప్పున నాకు జరుగును గాక! (లూకా 1:38) అని మరియ తల్లి వలె ఎల్లప్పుడు ప్రార్థన చేయాలి. అలాగే మరియతల్లి ఎలిశబేతమ్మకు చేసిన సేవలను ఆదర్శముగా తీసుకొని జీవించాలి. మదర్ తెరిసా మనందరి నుండి కోరుకునేది మొదటిగా ప్రథమ స్థానమును హృదయముతో చేసే ప్రార్థనకు, రెండవదిగా కష్టపడి పనిచేసే జీవితమును కోరుకుంటున్నారు అని గ్రహించాలి. ఆమె ప్రార్థన చేసుకొనిన తర్వాత పనిని చేయుటకు వెళ్ళింది అని తెలియజేయుటకు ఎంతో సంతోషిస్తున్నాను.

# ౭. పునీత ఫ్రాన్సిస్ శౌరివారి ఆధ్యాత్మిక, వేదప్రచార సాధనాలు

– బ్రదర్ లక్క హృదయరాజ్



**ఉపోద్ఘాతం**

భారతదేశములో ఫ్రాన్సిస్ శౌరి వారి పేరు తెలియని కతోలికులెవరైనా ఉంటే అది ప్రపంచంలోని ఎనిమిదవ వింతని చెప్పక తప్పదు. ఎందుకనగా భారతదేశ శ్రీసభ చరిత్రలో ఫ్రాన్సిస్‌శౌరి వారికి అంతటి విశిష్ట స్థానముంది. ఫ్రాన్సిస్‌శౌరి వారు దూర దేశాలు ప్రయాణించి, దైవరాజ్యాన్ని వ్యాపింపజేసి, ఇప్పటికీ ప్రజల గుండెల్లో కలకాలం పుణ్యమూర్తులుగా, పునీతులుగా వెలుగొందుతున్నారు. లొయోలా పురి ఇన్యాసివారు, అతన్ని సంపూర్తిగా దేవుని వైపు మరల్చాలని పట్టువదలని విక్రమార్కునిలా అతని వెంటబడ్డారు. శౌరివారికోసం ఇన్యాసివారు దారిలో కాపుగాచి, ఫ్రాన్సిస్‌ని ఈ ప్రపంచాన్నంతటిని జయించి, నీ ఆత్మను కోల్పోయిన నీకేమి లాభం? అని నిత్యం ప్రశ్నించేవాడు.

ఫ్రాన్సిస్ గురువు కావాలనే ప్రేరణ కలగటమే ఒక ప్రత్యేకత. ఈ ప్రత్యేకమైన ప్రేరణను ఆషామాషీగా తీసుకోకూడదు. అదొక గొప్ప అనుగ్రహం. దానిని అంగీకరించడానికి సిద్ధపడడం అనేది మామూలు విషయంకాదు. అందుకు మొట్టమొదటి మెట్టు పవిత్రత. దానికి అనుగుణంగా ఉండాల్సింది పరిత్యాగ గుణం, ఆ తర్వాత జీవితాంతం కొనసాగవలసింది క్రీస్తునాథుని అనుసరణ... ఈ సుగుణాలన్నీ ఫ్రాన్సిసులో పుష్కలంగా ఉన్నాయి. దేవునిపై అచంచల విశ్వాసంతో క్రీస్తును ఆసాంతం అనుసరించిన వ్యక్తి ఫ్రాన్సిస్, అలాగే క్రీస్తుతత్వాన్ని జీర్ణించుకుని, జీవితాంతం వరకు ఆయనను అనుసరించారు.

ఫ్రాన్సిస్, క్రీస్తుసేవకే కాక, భారతదేశానికి కూడ వన్నెతెచ్చారు. అతిసాధారణ వ్యక్తిగా జీవించి, అసాధారణమైన ఆదర్శాన్ని కనబరిచారు. క్రీస్తును అనుసరించేవారికి, మరీ ముఖ్యంగా ఆయనకు తమ జీవితాలను అర్పించుకున్న వారికి, అతని వలె అందరిలో ఆ బాధామయుడయిన క్రీస్తును దర్శించి అనుసరించాలి. అందుకే అతని జీవితాన్ని చదివి, ప్రభావితుడునై, స్ఫూర్తిపొంది, అతని గురించి ఈ పత్రాన్ని వ్రాయాలని నిశ్చయించికొన్నాను. మొదటి అధ్యాయములో అతని బాల్య జీవితాన్ని, దైవపిలుపును, మనోపరివర్తన గురించి వివరించాను. రెండువ అధ్యాయములో ఫ్రాన్సిస్ జీవిత నియమావళిలో పొందుపరచబడిన ప్రేషిత కార్యనిర్వహణకు సంబంధించిన సలహాలు, వాటి నియమావళి ఇప్పటికీ వాడుకలో ఉన్నాయి అని చెప్పడం జరిగింది. మూడవ అధ్యాయములో ఫ్రాన్సిస్ నుండి ఎటువంటి గురుత్వ సుగుణాలను నేర్చుకోవచ్చు, సువార్తీకంలో అనుసరించ దగ్గ విషయాలను గురించి చెప్పడం జరిగింది. కావున, ఫ్రాన్సిస్‌శౌరి గారు ఒక గొప్ప పునీతులు అని చెప్పటంలో అతిశయోక్తిలేదు. ఆయన యేసుని ఎంతగానో ప్రేమించి, ఆయన ప్రేమను ప్రజలకు తెలిపేందుకు ఎంతగానో శ్రమించారు. ఆత్మల రక్షణార్థం ఎన్నో బాధలనుభవించారు. వారి ఆదర్శ జీవితం మనందరికీ స్ఫూర్తిదాయకం కావాలి.

## మొదటి అధ్యాయము: పునీత ఫ్రాన్సిస్ శౌరివారి: మిషనరీ బోధనలు, సూచనలు

1541 సంవత్సరంలో యేసుసభ మతాధికారి ఫ్రాన్సిస్ జేవియర్ గారు భారతదేశానికి నూతన పాపుగారి దూతగా నియమితులైనారు. ఫ్రాన్సిస్ గారు పది వసంతాలు భారతదేశంలో తన సువార్త పరిచర్య చేశారు. ఫ్రాన్సిస్ ప్రతినిత్యం అలసట ఎరుగక ప్రయాణిస్తూ, ఎండనక, వాననక, చలినక, సముద్రయాన ప్రయాణం చేస్తూ ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొన్నారు. సంప్రదాయాలు, భాషలు, ఆ ప్రాంతపు అలవాటులు అన్నీ కొత్తగా కనిపించేవి. ఆయన చేసిన పది సంవత్సరాల సువార్త పరిచర్యలో అనేక దేశాలను సందర్శించి క్రీస్తు గురించి ప్రకటించారు.ముఖ్యంగా మలేషియా, ఇండోనేషియా, భారతదేశం, జపాన్, చైనా దేశంలో సువార్త ప్రకటించాలని తపన వారికి ఉండేది. చివరికి

అతని ఆరోగ్యం క్షీణించడం వలన అది సాధ్యపడలేదు. ఫ్రాన్సిస్ జేవియర్ మంచి ఆలోచనపరుడు, మంచి వ్యక్తి, చర్యలకు తగిన విధంగా సూచనలు తీసుకున్నారు. ఆయన బోధించిన పాఠాలు, సలహాలు గురించి ఎక్కువగా ఆయన తాను నివసించే ప్రాంతంలో అక్కడ ఉన్న పరిస్థితులు, జీవన విధానం, ప్రజలలో ఉన్న విశ్వాసం, వాళ్లు నమ్మే సిద్ధాంతాలు, సమస్యల గురించి ఆయన ఈ సేకరణలోని కొన్ని ప్రారంభ పత్రాలు లాటిన్‌లో, స్పానిష్‌లో, చాలా వరకు పోర్చుగీస్‌లో రాశారు.

## 1.1. భాషా ప్రతిబంధకం

భారతీయ క్రైస్తవుల సమస్యను పోర్చుగీస్ వారు తగినంత సముచితంగా నిర్వహించలేదన్న సమాచారం ఫ్రాన్సీస్ గ్రహించాడు. స్థానిక భాషను వారు నేర్చుకునే బదులుగా ఎవరికైతే పోర్చుగీస్ ఇష్టమో వారికి బోధించి వారిని ఉపయోగించుకోవడానికి ఇష్టపడినట్లు అనిపించింది. దీని వలన పెద్దఎత్తున వారు ప్రజలకు చేరువకాలేదు. దీనితో అనువాదకుడైన జేవియర్ అసంతృప్తి చెందాడు. అతను తమిళం నేర్చుకోవాలని నిర్ణయించుకొని నాలుగు నెలలు ట్యూటికోరిన్లో గడిపాడు. భాషపై పాండిత్యాన్ని ఆశించకుండా, మత్స్యకారులతో వ్యవహరించడానికి అవసరమైన కనీస భాషతో అతను సంతృప్తి చెందాలి అని అనుకున్నారు.

మతాధికారుల, సహచరులు, ఇతరుల సహాయంతో అతను ముఖ్యమైన ప్రార్థనలు, క్రైస్తవమతం, పది ఆజ్ఞలను తమిళంలోకి అనువదించారు. క్రైస్తవ గ్రామాలకు పంపిణీ చేయడానికి తాళపత్రాలపై వీటిని లిఖించారు. బహుశా అవి అతను హృదయ పూర్వకంగా నేర్చుకున్న కొన్ని సత్యోపదేశం సూచనలను కలిగి ఉండవచ్చు. అతనికి భాషపై అంతగా పట్టులేనప్పటికీ, అతని శ్రోతలు, ఆ భాషను అర్థం చేసుకునే మనస్సు అతనికి సహాయపడిందనడంలో సందేహంలేదు, తమిళభాషపై పట్టు అతనికి చాలా పరిమితంగా ఉందని లేఖల ద్వారా స్పష్టమైంది. అనేక అద్భుతాలు అతని సువార్త పరిచర్యను, కేప్‌మిషన్ అలంకరించాయి అనే వాస్తవాన్ని తిరస్కరించలేము. తరువాత డచ్‌వారు ఈ ప్రాంతంలో ఆధిపత్యం చెలాయించారు. కతోలిక శ్రీసభను విడిచిపెట్టమని

పరవాస్ను బలవంతం చేయడానికి తమవంతు ప్రయత్నం చేసినప్పుడు, తిరస్కరించలేని వాదన, జేవియర్ యొక్క అద్భుతాలకు ఒక సూచిక నిదర్శనమైంది. ఫాదర్ ఫ్రానిస్‌లాగా చనిపోయిన వారిని బ్రతికించండి, ఆపై మేము మీ చర్చిలో చేరుతాము అని వారు ధైర్యంగా సమాధానం ఇచ్చారు. సుమారు ఒక సంవత్సరం పాటు జేవియర్ తన ప్రజల ఆధ్యాత్మిక సంక్షేమం కోసం తన వంతు కృషి చేస్తూ గ్రామం నుండి గ్రామానికి ఒంటరి మార్గంలో సహాయకులు లేకుండా చాలా కష్టంగా, వెళ్ళి సువార్త పరిచర్య చేసేవారు.

## 1.2. ఫ్రాన్సిస్ లేఖలు: క్రైస్తవ లెక్కలో పెంపు

నెలలు గడిచేకొద్దీ, తూర్పుతీర ప్రాంతాలలో ఏమి జరుగుతుందో ఫ్రాన్సిస్ జేవియర్ తన ఉన్నతాధికారులకు తెలియజేసారు. అతను తన ఉన్నతాధికారులకు, అతని స్నేహితులకు లెక్కలేనన్ని లేఖలు రాశారు. వీటిలో కొన్ని లేఖలు అందుబాటులో ఉన్నాయి, మరికొన్ని లేవు. ఈ లేఖలు ఎంత స్ఫూర్తిదాయకంగా ఉన్నాయి, అప్పటికే 1545లో, జనవరి 15న కొచ్చిన్ నుండి జేవియర్ రాసిన ప్రసిద్ధలేఖకు ఫ్రెంచ్‌లో అనువదించి పారిస్‌లో ముద్రించారు. దాని విజయం ఏమిటంటే, పారిస్‌లో రెండవ ముద్రణను వెంటనే కోరడం జరిగింది, అదే సంవత్సరం జర్మన్ ముద్రణను ప్రచురించారు. చాలా మంది ప్రజల ఉత్సాహాన్ని మేల్కొల్పాయి, అవి భవిష్యత్ వృత్తుల నర్సరీగా మారాయి.

భారతదేశంలో ప్రాన్సిస్ జేవియర్ గారి శ్రమ, విజయం యొక్క మొదటి వార్తగా ఐరోపా శ్రీసభ తుఫానుగా తీసుకుంది. ఫాదర్ జేవియర్ ప్రారంభ లేఖల కాపీల తర్వాత చాలా కాపీలు కష్టపడి తయారు చేశారు. జేవియర్ యొక్క అత్యంత ప్రసిద్ధ మిస్సివ్ గురించి మాట్లాడుతూ, ప్రపంచమంతా ఆశ్చర్యానికి గురైన ఆ లేఖ ప్రపంచాన్ని చుట్టివచ్చింది.

జేవియర్ తన బోధన ద్వారా భారతదేశంలో కంటే తన లేఖ ద్వారా స్పెయిన్, పోర్చుగల్‌లో ఎక్కువ క్రైస్తవుల మనస్సులపై పడిన ముద్ర చాలా గొప్పది, వాటిని పునీత పౌల్ యొక్క లేఖలతో మాత్రమే పోల్చవచ్చు, ఇది మొదటి ప్రజలపై అదే ప్రభావాన్ని తదుపరి శతాబ్దాలు చూపింది. ఈ లేఖలు అతని కాలంలో భారతదేశంలో క్రైస్తవమతం వ్యాప్తి గురించి మనకు ఒక

ఆలోచన ఇవ్వడమే కాకుండా ఆ రోజుల్లో భారతదేశంలో ఉన్న చారిత్రక దృశ్యాన్ని కూడా వెలుగులోకి తీసుకొచ్చాయి. ఆ కోణంలో ఈ లేఖలు చరిత్రాత్మకమైనవి. మన్సిల్హాస్‌కు ఫ్రాన్సిస్ రాసిన లేఖలు విజయనగర తెలుగు చక్రవర్తి, ట్రావెన్‌కోర్ చేరా రాజు ఒకవైపు, త్రినివేలి పాండ్య రాజుల మధ్య జరిగిన యుద్ధాలపై చాలా వెలుగునిస్తాయి.

## 1.2.1. పోర్చుగల్ రాజు జాన్ IIIకు లేఖ

ఆ కాలంలో పోర్చుగల్ రాజు, తూర్పు దేశాలకు కొందరు బోధకులను పంపమని, తన రోము నగర రాయబారి ద్వారా ఇన్యాసివారికి వర్తమానం పంపగా ఇన్యాసివారు, రాజుగారి విజ్ఞప్తిని మన్నించి, తన ప్రియ శిష్యుడైన ఫ్రాన్సిస్ శౌరివారిని పంప నిశ్చయించారు. ఫ్రాన్సిస్ జేవియర్ గారు జపాన్ ద్వీప ప్రాంతాలలో నివసించే ప్రజలలో గమనించినది ఏమనగా “చాల మంది విద్యావంతులు, న్యాయ మూర్తులు ఉన్నారు. వాళ్ళను సువార్త పరిచర్యకు ఉపయోగించు కోవాలని భావించాను. మన పవిత్ర మతాన్ని స్వీకరించడం, దీని తరువాత, నేను నా హృదయంలో కొంత అంతర్గత కదలికను అనుభూతి చెందేలా చేయమని ప్రభువును గట్టిగా అత్యవసరంగా వేడుకోవాలని నేను భావించాను”. ఆయన నాకు ఆజ్ఞాపించిన దానిని నెరవేర్చుటకు నా ప్రార్థనను మన్నించడం అతని దివ్య మహిమను సంతోషపెట్టింది. నేను జపానుకు వెళ్లడం దేవుని సేవకు తగినదని నా మనస్సులో అత్యంత సన్నిహితమైన నిశ్చయత, దృఢ సంకల్పం నాకు ఉంది. ఇది నాకు బలమైన విశ్వాసాన్ని ఇచ్చింది. నేను భారతదేశం నుండి ప్రయాణించడం ద్వారా ఆలస్యాన్ని ముగించాను.

నేను దేవుని నిస్సందేహమైన పిలుపును అనుసరించగలనని, అతను తరచూ బలమైన అంతర్గత ప్రేరణల ద్వారా ఈ ప్రయాణానికి నన్ను ప్రేరేపించాయి. మేము ఇప్పుడు జపానుకు వెళ్లే మార్గంలో మలక్కా ఓడరేవు వరకు చేరుకున్నాము. సభలో నాతో పాటు ఇద్దరు, ముగ్గురు జపనీస్ క్రైస్తవులు ఉన్నారు, ఇటీవల మతం మారారు. మన ప్రభువైన యేసుక్రీస్తు జీవిత బోధన రహస్యాలు, సిద్ధాంతాలు పూర్తిగా బోధించబడిన తరువాత, వారు శాంటా ఫే కళాశాలలో గోవాలో జ్ఞానస్నానం పొందారు. వారు మా పద్ధతిలో చదవడం, వ్రాయడం

నేర్చుకున్నారు. క్రీస్తు శ్రమలు, బాధలను పరిగణనలోకి తీసుకోవడం అతని సిలువ, మరణాన్ని జ్ఞాపకం చేసుకోవడం వారి మనస్సులను కదిలిస్తూ ప్రభావితం చేశాయి. వారు ఫాదర్ ఇగ్నేషియస్ యొక్క సన్యాస ధ్యానాలలో గొప్ప శ్రద్ధతో తమ మనస్సులను మరలించారు.

దేవుని గురించి స్పష్టమైన జ్ఞానంలో వారు చాలా అద్భుతమైన ఫలాలను పొందారు. వారి స్వంత ప్రజలను క్రీస్తు మతం వైపు నడిపించాలనే గొప్పకోరిక ద్వారా వారి స్వంత దేశానికి ఈ సముద్రయానంలో మాతో చేరాలని కోరుతున్నారు. నేను చెప్పిన ఆరుగురు, 1549 సంవత్సరం మే చివరి రోజున మలక్కా చేరుకున్నాము. మలక్కా కోట కమాండెంట్ మమ్మల్ని సాధారణ దయతో స్వీకరించారు. మా ఈ యాత్రను నిర్వహించడానికి, ప్రోత్సహించడానికి వారి నుండి ఆశించదగిన సహాయాన్ని మాకు చాలా సులభంగా అందించారు. అలాగే, దేవుని సేవించాలని గొప్ప ఆశతో అతను మాకు సౌకర్యవంతమైన ఓడను వెతకడానికి చాలా కష్టాలు పడ్డారు. మాకు ఇతర సౌకర్యాలను అందించారు. అతను చేసిన అన్ని దయగల వాగ్దానాలను చాలా సమృద్ధిగా నెరవేర్చారు. వారి మంచితనానికి తగిన విధంగా ప్రతిఫలము అనుభవిస్తున్నాము. అతను మా స్వంత సోదరుడైతే, మేము అతని నుండి ఇంతకంటే గొప్ప లేదా సమర్ధవంతమైన దయను ఆశించలేము. కాబట్టి, మా ప్రభువైన దేవుని పట్ల మీకు ఉన్న ప్రేమతో డాన్ పెడ్రో డి సిల్వాకు మేము రుణపడి ఉన్నము అని నేను మిమ్మల్ని ప్రార్ధిస్తూ వేడుకుంటున్నాను.

**ఈ లేఖలోని ప్రధాన అంశాలు:**

ఎ) యేసుసభ పాలక మతాధికారి, ఇన్యాసి వారి ప్రార్ధన సూచనలు, అనగా యేసుక్రీస్తు జీవిత బోధన రహస్యాలు ద్వార అనేక మంది జీవితాలు క్రీస్తు వైపు మరలించడం.

బి) సేవా తత్పర భావం.

సి) "దేవుని పట్ల ఉన్న ప్రేమ, నీ పొరుగు వారిని ప్రేమింపుము" ధనిక–పేద అని తారతమ్యం లేకుండా ప్రేమించాలి.

## 1.2.2.రోము నగరమునకు లేఖ

ఫ్రాన్సిస్ జేవియర్ లిస్బన్ చేరుకున్న తర్వాత రోముకు వ్రాసిన మొదటి లేఖ 23జూలై, బోబాడిల్లాకు వ్రాయబడింది. యేసు సభలోని ప్రతి ఒక్కరూ, రోమ్ లో ఉన్నా లేదా లిస్బన్లో ఉన్నా, వారి పట్ల ఆయన చూపిన అసాధారణ దయకు ఆయనకు అత్యంత కృతజ్ఞతలు. భవిష్యత్తు ఏది తెచ్చినా, ప్రస్తుతానికి వారు తన ప్రభువుకు గొప్ప సేవను అందిచాలని అతనికి అనిపించింది. వారు దేవుని కోసం, మోక్షానికి తమతో పాటు భారతదేశానికి వెళ్ళడానికి సిద్ధంగా ఉన్న కొంతమంది మతాధికారుల కోసం వెతకాలి అని సంబోధించారు. వారు తమతో పాటు ఒక డజను ఆత్మలు తీసుకువస్తే, వారు ఖచ్చితంగా ఆ దేశంలో చాలా ఫలాలను ఇస్తారు.

రెండవది, ఒక ఉపగురువు త్వరలో గురువుగా నియమింపబడతారు. అదే విధంగా పారిస్లో వైద్య విద్యను అభ్యసించిన డాక్టర్. లోపో సెర్రో కూడా వారితో కలిసి భారతదేశానికి వెళ్లాలని కోరుకున్నారు. ఒక మిషనరీ డాక్టర్ అతను తన వైద్య జ్ఞానాన్ని ఆత్మల మోక్షాన్ని పొందడంలో సహాయంగా ఉపయోగించాలని కోరుకున్నారు. తద్వారా స్వర్గంలో తన ప్రతిఫలం పొందాలని కోరుకున్నారు. నేను మీతో మాట్లాడ వలసిన కొన్ని విషయాలు ఉన్నాయి: కాబట్టి నేను రోమ్ నుండి చాలా దూరంలో ఉన్నను, ప్రపంచంలోని ఈ భాగాలకు సంబంధించిన కొన్ని సూచనలు మాత్రమే చెప్తాను.

మొదటి స్థానంలో, భారతీయుల జాతి మొత్తం నేను చూడగలిగినంత వరకు, చాలా అనాగరికమైనది; వారి స్వంత మర్యాదలు, ఆచారాలకు తగనవి ఏదైనా వినడానికి ఇష్టపడరు, నేను చెప్పినట్లుగా, భారతదేశ అనాగరికమైనది. దైవిక విషయాలు, మోక్షానికి సంబంధించిన విషయాల గురించి ఏదైనా నేర్చుకోవడం చాలా తక్కువగా ఉంటుంది, వారి అస్థిరత, ఉదాసీనత మనస్సు అద్భుతమైనవి. క్రైస్తవులను ఉన్నతంగా ఉంచడంలో, అన్యజనులను మార్చడంలో మాకు ఇక్కడ కష్టంతో కూడిన పని, దేవుని గురించి అవగాహన లేని, హేతుబద్ధతను అనుసరించని వ్యక్తులకు బోధించడం ఎంత కష్టమైన పనో మీకు బాగా తెలుసు, కాని ఇప్పుడు పాపపు అలవాట్లను విడిచిపెట్టమని చెప్పడం

వింతగా సహించరాని విషయం. జేవియర్ గారు తక్కువ క్రైస్తవ భావాలను 1552లో చైనాకు ప్రయాణించినప్పుడు గోవాలో ఉన్నతాధికారిగా ఉన్న గ్యాస్పర్ బార్జాయస్ కోసం జేవియర్ రాసిన ఐదు సూచనలు ఈ రోజు పాఠకులకు చాలా ఆసక్తికరంగా ఉన్నాయి. అవి:వారి తాత్కాలిక పరిపాలన, ఉన్నతమైన పాలన, వినయం, వ్యక్తిగత ప్రవర్తన, కుంభకోణాలకు దూరంగా ఉండడం గురించి లేఖలో ప్రస్తావించారు.

## 1.2.3. రెవరెండ్ ఫాదర్ ఇగ్నేషియస్‌కు లేఖ

నా ప్రియమైన ఫాదర్ ఇగ్నేషియసుకు, ఈ జన్మలో, తరువాత మోక్షంలో నిన్ను చూడాలని నేను ఎంతగా కోరుకుంటున్నానో, మీ నుండి సహాయం అవసరమయ్యే అనేక విషయాలను నేను మీతో మాట్లాడటానికి, విధేయత సంబంధానికి అడ్డంకి కాదు. ఇప్పుడు మన యేసుసభలో చాలా మంది గురువులు ఉన్నారని నేను విన్నాను. మన ఆత్మలకు మంచి వైద్యుల అవసరం చాలా ఉందని నేను భావిస్తున్నాను. నా ఉత్తమ స్నేహితుడా! మమ్మల్ని, ఇక్కడ భారతదేశంలో ఉన్న మీ పిల్లలను, అలాగే ఇతరులను జాగ్రత్తగా చూసుకోవాలని అనేది చాలా గొప్ప పుణ్యం, పవిత్రత కలిగిన వారిని పంపమని మా ప్రభువైన యేసు ద్వారా నేను మిమ్మల్ని ప్రార్థిస్తున్నాను. నా శోకమొర వినుము,మీరు క్షుణ్ణంగా అర్థం చేసుకున్నట్లుగా, దేవుని సహాయంతో, మా మనస్సును, స్థితిని, ఒరవడిని బట్టి, మనందరిపై మీరు శ్రద్ధగల చర్యలు తీసుకుంటారని నేను గొప్ప ఆశతో ఉన్నాను. ఈ దేశం, మన యేసుసభ నుండి సువార్త బోధ కంటే అత్యవసరంగా ఏమీ కోరుకోదు. మాస్టర్ సైమన్ మంచి బోధకుడుగా సేవ చేస్తున్నారు.ఇప్పుడు భారతదేశంలోని పోర్చుగీసువారు, మన పట్ల వారి స్నేహం, సద్భావన చాలా బలంగా ఉన్నది. మన యేసుసభకు చెందిన కొంతమంది మంచి బోధకులను కలిగి ఉండాలనే కోరిక అద్భుతమైన స్థాయిలో ఉంది; కాబట్టి, వారికి ఈ న్యాయమైన, పవిత్రమైన అభ్యర్థనను గుర్తుంచుకోవాలని, సువార్త బోధకు సరిపోయే కొంతమంది గురువులను ఇక్కడకు పంపమని, నేను మిమ్మల్ని ప్రార్థిస్తున్నాను,కావున వారు దారితప్పిన, వారికి మోక్షానికి సరైన మార్గాన్ని చూపవచ్చును.

## ఈ లేఖలోని ప్రధాన అంశాలు:

ఎ) ఫ్రాన్సిస్ శౌరివారు ఎంతో కృతుహలంతో పాపపు ఊబిలోవున్న అన్యులను సంరక్షించాలి, వారికి నిజమైన దేవుడు ఎవరు అని తెలియజేయాలని తపన.

బి) యేసు సభకు వున్న మూడు వ్రత ప్రమాణాలలో అతి ప్రధానమైన వ్రతం 'విధేయత'. ఇన్యాసివారు, ఫ్రాన్సిస్ 'ప్రభు క్రీస్తుకు సేవ చేసేందుకు నీవు భారతదేశం వెళ్ళవలసి ఉంది'. అటు పిమ్మట పాపుగారు ఫ్రాన్సిస్ గారితో "ఆత్మల సంరక్షణలో కష్టాలు తప్పవు. కాబట్టి కష్టాల నెదుర్కొ నెందుకు సిద్ధంగా ఉండు". ఈ ఇద్దరు ఆజ్ఞలకు విధేయత వహించి, సువార్త పరిచర్యను అత్యుత్సాహంతో, చురుకుగా అందరి హృదయాలలో జ్వలింపజేశారు.

సి) కోత ఎక్కువగా ఉన్నది, ప్రభురాజ్య విస్తరణకు కోతగాండ్రు తక్కువగా ఉన్నారు, కావున సువార్తికులు పంపమని విన్నవించడం.

## 1.2.4. చివరి లేఖ

ఫ్రాన్సిస్ జేవియర్ చివరి లేఖలో ప్రస్తుత జపాన్‌లోని ప్రముఖ సంస్థల ఫీచర్లు లేని లేదా కనీసం మనకు వచ్చిన ప్రతి పాక్షిక వర్ణనలలో, ప్రధానంగా పన్నుల నుండి మనకు కనిపించినట్లయితే, అది మనకు ఆశ్చర్యం కలిగించదు. దౌత్యవేత్తలు, రాజకీయ ప్రతినిధులు, ఐరోపా శక్తులు, మోడెమ్ రాజధాని తప్ప దేశంలో దాదాపు ఏమీ చూడలేదు. జపాన్‌లోని విశ్వవిద్యాలయాలు లేదా అకాడమీలు, రెండు జాతుల మతపరమైన కమ్యూనిటీలకు సంబంధించి, వాటి పేర్లు సహజంగా మాత్రమే ఉంటాయి. వారు కోపం పెదవుల నుండి తీసివేయబడినప్పటికీ వారు దశల వారిగా పూర్తిగా రూపాంతరం చెంది ఉండవచ్చును. బహుశా ఫ్రాన్సిస్‌ను జపాన్‌లోని, 'హాన్–సిరో' అని అతని సహచరులు పిలుస్తారు.

సముద్రయానం యొక్క ప్రమాదాలు, అతని స్వంత ఆత్మవిశ్వాసం యొక్క మూలాలు, స్వచ్ఛమైన ఉద్దేశ్యం గురించి, బహుశా అతను చాలా ఇష్టపడే స్నేహితులకు సరళమైన రీతిలో భావాలను పంచుకున్నారు. కాని భారతదేశం, జపాన్ భవిష్యత్ మిషనర్‌ల నర్సరీగా కనిపించడానికి అతను వచ్చిన కోయింబ్రా

వద్ద వారు ఎవరిని ఉద్దేశించి ప్రసంగించారో వారికి వాటి ఉపయోగం లేకుండా పోయింది. కోయింబ్రాకు పంపిన లేఖలో ఫ్రాన్సిస్ మాట్లాడే సందేశం రోముకు సంబోధించినది.

అదే లేఖలో వేదాంతులు ఏ ప్రమాదంలో ఉండవచ్చునే అభిప్రాయాన్ని గురించి చెప్పవచ్చును. అతను ఇప్పుడు చేపట్టబోయే సముద్రయానాల్లో సువార్త ప్రచారకులు తమ జీవితాలను బయటపెట్టారు. అతను బహుశా జపానుకు తనను అనుసరించడానికి ఇప్పటికే భారతదేశానికి చేరుకున్న లేదా అక్కడికి వెళుతున్న వారిలో కొందరిని పిలవవలసి ఉంటుందని అతను ఆలోచిస్తూ ఉండవచ్చును. సంస్థలో వారి కోసం ఎదురుచూసిన భౌతిక, నైతిక ప్రమాదాలను ధైర్యంగా ఎదుర్కోవడానికి వారికి స్వీయ–విజయం మాత్రమే ఆదరువు. లేఖ యొక్క ముగింపు విషయానికొస్తే, దీనిలో పవిత్ర విశ్వాసం యొక్క పాల్ బోంజె మతాల అంతర్గత అభ్యాసాల గురించి, కొంతమంది సెనోబైట్ల ప్రజలకు బోధించడం గురించి ఉటంకించారు. మహర్షులు ఉపయోగించిన తన మతాన్ని ప్రచారం చేయడానికి బోధించడం గొప్ప సాధనం. అతను ఉన్న నగరంలో ఎప్పుడూ విఫలం కాలేదు. ధార్మిక పనులు, మతపరమైన ఉత్సాహంతో చాలా ప్రసిద్ధి చెందింది.

**ప్రధాన అంశాలు:**

ఎ) క్రీస్తు ప్రభువు మాటల్లో, 'సత్యం, జీవం, మార్గం' అనే ఆయుధాలను ప్రతి క్రైస్తవుడు అనుసరించాలి. శౌరిగారి మాటల్లో, 'క్రైస్తవుడు సిలువ మరణం పొందాలి'.

బి) విగ్రహారాధన, మూఢ నమ్మకాలు నమ్మేవారిని, క్రైస్తవ జీవితంలోకి తీసుకొనిరావడానికి వారి వేషధారణ, సంస్కృతులు, ఆచారాలు ద్వారా వారికి నిజమైన దేవుని గురించి బోధించారు. అదే విధంగా మరణ, పునారుత్థానం, క్రీస్తు ప్రభువు రెండవ రాకడ గురించి ప్రస్తావించారు.

సి) శౌరిగారు, అతను అనుచరులు ద్వార జపాన్ దేశంలోవున్న వివిధ మత సంఘాలను దశల వారిగా రూపాంతరం చేశారు. పాల్‌బొజెస్ మఠం,

సైనోబైట్ మునీశ్వరులు మతాలను అధ్యయనం చేసి దానిలో నుంచి క్రీస్తు బోధనలు ప్రచారం చేయడంలో ప్రసిద్ధిచెందారు.

## 2.3. ఫ్రాన్సిస్ మిషనరీ బోధనలు

ఫ్రాన్సిస్ మెచ్చుకోదలుచుకున్న విషయం ఏమిటంటే ! మేము చిన్నపిల్లలకు జ్ఞానస్నానం ఇచ్చే విషయంలో ప్రత్యేక శ్రద్ధ, జాగరూకతతో వ్యవహరించాలి. అదేవిధంగా ఆలస్యంగా జన్మించిన ప్రతి బిడ్డను క్రీస్తు యొక్క రక్షణ తొట్టిలో పునరుత్పత్తి చేయాలి. మేము ప్రస్తుతం పని చేస్తున్న గ్రామాలు లేదా వ్యవసాయ స్థావరాలు లేదా ఇకపై ఏదైనా ధనము కలిగి ఉంటాయి. మీరు ఈ భాగాలలో నియమించబడే అన్ని రకాల సువార్త శాఖలలో ఇది ప్రధానమైనది, అత్యంత విలువైనదిగా భావిస్తూ, అందువల్ల మీరు దానిని మరొకరికి అప్పగించ కూడదని నేను భావిస్తూన్నాను. స్థానికుల పై అధికారం ఉన్న రాజ అధికారులు ఆదేశాలు అందుకున్నారని, అలాగే కుటుంబ పెద్దలకు జ్ఞానస్నానం పై సమాచారం ఇవ్వాలని వారిని వారికుటుంబాలు పెరిగినట్లు చేశాము.

నూతనంగా జన్మించిన చిన్న పిల్లల భద్రత దృష్ట్యా తల్లిదండ్రులు శ్రద్ధ వహించ లేక పోతున్నారు. ఇంతలో, చిన్న పిల్లలు జ్ఞానస్నానం లేకుండా చనిపోతారు. కాబట్టి మీరు స్వయంగా వెళ్లి, ఏ స్త్రీ అయినా బిడ్డకు జన్మనిచ్చిందా, ఏదైనా కారణం చేత అక్కడ ఒక ఆత్మ దొరుకుతుందా అని ఇంటింటికీ తిరుగుతూ కఠినమైన విచారణ చేయాలి. ప్రజలు వారి పిల్లలను తీసుకువస్తారు, వారిని క్రైస్తవులుగా చేసి వారి ఆత్మలు మోక్షానికి భద్రపరచాలి. నా అనుభవాన్ని నమ్మండి; మన శ్రమకు విలువైన, ఈ రెండు రకాలు: సేవ, శిశువులకు జ్ఞానస్నానం ఇవ్వడం, నేర్చుకునే సామర్థ్యం ఉన్న పిల్లలకు నేర్పించడం.

కాబట్టి, ఈ రెండవదానిని మొదటిదాని వలె లేదా అంతకంటే ఎక్కువ శ్రద్ధతో చూసుకోమని వారికి ఆదేశించారు. నా ఉద్దేశ్యం, పిల్లల బోధన విరామం లేకుండా సాగేలా మీరు అత్యంత సమర్థవంతమైన జాగ్రత్తలు తీసుకుంటారు. మీరు ఏ ఒక్క గ్రామంలోనైనా స్థిరమైన శాశ్వతమైన ఇంటిని కలిగి ఉండకూడదు, కాని ఎల్లప్పుడూ స్వేచ్ఛగా అన్ని ప్రదేశాలకు, ఒకదాని తర్వాత ఒకటిగా వెళ్లడానికి సిద్ధంగా ఉండాలి. ప్రతిరోజు ఒక నిర్దిష్ట ప్రదేశంలో

పిల్లలను సమీకరించాలి. వారికి చదవడం, మతం యొక్క అంశాలను బోధించాలి. ప్రతి శనివారం, ఆదివారం, స్త్రీ పురుషులను ప్రార్ధనలు చేయడానికి దేవాలయములో సమావేశం అయ్యేటట్లు మీరు చూడాలి. ఈ సమావేశాలకు తరచుగా వస్తారా లేదా అని ప్రత్యేకంగా విచారణ చేయాలి. అప్పుడు మీరు ఆ స్థలంలో ఆధిపత్యం చెలాయించే దుర్గుణాలకు వ్యతిరేకంగా మాట్లాడతారు, అజ్ఞానులు అర్థం చేసుకోగలిగే స్పష్టమైన ఉదంతాలు చిత్రాల ద్వారా చూపాలి. అక్కడ నివసించే ప్రజల మధ్య ఏవైనా వైషమ్యాలు లేదా ద్వేషాలు ఉన్నాయా అని ప్రతి చోటా విచారణ చేసి ప్రజలను శాంతింపజేయాలి. ఏ ఇంటిలోనైన మతకర్మల సహాయం లేకుండా మరణిస్తే, అతను చనిపోయినప్పుడు మీరు అతన్ని స్మశానవాటికలో ఖననం చేయడానికి తప్పకుండా అనుమతి ఇవ్వాలి.

మీరు జబ్బుపడిన వారిని సందర్శించినప్పుడు, అక్కడ ఉన్న వారిలో ఎవరైనా వారి భాషలో పవిత్ర విశ్వాసాన్ని పఠించమని, తరువాత వారిచే పవిత్రమైన సువార్తను చదివించి, ఎవరైనా చనిపోయినప్పుడు, మీరు దేవాలయము నుండి శవం ఉన్న ప్రదేశానికి ఊరేగింపుగా వెళ్లాలి. క్రైస్తవ సిద్ధాంతాలు, ఆచారం ప్రకారం, శరీరం భూమికి కట్టుబడి ఉండటానికి ముందు, మీరు ఎల్లప్పుడూ ఒక చిన్న ఉపన్యాసం మార్గంలో తగిన విధంగా ఏదైనా చేయాలి.

ఈ సందర్భంగా, అంత్యక్రియలకు గుమిగూడిన జనసమూహానికి, మరణం యొక్క నిశ్చయత గురించి, జీవితం యొక్క అనిశ్చితి గురించి, వారి ఆలోచనలు సవరణలతో జీవించేలా చేయాలి, పాపాల కోసం ప్రాయశ్చిత్తం చేయడాన్ని వాయిదా వేయకూడదు అని వారికి బోధిస్తూ, వారు మరణం ద్వారా పట్టుబడితే, వారు శాశ్వతమైన శాపాన్ని తప్పించుకోలేరు; మరోవైపు, వారు దేవుని దయలో పట్టుదలతో ఉంటే, వారు చనిపోయినప్పుడు, స్వర్గం యొక్క ఆనందాలలోకి వెళ్లాలని వారు న్యాయంగా ఆశించవచ్చును. ఒక పురుషుడు లేదా స్త్రీ విగ్రహాలను చెక్కినందుకు దోషిగా నిర్ధారించబడినప్పుడు, అటువంటి వారికి చట్టపరంగా విధించబడే శిక్ష ఏమిటంటే, తప్పు జరిగిన ప్రదేశం నుండి బహిష్కరించడం. ఇటీవల కాలంలో విగ్రహారాధన విడనాడి క్రైస్తవ జీవితంలోకి మారిన ఈ పేద జీవులు తమ చిన్ననాటి నుండి పైకి ఎంత చెడ్డ విద్యను పొందారో మీరు

పోర్చుగీసు వారిని అనుకూలంగా పరిగణించమని అడగాలి. వారు విశ్వాసాన్ని స్వీకరించినప్పటి నుండి తక్కువ వ్యవధిలో వారికి ఎంత తక్కువ సమయం గురువులు లేకపోవడానికి అనేక సందర్భాల్లో, వాటిని స్వీకరించడానికి క్రైస్తవులుగా తీవ్రంగా వారు ఈ విషయాలన్నింటినీ తెలివిగా పరిగణలోకి తీసుకుంటే, ఈ నిర్దేశించని అనాగరికుల లోపాలను క్షమించడంలో వారు చాలా శ్రద్ధవహించాలి.

అదే సమయంలో, క్రైస్తవులను కొన్ని సార్లు హింసించగల అన్యాయమైన అణచివేతకు మీరు సహకరించడం సరైనదని అర్థం కాదు. మీరు అలాంటి ఏదైనా చూసినప్పుడు, అన్ని విధాలుగా వారిని మందలించండి, కాని సున్నితంగా ప్రేమతో మందలించాలి. మీరు ఈ పద్ధతిలో ఎటువంటి మార్గం చూపకపోతే, మీ ఫిర్యాదును కమాండెంటుకు తీసుకెళ్లండి, అణచివేతకు గురైన అమాయక బాధితుల హక్కును వినయంతో పరీక్షించండి.మీరు ఎవరికి వ్యతిరేకంగా అభ్యర్థిస్తున్నారో వారితో మీ స్నేహాన్ని కోల్పోకుండా ఉండవచ్చు.

పోర్చుగీస్‌తో మీ సంభాషణ ఎల్లప్పుడూ ఆత్మల మోక్షానికి, ధర్మ పురోగతికి సంబంధించిన పవిత్రమైన విషయాలు మరణం, తీర్పు, నరకం యొక్క శిక్షలు, ప్రక్షాళన గురించి వారితో వ్యక్తిగతంగా, బహిరంగంగా మాట్లాడండి, పశ్చాత్తాపం గురించి మతకర్మలను తరచుగా చేయమని దేవుని చట్టంలోని పది ఆజ్ఞలను, అన్ని విషయాలను పాటించమని వారిని ప్రోత్సహించండి.

**ప్రధాన అంశాలు:**

ఎ) ఫ్రాన్సిస్ శౌరి వారు సువార్త పరిచర్యకోసం, ముందుగా చిన్న పిల్లలపై శ్రద్ధపెట్టడం, వారికి జ్ఞానస్నానం ఇవ్వడం ద్వారా శ్రీసభలో భాగస్వామి చేయడంలో ఫలభరితము చెందారు.

బి) ఫ్రాన్సిస్ గారు, యేసు ప్రభవు బోధించిన అష్టభాగ్యాలను అనుసరించి ప్రజల పట్ల అదే వ్యక్తిత్వాన్ని కనపరిచారు. దానిలో ఒకటి పాటించిన మన జీవితం ధన్యమౌవుతుంది.

సి) దేవుడు సృష్టించిన ఈ భూలోకంలో మానవ జీవితం స్వల్పకాలం, మనము జీవించినంతకాలం మంచి జీవితం జీవించాలి. కనీసం నలుగురు

మన జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలి, దాని కోసం శ్రమించాలి.

## 1.4. సువార్త పద్ధతులు

ఎ) ఫ్రాన్సిస్, గోవా పట్టణంలోని ఏదైనా శాశ్వత క్రైస్తవమత సవరణ చేయాలంటే, ముందుగా పనిని, పిల్లలు, జైళ్లు, వీధులు, కూడళ్లలో సిలువ పట్టుకొని, గంట మోగిస్తూ బిగ్గరగా పిలిచేవారు. యేసుక్రీస్తు యొక్క నమ్మకమైన క్రైస్తవ స్నేహితులారా! దేవుని ప్రేమ కోసం, మీ అబ్బాయిలు, అమ్మాయిలుకు క్రైస్తవ సిద్ధాంతంలోని సత్యోపదేశము చేయాలి. మొదట గుమిగూడిన పిల్లలకు సత్యోపదేశము చేసి, తరువాత బహిరంగ ప్రదేశంలో పెద్దలకు చేసేవారు.

బి) 16వ శతాబ్దంలో ఫాదర్ లూసెనా, ఫ్రాన్సిస్ ఒక చిన్న సత్యో ఉపదేశం వ్రాసారు. ఇగ్నేషియసుకు రాసిన లేఖలలో, అతను తరచుగా 300 మంది పిల్లలను ఆసుపత్రికి సమీపంలో ఉన్న జపమాల మాత దేవాలయములోకి తీసుకెళ్లి, వారికి ప్రార్థనలు, దేవుని ఆజ్ఞలను బోధించారు. ఇది గమనించిన గోవా పీఠాధిపతి, తమ గురువులకు వారి విచారణ దేవాలయాల్లో కూడా అదే విధంగా బోధించాలని ఆదేశించారు.

సి) తన చిన్న శ్రోతల అస్థిర మనస్సులపై విశ్వాసం యొక్క సత్యాలను ఆకట్టుకోవడానికి, పాట రూపంలో పిల్లలకు నేర్పించారు. ఈ నవ వ్యవస్థ చాలా ప్రజాదరణ పొంది పిల్లలు, బానిసలు సత్యోపదేశము పాడటం అలవాటు చేసుకున్నారు. ఈ ఆచారం నేటికీ కొనసాగుతోంది.

డి) అతను తరచుగా వారి సంస్థానాధీశుల దుర్మార్గాలను ఖండించాడు, అతని అనర్గళమైన మాటలు సమాజంపై అద్భుతమైన ప్రభావాన్ని చూపాయి, మైనములా గట్టిపడిన హృదయాలను కరిగించి, వేలాది మందిని పశ్చాత్తాపానికి గురిచేశాయని జీవిత చరిత్ర చెప్తుంది.

ఇ) భారతీయ క్రైస్తవులు అన్యమతస్థుల సమూహాలకు ఈ ఉపన్యాసాలలో, ఫ్రాన్సిస్ హిందూ, మలయన్ పదాలతో కలిపిన పోర్చుగీస్ ఆధారిత మాండలికాన్ని ఉపయోగించారు, దీనిని సాధారణంగా తూర్పుదూర ప్రాంతాలులోని ప్రతి ఒక్కరూ మాట్లాడతారు, అర్థం చేసుకుంటారు.

ఎఫ్) ఫ్రాన్సిస్ దక్షిణ భారతదేశంలో సాధారణంగా ఉపయోగించే మాతృభాషను అధ్యయనం చేయడానికి శ్రద్ధతీసుకున్నారు, పదేళ్ల కాలంలో అతను అనర్గళంగా మాట్లాడేవాడని లైసెన్షియేట్ జోమ్ వాజ్ తెలిపారు. జేవియర్ విశ్వవ్యాప్తంగా ప్రేమించబడ్డాడని, 'గ్రేట్ ఫాదర్' అని పిలవబడ్డాడని లైసెన్షియేట్ చెప్పారు.

జి) గోవా నుండి, ఫాదర్ లాన్సిలోట్టి,ఇగ్నేషియసుకు, ఫ్రాన్సిస్ అందరి హృదయాలను దోచుకున్నాడని అతని ఉపన్యాసాలు, అతని మతబోధనలు, ఒప్పుకోలు వినడం ద్వారా భారతదేశంలో గొప్ప పేరు సంపాదించాడని వ్రాసారు. పీఠాధిపతి మాటల్లో, "వినయపూర్వకమైన మిషనరీ మధ్య సఖ్యత ఎంత పరిపూర్ణంగా ఉందో, వారి మధ్య ఒకే హృదయం, ఒక ఆత్మ ఉన్నట్లు గమనించబడింది". ఫ్రాన్సిస్ చాలా చురుకుగా ఒకేసారి పది ప్రదేశాలలో మిషనరీ ప్రణాళికలన్నింటికి ఆదేశించారు.

**ముగింపు**

పునీత పౌలుగారి మాటల్లో, "విశ్వసించిన వారందరు ఒకే మనసుతోను, ఒకే హృదయంతోను జీవించుచుండిరి" (అ.కా. 4:32) వాక్యాన్ని ధృవీకరణ చేస్తూ, శ్రీసభ సువార్తా పరిచర్య నిమిత్తం పనిచేయుటకు కావలసిన అంకితభావం మీ స్వంతమేనన్న ఆలోచనను కలిగుండాలి, అందునా నేటి సమాజంలోను, సంస్కృతిలోను వచ్చే మార్పులు అతి శీఘ్రగతిన ఉండుటవలన, అవి నూతన సువార్తీ కరణకు పెనుసవాళ్లుగా నిలుస్తున్నాయి. శ్రీసభకు సేవ చేయుటలో మీరు ఉదార స్వభావంతో పట్టువిడువ కూడదని మిమ్ములను ప్రోత్సహిస్తున్నాను. మీ జీవితాలు సువార్తకు అనుగుణమైన పారదర్శకతను కలిగి, క్రీస్తును సందర్శించుట ద్వారా ఉద్దీపన పొంది, భయం లేని ప్రేమతో అతనిని అనుసరించండి.

## రెండవ అధ్యాయం: ఫ్రాన్సిస్ జేవియర్: భారత శ్రీసభకు ఆధ్యాత్మిక మార్గచూపరి

ఫ్రాన్సిస్ జేవియర్ వలె, క్రీస్తు అనుచరులందరూ ప్రవక్తలు, సువార్తికులు, మిషనరీలుగా, సేవకులుగా పిలువబడతారు. క్రీస్తు అనుచరులు క్రీస్తును

స్నేహితుడిగా, ప్రభువు ఎదుర్కొనే శ్రమలు ప్రయత్నించాలి. ఆపై యేసును ఇతరులతో పంచుకోవాలి. యేసుతో స్నేహం అనే అమూల్యమైన నిధిని తన వద్దే ఉంచుకోవడం విరుద్ధం అని పునీత అంద్రెయ మనకు బోధిస్తున్నారు. యేసుప్రభువు పిలిచిన తర్వాత, అంద్రెయ తన సోదరుడు పేతురుకు శుభవార్త "సువార్త" చెప్పడానికి ఉత్సాహపడ్డారు. ఇంత తక్కువ సమయంలో ఫ్రాన్సిస్ జేవియర్ ఎలా క్రీస్తువైపు మార్చారు, జ్ఞానస్నానం ఇచ్చారు. లెక్కలేనన్ని ఆత్మలకు కతోలిక విశ్వాసాన్ని ఎలా బోధించారు? అతని విజయ రహస్యం ఏమిటి? అవి క్షుణంగా తెలుసుకుందాము.

## 2.1. ఫ్రాన్సిస్ ఆధ్యాత్మిక జీవితము

ఫ్రాన్సిస్ మతపరమైన జీవితం కోసం ప్రతిరోజు ఈ క్రింది క్రమాన్ని అత్యంత స్థిరంగా అనుసరించాలని నేను కోరుకుంటున్నాను. ఉదయం మేల్కొన్న వెంటనే, క్రీస్తు యొక్క జీవిత రహస్యాన్ని ధ్యానించండి, అతని పవిత్ర జననం నుండి ప్రారంభించి, స్వర్గానికి విజయవంతమైన ఆరోహణ వరకు నిరంతరం కొనసాగుతుంది. ఆధ్యాత్మిక వ్యాయామాల పుస్తకంలో ఈ ధ్యానాలకు సంబంధించిన విషయాన్ని క్రమంలో ఏర్పాటు చేశారు. ఈ పవిత్ర ధ్యానంలో కనీసం అరగంట అయినా, అదే శ్రద్ధతో, భక్తితో, మీరు మీ నెల తిరోగమన వ్యాయామాల ద్వారా వెళ్ళినప్పుడు మీరు ఉపయోగించిన అన్ని ఆచారాలు నియమాలను గుర్తుంచుకోవాలి. మీరు ప్రతిరోజు కొత్త అంశంతో ధ్యానానికి వెళ్లాలి. ఉదాహరణకు, సోమవారం నాడు మీరు క్రీస్తు జననాన్ని గురించి ఆలోచించినప్పుడు, మంగళవారం మీరు అతని సున్నతిని పరిగణించాలి. ఈ నెలాఖరు వరకు మీరు ప్రభువైన యేసు మహిమాన్వితమైన ఆరోహణ, అన్ని క్రియల గుండా ముగింపుకు రావాలి. దీని తర్వాత మీరు మళ్లీ ఒక రహస్యం నుండి దాని ప్రక్కన వచ్చే మరొక రహస్యానికి కొనసాగండి మరో నెల గడపండి. ఈ ప్రతి వ్యాయామాల ముగింపులో, మీరు ఒకసారి చేసిన ప్రతిజ్ఞలను పునరుద్ధరించాలి. ముఖ్యంగా పేదరికం, పవిత్రత, విధేయత యొక్క ప్రధాన ప్రమాణాలు, వాటిని మళ్లీ న్యూత్నీకరించి దేవునికి సమర్పించి, పునరుజ్జీవింపజేయడం, మీరు వాటిని మొదటిసారి చేసిన అదే లోతైన

ఉత్సాహంతో మీరు పొందే ఇతర ఫలాలతో పాటు, మీరు ఈ ప్రతిజ్ఞను పునరావృతం చేయడం ద్వారా మతోన్మాదం, నరకశత్రువు దాడులను మట్టుపెడతారు.

ఈ రెండూ మిమ్మల్ని ఎప్పుడూ చెడు విషయాలకు ప్రేరేపిస్తాయి. మీరు భోజనం చేసి, కొద్దిసేపు విశ్రాంతి తీసుకున్న తర్వాత, మీరు మీ ఉదయం ధ్యానాన్ని పునరావృతం చేయాలి. దాని మీద అరగంట పాటు గడపాలి, మళ్లీ అదే రహస్యాన్ని పరిగణించండి. మన ప్రభువైన క్రీస్తు యొక్క అత్యంత పవిత్రమైన జీవిత ధ్యానం ముఖ్యమైనది. మీ మధ్యాహ్నం ప్రార్థనకు హాజరు కావడానికి మీరు విశ్రాంతి తీసుకునే సమయం, రాత్రి నిద్రపోయే ముందు, మీరు మనస్సాక్షిని పరిశీలించాలి. రోజంతా ఆలోచనలు, మాటలు, పనుల గురించి విచారించాలి. మీరు చేయవలసిన పనిలో ఏదైనా వదిలిపెట్టారా అని కూడా తెలుసుకోవాలి.

అటు పిమ్మట, గురువు వద్ద మతకర్మ, ఒప్పుకోలులో మీ ఆత్మను శుద్ధి చేయబోతున్నట్లుగా ఈ విషయాలన్నింటినీ పరిశీలించండి, పశ్చాత్తాపం చెందండి. తద్వారా, మీరు ఎవరిని అన్నిటికంటే ఎక్కువగా ప్రేమిస్తారో, ఆపై మిమ్మల్ని అభివృద్ధి చేయమని యేసుక్రీస్తును హృదయపూర్వకంగా ప్రార్థించండి. ఈ జీవన విధానంలో చాలా స్థిరంగా ఉండండి, అనారోగ్యంతో బాధపడినప్పుడు తప్ప, దానిలో కొంత భాగాన్ని వదులుకోవడం మీకు చట్టబద్ధం అని ఎప్పుడూ అనుకోకండి. మీరు బాగా బలంగా ఉన్నంత కాలం, మీరు ఏదైనా సాకుతో, జోక్యం చేసుకునే కారణం ఏదైనా, మీకు అందించిన వాటిలో దేనినైనా వాయిదా వేసినా లేదా పూర్తిగా అమలు చేయకపోయినా, దానిని మనస్సాక్షికి సంబంధించిన అంశంగా చేసుకోండి.

గురువుల ముందు మీ తప్పును అంగీకరించండి.మీ నిర్లక్ష్యానికి శిక్ష విధించమని ఇష్టపూర్వకంగా కోరండి. మీరు అన్ని విషయాలలో విధేయత చూపండి. మీకు ఏది ఆజ్ఞాపించినా, అది ఎంత వివాదాస్పదమైనప్పటికీ, ఎప్పుడూ ఎదిరించవద్దు, అతను ఆజ్ఞాపించిన వాటికి మినహాయింపు ఇవ్వకండి అతను చెప్పేది వినండి, అన్ని విషయాలలో మీ రథసారథిగా అతని మాటకు పూర్తిగా కట్టుబడి ఉండండి, సరిగ్గా మా ఫాదర్ ఇగ్నేషియస్ ఆజ్ఞాపించిన

అడుగుజాడల్లో ప్రయాణించండి.ఎలాంటి ప్రలోభాలకు లోనైనప్పటికీ, వాటిని వెంటనే మీ పై అధికారికి గొప్పగా చెప్పండి, లొంగిపోకుండా ఉండటానికి వేరే మార్గం లేదని చాలా ఖచ్చితంగా చెప్పండి. వాళ్ల హృదయం యొక్క రహస్య కదలికలను ఒప్పుకోవడంలో ఈ నిష్కపటతతో అనుబంధించబడిన ఆత్మకు మరొక గొప్ప లాభం ఉంది. ఎందుకంటే దాని ద్వారా మనం దేవుని గొప్ప అనుగ్రహాన్ని పొందుతాము, ఇది ఒక విధమైన దయను దానితో పాటు గొప్ప ఆధ్యాత్మిక ప్రతిఫలం తెచ్చిపెడుతుంది.

## 1.2. ఫ్రాన్సిస్ జేవియర్ సుమాతృక లక్షణాలు

ఫ్రాన్సిస్ జేవియర్ వ్యక్తిత్వం మూడు సుమాతృక లక్షణాలతో ముడిపడి ఉంది. అతను ఇతరులతో, తనతో ఎలా సంబంధం కలిగి ఉన్నారు. జేవియర్ ఒక ఆకర్షణీయమైన వ్యక్తి. అతని "చురుకైన, దృఢమైన వ్యక్తిత్వం", "ఆశ్చర్యపరిచే", "నిర్ణయాత్మక", "ఉల్లాసంగా", "చురుకుదనం", "ఆచరణాత్మ", "వివేకం", తీవ్రమైన, ప్రతిష్టాత్మకమైన వ్యక్తిగా వర్ణించబడ్డారు.

నేడు, ఫ్రాన్సిస్ గారు "ప్రజల వ్యక్తిగా" వర్ణించబడతారు. వివిధ సామాజిక తరగతులు, జాతులకు చెందిన వ్యక్తులతో కలుపుగోలు సామర్థ్యంతో అతను విజయం సాధించారు. జేవియర్ ప్రజలను అర్థం చేసుకున్నారు. అతను వారి భాషలు నేర్చుకున్నారు, వారి దుస్తులను స్వీకరించారు. జేవియర్ గారు వారి వారి ఆచారా సంస్కృతులు, ప్రజలు, ప్రదేశాలు, వస్తువులలో దేవుని ఉనికి ఉందన్న లోతైన భావాన్ని ప్రశంసించారు. జేవియర్ ఖచ్చితంగా అనువైన లేదా నిష్క్రియాత్మకమైన వ్యక్తి కాదు. అతను నిర్ణయాత్మక వ్యక్తిత్వం, స్వభావాన్ని కలిగి ఉన్నారు. అందువలన, జేవియర్ సాంస్కృతిక బహుళ అనుభవం అంతిమంగా ఉల్లాసంగా ఉంది. కాని, ప్రారంభంలో నిరాశపరిచిన, గందరగోళంగా, సవాలుగా మారింది. క్రీస్తు ప్రపంచాన్ని ఏకం చేయడానికి ప్రయత్నిస్తున్నప్పుడు, జేవియర్ తేడాల లోతుని పరిధిని కనుగొన్నారు. ఆ తేడాలలోనే దేవుడు ప్రత్యక్షమయ్యాడని తెలుసుకున్నారు. మొదట విభేదాలు అతని లక్ష్యానికి అడ్డంకులుగా భావించబడ్డాయి. తరువాత, అతను భాషలు, విశ్వాసాలు, సంస్కృతులు, జీవన పరిస్థితుల యొక్క వైవిధ్యం సౌందర్యాన్ని

కనుగొన్నారు. అతను దేవుని పనిని అనుభవించడం ఎలా అని తెలుసుకోవడం ప్రారంభించారు. మాజీ మతాధికారి పీటర్ హాన్స్ కోల్వెనబాచ్, "క్రీస్తు ప్రత్యేక పరిచయం ద్వారా హృదయాన్నితాకినప్పుడు, మనస్సు మార్చుడానికి సవాలు చేయవచ్చును". ఫ్రాన్సిస్ జేవియర్ ఈ మూడు లక్షణాలు అతని సహచరుడు వ్రాసిన వర్ణనలో ప్రతిబింబిస్తాయి: ఫ్రాన్సిస్ ఎక్కువ విశ్వాసంతో నిండిన, అన్నిటిని స్వీకరించే తన గొప్ప మనస్సు, ఉత్సాహాన్ని ఎన్నడూ కోల్పోలేదు. అతను మంచి చెడు రెండింటితో మాట్లాడతారు. అతను ప్రతి ఒక్కరినీ ప్రేమిస్తున్నందున, ఏదైనా చేయమని అడిగితే, దానిని ఇష్టపూర్వకంగా చేస్తారు. అలాగే మరికొన్ని, ఫ్రాన్సిస్ జేవియర్ జీవితంలోని సుగుణాలను తెలుసుకుందాము.

## 2.2.1. అత్యుత్సాహం

ఫ్రాన్సిస్ తన ఆధ్యాత్మిక జీవితపు పనిని ఎంతో ఉత్సాహంతో నిర్వహించేవారు. ఉదాహరణకు, ఇగ్నేషియస్ వారు ఫ్రాన్సిస్ ను తూర్పు దూరప్రాంతాలుకు ఒక సాహసయాత్రలో చేరమని అడిగినప్పుడు అతను అత్యుత్సాహంతో అంగీకరించారు. అతను సంతోషకరమైన, ప్రశాంతమైన ముఖంతో ప్రయాణించారు. అతను వెళ్లిన ప్రతిచోటా తన చిరునవ్వుతో వెళ్లారు. అతను ప్రేషితకార్యంపట్ల చాలా ఉత్సాహం, మద్దతు, ప్రార్థనల నుండి తన సేవను వీక్షించిన అందరూ విశ్వసించారు. అతను దేవుని సేవిస్తూ, ఇతరులకు సహాయం చేసేవారు. దేవుణ్ణి కనుగొనడంలో ఇతరులకు సహాయం చేయడం ద్వారా అతను సహాయం అందుకున్నారు. అతని సువార్త పరిచర్య జీవితం సులభం కాదని గుర్తించినప్పుడు జేవియర్ ఉత్సాహంతో అనుమతించారు. పదిహేడవ శతాబ్దపు సముద్ర ప్రయాణాలు ప్రాణాంతక ప్రమాదాలతో నిండి ఉన్నాయి. అంతేకాకుండా, జేవియర్ యూనివర్సిటీ చదువు పూర్తి చేసే సమయానికి, అతని తల్లిదండ్రులు, ఒక సోదరి మరణించారు. అతని సోదరి, సోదరులు వివాహం చేసుకున్నారు. అతను 'అనాథ' వలె ఒంటరిగా భావించారు. అతని జీవితంలో ఎక్కువ భాగం ఒంటరితనం, నిరాశ, సూన్యత దీర్ఘకాలిక భావాలతో పోరాడారు. దేవునిపై అతనికి ఉన్న అపరిమిత విశ్వాసం

వల్ల,అడ్డంకులు, ఎదురుదెబ్బల నేపథ్యంలో నిరుత్సాహానికి గురికాకుండా అతన్ని విడిపించింది. అతను, దేవుని మహిమ కోసం ఉత్సాహంతో తన జీవితాన్ని గడిపారు. అతను ప్రయాణం తర్వాత తన సురక్షిత రాక గురించి తోటి యేసుసభ గురువులకు ఇలా వ్రాశారు, “ఈ జీవితంలో, ప్రమాదాల మధ్యలో జీవించడం మనకు గొప్ప అనుభూతిని ఇస్తుంది. అంటే, మనం వాటిని దేవుని ప్రేమ కోసం మాత్రమే అని భావించాలి”.

## 2.2.2. త్యాగాలు

ఫ్రాన్సిస్ అసాధారణమైన వ్యక్తిగత త్యాగం చేసే వ్యక్తి. అతని తలదిండు, రాయి ముక్క, అతని ఆస్తులు సిలువ, ప్రార్థన పుస్తకం. అతను విశ్రాంతి లేకుండా ప్రార్థనలో గంటలపాటు గడిపారు. అతను తపస్సు చేస్తూ, “నా ప్రభువా! మీరు నాకు ఎక్కువ శ్రమలు పంపితే తప్ప ఈ బాధలను దూరం చేయకు” అని ప్రార్థించారు. అతని మరణానికి ముందే, ఒక త్యాగమూర్తిగా పరిగణింపబడ్డాడు.

## 2.2.3. విధేయత

యేసుసభ మతాధికారి ఇన్యాసి గారి నుండి భారతదేశంలో సువార్త ప్రచారానికి తనకు అనుచరులను పంపమని కోరారు. దానికి ఫ్రాన్సిస్ జేవియర్ కట్టుబడి ఉన్నారు. దేవునికి, శ్రీసభ జగద్గురువుకి విధేయత చూపడం ఎల్లప్పుడూ పవిత్రతకు నిజమైన సంకేతం, దీని ద్వారా దేవుడు సమృద్ధిగా కృపలను అందిస్తాడు. “ప్రభువా, నా చిత్తం కాదు, నీ చిత్తమే జరగాలి!”. అని యేసుప్రభువు తండ్రి దేవునికి విధేయత చూపినట్లు ఫ్రాన్సిస్ గారు తన పాలనాధికారికి విధేయత చూపించారు. యేసు ప్రభువు తల్లిదండ్రులకు విధేయించారు. అధికారులకు విధేయించారు. ఆయన విధేయతతో ప్రజల మనస్సులు గెలిచారు. కనుక ప్రతి గురువు తన విధేయతను క్రీస్తు విధేయతతో పోల్చుకొని చూచుకోవాలి. విమర్శించు కోవడానికి తావివ్వకూడదు. మన విధేయతతో దేవుని ప్రేమను వ్యక్తపరచాలి. మన జీవితం పవిత్రంగ సాగడానికి సరియైన వాతావరణం కల్పిస్తుంది విధేయత. ఆధ్యాత్మిక నాయకత్వ బాధ్యతలను కొనసాగించడానికి విధేయత అత్యవసరము.

## 2.2.4. పేదరికంపై ప్రేమ

ఫ్రాన్సిస్ భారతదేశానికి వచ్చిన తర్వాత, దేశంలోని పేదల పట్ల ప్రేమతో పొంగిపోయారు. అతని ప్రేమకు అవధులు లేవు. సౌకర్యవంతమైన బస, సౌలభ్యం కోసం కాకుండా, జేవియర్ పేదలతో జీవించాలని, పేదవారిలా నిద్రపోవాలని, పేదలతో తిని త్రాగాలని నిర్ణయించుకున్నారు. మొదటి యేసుప్రభువు దీవెన నాహృదయ వైఖరిని ఉదహరిస్తుంది: "ఆత్మలో పేదవారు ధన్యులు, ఎందుకంటే వారిదే పరలోక రాజ్యం". (మత్తయి 5:3) ఈ వాక్యానుసారంగా జీవించిన వ్యక్తే జేవియర్.

## 2.2.5. చిన్నారులపట్ల దేవుని ప్రేమ

యేసుప్రభువు చిన్నారులపట్ల ప్రేమను చూపించారు. "పిల్లలను నా దగ్గరకు రానివ్వండి, ఎందుకంటే పరలోక రాజ్యం వారిదే (మత్తయి 18:3). ఫ్రాన్సిస్ జేవియర్ పిల్లలను ప్రేమించారు, వారు అతనిని ప్రేమించారు". అతను వారికి సత్యోపదేశము, అలాగే వారికి ప్రార్థనలను బోధించారు. పిల్లలకు అతనిపై ఉన్న ప్రేమ ఎంతంటే, అతనికి ప్రార్థనలు చేయడానికి లేదా తినడానికి కూడా సమయం లేదు. ఈ విధంగా క్రీస్తు ప్రేమను పిల్లల మీద వ్యక్తపరిచారు.

## 2.2.6. అపోస్తలిక సృజనాత్మకత

ఫ్రాన్సిస్ జేవియర్ ఒక మేధావి, ఉపాధ్యాయుడిగా, మిషనరీగా జీవించారు. ఫ్రాన్సిస్ సత్యోపదేశము కంఠస్థం కోసం ఒక పాటను ఉపయోగించారు. సరళమైన పద్య ప్రాసలో, పిల్లలకు సత్యోపదేశము యొక్క ప్రాథమికాలను బోధించారు. అప్పుడు పిల్లలు ఇంటికి తిరిగి వెళ్ళి సత్యోపదేశము వారి స్వంత తల్లిదండ్రులకు భోదించేవారు. "రెండవ జాన్ పాల్‌పాపుగారు, క్రీస్తు అనుచరులను పవిత్రఆత్మతో పాటు అపోస్తలిక సృజనాత్మకతకు తెరవాలని ఉద్భోధించారు. యేసు నీకొదెముతో "తను కోరుకున్న చోట ఆత్మ ఉంటుంది". జేవియర్ లాగా, మనం పరిశుద్ధాత్మ వైపు ప్రయాణం చేద్దాము, ఆయన కోరుకున్న చోట నడుద్దాము, ఇది జ్ఞానస్నానంతో మొదలవుతుంది. ఫ్రాన్సిస్ జేవియర్ సూచనల తర్వాత, వేలాది మందికి జ్ఞానస్నానం ఇచ్చారు. ఈ విధంగా తన అపోస్తలిక సృజనాత్మకతను అవలంబించారు.

ప్రార్ధనా జీవితంలో గాఢతను పెంచుకొంటూ వ్యక్తిగత విశ్వాసపు పద్ధతలను గౌరవంతో ప్రోత్సహించుకొంటూ ప్రతిఒక్కరి విలువను ఇనుమడింపజేస్తు, మీ ఆధ్యాత్మిక మార్గచూపరుల లేక శ్రీసభ ఉమ్మడి బాధ్యతలను నేర్పించగల బాధ్యతాయుత వ్యక్తుల మార్గదర్శకాలను తీసుకొనండి. మీ జీవితాలు సువార్తకు అనుగుణమైన పారదర్శకతను కలిగి, క్రీస్తును సందర్శించుట ద్వారా ఉద్దీపనపొంది, భయం లేని ప్రేమతో అతనిని అనుసరించండి.

## 2.2.7. రుగ్మతలు ఆదేశించడం

ఫ్రాన్సిస్ జేవియర్ గొప్ప గురువుగా తన సమయాన్ని ఒకే చోట ముగించిన తర్వాత, సమాజంలో ప్రజలను ఏర్పరుచుకునే లక్ష్యంతో ముందుకు సాగడానికి చక్కగా విచారణ ఏర్పడిన తర్వాత సంఘ పెద్దలకు అప్పగించేవారు. ఇప్పుడు, మునుపెన్నడూ లేనంతగా, ఉత్సాహభరితమైన గురువులకు సువార్త ప్రకటించే పనిని కొనసాగించడంలో సహాయం చేయడానికి ఉత్సాహవంతులైన గురువులు అవసరం."పంట సమృద్ధిగా ఉంది, కానీ పనివారు చాలా తక్కువ". ఈ విధంగా తన రుగ్మతను వ్యక్తపరిచారు.

## 2.2.8. సంస్కృతి

ఫ్రాన్సిస్ జేవియర్ జపానుకు ప్రయాణిస్తున్నప్పుడు, ఆ దేశం యొక్క సామాజిక ఆచారాలు నేర్చుకోవాల్సి వచ్చింది. ఈ సందర్భంలో, ఎవరైనా దుస్తులు ధరించి ఉండటం చూసి చక్రవర్తికి విరక్తి కలిగింది. పునీత పౌలు గారు చెప్పినట్లుగా, "సాధ్యమైనంత మందిని క్రీస్తుకొరకు గెలుచుకోవడానికి నేను అందరికి అన్నీ అవుతాను". జేవియర్ చాలా సొగసైన దుస్తులను ధరించి, చక్రవర్తికి బహుమతులు ఇచ్చారు. తద్వారా చక్రవర్తి స్నేహాన్ని గెలుచుకున్నారు. ఫ్రాన్సిస్ జేవియర్ వారి సంస్కృతులు, ఆచారాలు, సంప్రదాయాలు, ఆచరించడం వలన సువార్త సందేశానికి తలుపులు తెరవబడ్డాయి.

## 2.2.9. ప్రార్థన-తపస్సు

ప్రార్థన, తపస్సు రెండిటిని తీవ్రంగా పరిగణించని సాధువును కనుగొనడం అసాధ్యం. తను అలసిపోయినప్పటికి రోజు ఫ్రాన్సిస్ జేవియర్ పరిశుద్ధ

దివ్యమందసం ముందు గంటల తరబడి గడిపేవారు. భగవంతుడిని స్తుతిస్తూ, ప్రభువుకు కృతజ్ఞతలు తెలుపుతూ, దేవుడు తన మార్గంలో ఉంచిన, ప్రజల పవిత్రీకరణ, మోక్షం కోసం వేడుకున్నారు. "ఆత్మల రక్షణ నిమిత్తం నేను ఇంకా అధికంగా శ్రమలు బాధలు అనుభవించేందుకు సిద్ధంగా ఉన్నాను ప్రభువా" అని ఫ్రాన్సిస్ పదే పదే ప్రార్థించేవాడు. ఫ్రాన్సిస్ జేవియర్ ప్రార్థన సమయంలో తగినంత ఓదార్పును ఒసగమని భగవంతుడిని వేడుకునేవారు. దానికి ఒక మార్గం: అతను చాలా తక్కువ నిద్రపోయారు, తద్వారా ప్రభువుతో పాటు ఆత్మల రక్షణకు తననుతాను బలిపశువుగా సమర్పించుకున్నారు.

ఫ్రాన్సిస్ యొక్క మొదటి లక్ష్యం, స్థిరనివాసులకు సువార్త ప్రకటించడం, క్రీస్తు కోసం భారతదేశాన్ని గెలవాలనే ఆశను కలిగి వారికి జ్ఞానస్నానం అలాగే విశ్వాసంతో జీవించమని ప్రోత్సహించారు. గురు విద్యార్థులతో కలిసి దేవాలయాలు, ప్రాథమిక పాఠశాలలు స్థాపించి, కొన్ని సంవత్సరాలు పనిచేసిన తర్వాత, ఫ్రాన్సిస్ తన ఆసియా ప్రయాణాలలో తన విచారణలలో మరికొన్ని చిన్న క్రైస్తవ సంఘాలను ప్రారంభించారు. ఆధునిక శ్రీలంక దీవుల సమీపంలోని ప్రజలు జీవించినట్లుగా, ఫ్రాన్సిస్ వారు కటిక నేలమీద పడుకునేవారు. వారిలాగే ఆహారం భుజించటం, నీళ్లు తాగేవారు. వారికి ప్రార్థనలను గుర్తుంచుకోవడం సులభం చేశారు. అతను వినయపూర్వకమైన ప్రజలకు తండ్రి అయ్యాడు.

## 2.3. జేవియర్ విజయ రహస్యలు

జేవియర్ ఎప్పుడూ దైవకార్యంలో నిమగ్నమై ఉండేవారు. క్రమశిక్షణతో కూడిన అతని జీవితం కేవలం వీరోచితమైనది. అతను తన ప్రజల కోసం, వారి సంక్షేమం కోసం తన జీవితాన్ని పూర్తిగా ఇవ్వడానికి సిద్ధంగా ఉండేవారు. ఆయన, అందరి పవిత్ర హృదయాలను, ముఖ్యంగా పిల్లల హృదయాలను ఆకర్షించి తద్వారా వారి భాషలలో తగినంత జ్ఞానం లేకపోవడం, రవాణా, వేగవంతమైన సమాచారము లేకపోవడం వంటి వైకల్యాలు ఉన్నప్పటికీ, అతను ప్రేషిత కార్యంలో చాలా విజయవంతమయ్యారు. క్రమంగా ప్రతి చిన్న గ్రామంలో చర్చిలు, పిల్లల కోసం పాఠశాలలు కూడా నిర్వహించబడ్డాయి. ఫాదర్ జేవియర్ నిరంతరం నిరక్షరాస్యులకు బోధించే కొత్త సులభమైన పద్ధతులను అభివృద్ధి

చేస్తూనే ఉన్నారు. తద్వారా విశ్వాస ప్రార్థనలు, సిద్ధాంతాలు, అలాగే శ్రీసభ ఆజ్ఞలు వారి మనస్సులలో, హృదయాలలో స్థిరంగా ఉండేలా చూసుకునేవారు. తద్వార ప్రజలు నెమ్మదిగా క్రైస్తవ ధర్మాలను ఆచరించడానికి అవి దోహదపడేవి.

## 2.3.1. అపోస్తలిక ఉత్సాహం

ఫ్రాన్సిస్ జేవియర్ ఇష్టమైన ప్రార్థన. "నాకు ఆత్మలను ఇవ్వండి!" అనే ఈ విధమైన నినాదాన్ని కలిగి ఉన్న మరొక గురువు జాన్ బోస్కో, "నాకు ఆత్మలను ఇవ్వండి మిగిలినవన్నీ తీసివేయండి". నిజమే, మనం నిజంగా దేవుణ్ణి ప్రేమిస్తే, దేవుడు ప్రేమించే దానిని మనం ప్రేమించాలి. ఫ్రాన్సిస్ జేవియర్, ఇగ్నేషియసుకు వ్రాసిన ఒక లేఖలో ఎక్కువ మంది పనివారు పంటలో గుమిగూడాలని ఉద్వేగభరితమైన విజ్ఞప్తిని చేశారు. ప్రత్యేకంగా విశ్వవిద్యాలయాలలో నావలె గర్వించే విద్యార్థులను చక్కదిద్దాలి. జేవియర్ మాటలు అపోస్తలిక ఉత్సాహంతో, ఇక్కడ ఉన్న చాలా మంది ప్రజలు ఒక కారణం చేత క్రైస్తవులుగా మారడం లేదు. వారిని క్రైస్తవులుగా చేయడానికి ఎవరూ లేరు. వారికి అప్పగించిన ప్రతిభకు సంబంధించి వారు దేవునితో పరిష్కరించుకోవాలని నేను కోరుకుంటున్నాను. శ్రీసభ అపోస్తలిక ఉద్దేశ్యాన్ని పరిపూర్తిగా గ్రహించి, విశేషానుగ్రహంతో పరిపూర్ణ ఆకర్షణతో జీవింపుడు. విశ్వశ్రీసభ–స్థానిక శ్రీసభల మధ్య ఫలవంతమైన సమతుల్యతను కలిగి ఉండండి. అలానే, పేతురుని వారసునితో (జగద్గురువుతో) ఆత్మనందు సన్నిహిత బంధం కలిగుండండి. అదే విధంగా, మీస్వంత కాపరులతో చురుకైన సహబాధ్యతను పంచుకొనండి. నేటి పరిణామదశ చరిత్రలో శ్రీసభ సాంఘిక అధ్యాపనాధికారపు వెలుగులో ఎక్కువగా ప్రాపంచీ కరణ వరవడిలో ప్రేమ–సేవలను చేయ ప్రయత్నిస్తుంది. సంపూర్ణ శ్రీసభతో ఎదుగుటకును, ఉమ్మడి బాధ్యతలో మానవాళికి భవితపై నమ్మకంను అందించుటకును, వత్తిడిగల ప్రతి పాదనలకు ధైర్యంతో తగిన సూత్రాలను ఏర్పరచుకొనుటకు దోహదపడుతుంది.

### 2.3.2. వారసత్వం

కతోలిక శ్రీసభలో చాలా మంది, ఆసియాకు క్రైస్తవ విశ్వాసాన్ని తీసుకువచ్చిన ఫ్రాన్సిస్ను పునీతులుగా భావిస్తారు. సాధారణంగా ఫ్రాన్సిస్ జేవియర్ను, "తూర్పు దేశ పాలక పునీతులుగా", ఇప్పటికీ ప్రపంచవ్యాప్తంగా ఉన్న క్రైస్తవులచే, అతని సువార్తను, యేసుక్రీస్తు ప్రతినిధిగా భావించి, గౌరవించబడుతున్నారు. భారతదేశంలోని అసంఖ్యాక ఆసుపత్రులు, పాఠశాలలు, ఇతర సంస్థలను అతని పేరుమీద నామకరణం చేశారు. అతను యేసుసభ ప్రేషిత పద్ధతులను అభివృద్ధి చేశారు. అతని ప్రయత్నాలు భారతదేశం యొక్క సువార్త ప్రేషిత చరిత్రపై తూర్పుదూర ప్రాంతాలకు మొదటి యేసుసభ సువార్తికులలో ఒకరిగా గణనీయమైన ముద్రను మిగిల్చాయి. చైనా, జపాన్లలో క్రైస్తవ మతం ప్రచారానికి అతని సేవ ప్రాథమిక ప్రాముఖ్యత కలిగి ఉంది. అదేవిధంగా ప్రతి గురువు ఫ్రాన్సిస్ వలె అపోస్తలిక సుగుణాలు అలవర్చుకొని, క్రీస్తు గురించి తెలియని వారికి సువార్త బోధన చేయడానికి సాహసం చేయాలి. ఆయన వారసత్వంలో నడవడానికి ప్రతి గురువు ప్రయత్నించాలి.

### 2.3.3. భాషల వరం

ఫ్రాన్సిస్ జేవియరుకు ఆపాదించబడిన అద్భుతాలలో, ప్రసిద్ధ భాషల బహుమతి ప్రత్యేకంగా ప్రశ్నార్థకం చేయబడింది. ఫ్రాన్సిస్ లేఖలలో, "జేవియర్ వెళ్ళిన వివిధ తెగల భాషలతో తన కష్టాలను, ఇబ్బందులను నిరంతరం ఎలా అధిగమించాడు: కొన్నిసార్లు అనువదించడానికి తగినంత భాష నేర్చుకోవడం ద్వారా, కొన్ని శ్రీసభ ప్రధాన సూత్రాలు, కొన్నిసార్లు ఇతరుల సహాయాన్ని పొందడం ద్వారా, కొన్ని పవిత్రమైన బోధనల ద్వారా నేర్చుకోవాలి. కొన్నిసార్లు వ్యాఖ్యాతలను ఉపయోగించడం ద్వారా, కొన్నిసార్లు వివిధ మాండలికాల మిశ్రమం సంకేతాల ద్వారా కూడా. "చరిత్ర పురాణం కోసం, రోమ్ కాననైజేషన్ ప్రక్రియలో, అప్పుడు చేసిన ప్రసంగాలలో, చివరకు శ్రీసభలేఖలో, శౌరివారికి భాషల వరం ఉందని చాలా ఒత్తిడి చేయబడింది". అపోస్తలిక లేఖల ప్రారంభంలో ఫ్రాన్సిస్ భాషల వరం కలిగి ఉన్నాడని, అపోస్తలుల విషయంలో

ఏమి జరిగిందో, వారికి భాషల వరం దైవికంగా ప్రసాదించబడింది. వారు క్రీస్తు చేత పిలువబడిన వెంటనే కాదు, పరిశుద్ధాత్మ సంతతికి చెందిన తర్వాత మాత్రమే, అని తెలియజేయడం జరిగింది.

## 2.3.4. అద్భుతాలు

ఫ్రాన్సిస్ శౌరివారికి, అద్భుతాలు చేసే వరము ఉండేది. ఒకసారి మరణావస్థలో ఉన్న స్త్రీ వద్దకు ఫ్రాన్సిస్‌ను పిలుచుకు వెళ్ళారు. "పరలోకమును భూలోకమును సృష్టించిన సర్వశక్తిగల సర్వేశ్వరుని విశ్వసించుచున్నాను" అనే ప్రార్థనను ఫ్రాన్సిస్ గారు వినిపించగానే ఆమె స్వస్తత పొందింది. ఒకసారి ఒక పసిబిడ్డ బావిలో పడి మునిగిపోయాడు. ఆ తల్లి ఏడుస్తూ ఫ్రాన్సిస్ గారి శరణుజొచ్చింది. ఫ్రాన్సిస్ గారు ఆ బిడ్డను ఆశీర్వదించి ప్రార్థించగానే ఆ బిడ్డకు ప్రాణం వచ్చింది. అలాగే ఒక సారి ఫ్రాన్సిస్ పడవ పై వెళ్లేటప్పుడు పెద్ద తుఫాను చెలరేగింది. ఫ్రాన్సిస్ సిలువ స్వరూపాన్ని చేత పట్టుకుని సముద్రపు నీటిలో ముంచి తమను ప్రమాదం నుండి రక్షించమని ప్రార్థించాడు. అలలతాకిడికి చేతిలో స్వరూపము జారి సముద్రంలో పడిపోయింది. తన సిలువ స్వరూపం సముద్రంలో పోవటంతో ఫ్రాన్సిస్ ఎంతో బాధపడ్డాడు. ఆ మరుసటి రోజు అతను తీరం వెంబడి నడచి వెళ్తుండగా, ఒక పీత తన కొండ్లతో సిలువను పట్టుకుని సముద్రం నుండి వెలుపలికి వచ్చి, ఫ్రాన్సిస్‌గారికి దానిని అందించింది. ఆ ప్రాంతంలోఎవరికి తేలుకుట్టినా, పాముకరచినా, పులి గాయపరచినా, వారు ఫ్రాన్సిస్‌గారిని పిలిచేవారు. ఒకవేళ ఆయనకు అక్కడికి వెళ్లేందుకు వీలుకుదరనట్లయితే, తన సిలువ స్వరూపాన్ని గానీ, జపమాలను గానీ వారికి ఇచ్చి పంపించే వాడు. దానిని బాధితులకు తాకించ గానే వారు స్వస్థత పొందేవారు.

## 3.4. గురువిద్యార్థులకు ఒక మార్గచూపరి

ఫ్రాన్సిస్ ఒక మిషనరీ, తనకంటు ఏమి లేదు అన్న ఒక ప్రత్యేకమైన ఉదాహరణను ఇచ్చారు. అతను 19 సంవత్సరాల వయస్సులో విద్యార్థిగా తన రాజకుటుంబాన్ని విడిచిపెట్టాడు. అప్పటి నుండి తన స్వదేశానికి తిరిగి రాలేదు. అతను వేలాది మందిని క్రీస్తువైపుకు మార్చారు. అతను అనేక మంది

గురువుల సహవాసంలో ఉన్నారు. కానీ మరణం యొక్క భయంకరమైన క్షణంలో అతనికి అభిషేకం చేయడానికి కూడా ఏదైనా మతాధికారుల సహాయం ఉందా? అంటే, దైవ పిలుపు దేవుడిచ్చిన ఒక గొప్ప వరం. ఆ పిలుపుకు మనము అనుగుణంగా జీవించాలి. ప్రతి గురువిద్యార్థి, గురువులు, పీఠాధిపతులు, మఠకన్యలు, క్రీస్తును అనుసరించే ప్రతి ఒక్కరూ దైవ రాజ్యం నిమిత్తమై పని చేయాలి. ఫ్రాన్సిస్ జేవియర్ గారు తన యేసుసభ ముఖ్య ఉద్దేశం, "సర్వం సర్వేశ్వరుని సర్వోన్నతికే" అనే నినాదంతో సువార్త ప్రయాణం కొనసాగించారు. మనం కూడా అటువంటి గొప్ప సుగుణాన్ని కలిగి ఉండాలి. క్రీస్తు ప్రభువు పలికినట్లు "మీరు నన్ను అనుసరించండి మిమ్మల్ని మనుషులు పట్టు వారిగా చేస్తాను", అన్న ఒక్క మాటతో వాళ్లు సమస్తాన్ని వదిలివేసి క్రీస్తు ప్రభువును అనుసరించారు. యేసు పలికినట్లు, "నక్కలకు బొరియలును, ఆకాశ పక్షులకు గూళ్లును కలవు, మనుష్యకుమారునకు మాత్రము తలవాల్చుటకైన చోటు లేదు" అని ప్రత్యుత్తర మిచ్చెను. ఫ్రాన్సిస్ జేవియర్ గారు భారతదేశంలో సువార్త బీజాలు వెదజల్లారు. క్రీస్తును తెలియని వారికి పరిచయం చేశారు. క్రీస్తు నిజమైన దేవుడని అన్యులకు బోధించాడు.

కానీ ప్రస్తుత సమాజంలో గురు విద్యార్థులు, మఠకన్యలు, గురువులు, పీఠాధిపతులు ఈ లోక వ్యామోహాలకు, వస్తువుల పైన, పేరు ప్రతిష్టల కోసం పాకులాడుతూ జీవిస్తున్నారు. దైవ వాక్కును మరిచారు. మనము అందరము, క్రీస్తు ప్రభువు అంటే తెలియనివారికి తెలియపరచాలి. ఒక ఆదర్శ వ్యక్తులుగా జీవించాలి. ఏ విధంగా అయితే ఫ్రాన్సిస్ జేవియర్ సమస్తము వదిలి క్రీస్తును నమ్మి ఆయన మార్గంలో ప్రయాణించారో, మనం కూడా ఆయన అడుగుజాడల్లో నడుద్దాము, మంచి సువార్తికులుగా నూరంతలు, అరువదంతలు, ముప్పదంతలుగను ఫలించుదాము.

## 3.5. అపొస్తలుడైన థామస్ అడుగుజాడల్లో

దాదాపు పదేళ్ల స్వల్ప వ్యవధిలో, అంటే 6 మే 1542 నుండి 2 డిసెంబర్ 1552 వరకు, ఫాదర్ జేవియర్ అనేక దేశాలను సందర్శించారు, అనేక దేశాలలో సువార్త ప్రకటించి వేలాది మందిని క్రైస్తవ విశ్వాసం వైపు ఆకర్షించగలిగారు.

ప్రభువు యొక్క ద్రాక్ష తోటలోని ఈ అధిక అర్హత కలిగిన పనివారు, ప్రేషిత కార్యంలో చాలా ఉన్నత స్థాయి సద్గుణాలను కలిగి ఉన్నారు. అంటే, దేవుని పట్ల అచంచలమైన ప్రేమ, ఆయన మహిమ పట్ల ఉత్సాహం, పేదల పట్ల సానుభూతి బలమైనది అని చెప్పవచ్చును. ఒకరు స్వంత వ్యక్తిగత అవసరాలను మరచి తోటి వారి కోసం శ్రమిస్తారట, అటువంటి వారిలో శౌరి వారు ఒకరు, అందుకే భారతదేశం థామస్ వారి తరువాత ఆయనను రెండవ అపోస్తలుడుగా పరిగణిస్తుంది. కతోలిక పనిపాటులతో మీకున్న సహవాసం క్రీస్తుకు, సువార్తకు ధైర్యంతో కూడిన మీ సాక్ష్యాలకున్న ఫలవంతమైన సుదీర్ఘ చరిత్రను గొప్పగా చెబుతుంది. అటువంటి వారిలో కొందరిని ధన్యులు గాను, పునీతులు గాను శ్రీసభ గుర్తిస్తుంది. వారి అడుగు జాడలలో, పవిత్ర పథమందు అంకిత భావంతో నడచుటకు మీరు అందరు పిలువబడ్డారు.

## ముగింపు

పునీత ఫ్రాన్సిస్ శౌరి గారు ప్రార్థనా జీవితంలో గాఢతను పెంచుకొంటూ వ్యక్తిగత విశ్వాసపు పద్ధతలను గౌరవంతో ప్రోత్సహించుకొంటూ, ప్రతి ఒక్కరి విలువను ఇనుమడింపజేస్తు మీ ఆధ్యాత్మిక మార్గచూపరుల లేక శ్రీసభ ఉమ్మడి బాధ్యతలను నేర్పించగల బాధ్యతాయుత వ్యక్తుల మార్గదర్శకాలను తీసుకొనండి. మన జీవితాలలో సంపూర్ణత కలిగి జీవించడానికి, దేవునితో సఖ్యత కలిగి జీవించాడానికి పునీత ఫ్రాన్సిస్ శౌరిగారి ఈ సువార్త ప్రయాణం ఎంతగానో ఉపయోగపడుతుంది. కావున, అతను మనకు నేర్పించిన వినయము, తగ్గింపుతనము, దేవునిపై నమ్మకము, ప్రేమను ఆచరించుట, పరిత్యజించుకొనుట, త్యాగంచేయుట, దేవుని చిత్తానికి మనల్ని అర్పించుకొనుట, బాధలను అనుభవించుట, నిరాడంబరత కలిగి జీవించుట, అనే ఈ సువార్త విలువలు మన జీవితాలలో పాటించుదాం, దేవుని చెంతకు చేరుదాం.

## ముగింపు

"మీరు వెళ్లి, సకల జాతి జనులకు" పిత, పుత్ర, పవిత్రాత్మ నామమున జ్ఞానస్నానంమొసగుచు, వారిని నా శిష్యులను చేయుడు". అను ప్రభు యేసు అంతిమ సందేశాన్ని అనుసరించి పునీత ఫ్రాన్సిస్ శౌరి గారు మన భారతదేశం

ఏ తెంచి, మనకు క్రీస్తు ప్రభువుని బోధలను అందించి, దైవరాజ్య విలువలతో, మంచి విశ్వాసముతో నిండిన భారత శ్రీసభను స్థాపించారు. వారి అడుగు జాడలలో ఎందరో విదేశీ సువార్తా బోధకులు విచ్చేసి, శ్రీసభను సుస్థిరపరచారు. క్రమేణా స్థానిక భారతీయులే శ్రీసభ సంరక్షకులుగా, బోధకులుగా ఎదిగారు. ఎందరో పుణ్యశీలురు తమదైన విశిష్టశైలిలో యేసు ప్రభుని శిష్యరికం చేసి శ్రీసభ మనుగడకు, వ్యాప్తికి తమవంతు ప్రయత్నించి, భారతీయ కతోలిక శ్రీసభ చరిత్రలో ఆణిముత్యాలుగా చిరంజీవులై నిలిచారు. అట్టి వారిలో కొందరిని కతోలిక శ్రీసభ దైవ సేవకులు, ధన్యులు, పూజ్యులు, పునీతులుగా ప్రకటించి, క్రైస్తవులకు ఆదర్శంగా నిలిపింది. ఈ విధంగా ఫ్రాన్సిస్ ప్రభువుని సేవలో, సామాన్యులలో సామాన్యునిగా, రాజులలో రాజుగా ప్రవర్తించిన విషయం మనకు విస్మయం కలిగించక మానదు. శౌరివారిలో గల ఆ కార్యదీక్ష, పట్టుదలే అతనిని పునీతునిగా తీర్చిదిద్దింది.

నా ఉద్దేశ్యం ప్రకారం, నేటి తరానికి గురువు అనే వారు అన్ని రంగాలలో నైపుణ్యం కలిగి ఉండాలని. అనగా, దైవశాస్త్రంలో, తత్వశాస్త్రంలోను, సాంకేతిక పరిజ్ఞానంలో మంచి నైపుణ్యం పట్టు కలిగి ఉండాలి. మరి ముఖ్యంగా దైవవాక్కు బోధించడంలో నిండైన సంపూర్ణ జ్ఞానం కలిగి ఉండాలి. అట్లుకాకుండా, మిడిమిడి జ్ఞానంతో లేదా సరియైన లోకజ్ఞానం లేకపోతే ప్రజలు గురువును తక్కువగా లేదా చులకనగా చూస్తారు. కావున ఆధ్యాత్మిక గురువు అనే వారు నిండు కుండాల అన్నిటిలో ప్రథముడుగా సామాన్య ప్రజల సమస్యలకు సరియైన సలహాలు ఇచ్చేవారిగా పాత్ర వహించాలి. యాజక వర్గం క్రైస్తవులతో అన్యోన్యమైన సంబంధం, సోదర భావంతో మెలగాలి అలా ఉన్నప్పుడు సంఘాలలో ఎలాంటి రుగ్మతలు దరికి చేరవు. ప్రజలు గురువును చూచి ఈయన నిజముగా క్రీస్తు ప్రభువు, శిష్యుడుగా, వారసుడుగా, లేదా ప్రతినిధి అని విశ్వాసించాలి. దానికి తగిన విధంగా ప్రతి నిత్యం ప్రతిక్షణం దేవుని చిత్తాన్ని అనుసరిస్తూ జీవించాలి. అదే విధంగా, గురువు దైవ ప్రజల ఆధ్యాత్మిక అవసరాలను తీర్చే వ్యక్తిగా అందుబాటులో ఉండే మనసత్వం కలిగి ఉండాలి. గురువు సుఖ, దుఖాలను రెండింటిని స్వీకరించినప్పుడే యాజకత్వమునకు సంపూర్ణత వస్తుంది.

ఈ ఆధునిక ప్రపంచంలో సాంకేతిక పరిజ్ఞానరంగంలో సువార్త పరిచర్య చేయడం ఎంతో సవాలుతో కూడుకున్నది. ప్రజలు తమ తమ వృతులలో నిమగ్నమై పోతున్నారు. మరో ప్రక్క గురువులు, మఠకన్యలు, గురు విద్యార్థులు ప్రజల మధ్యకు వెళ్ళి దైవ వాక్కును బోధించడంలో విఫలమవుతున్నారు. ఆధ్యాత్మిక జీవితంలో బలహీన పడుతున్నారు. దీనికి కారణం ఈ లోక ఆశలకు, వ్యామోహాలకు, పేరు ప్రతిష్టలు, అధికారం, ధనాకాంక్ష, భోగ విలాసాల పై శ్రద్ధచూపుతున్నారు.

ప్రసుత్త ఫ్రాన్సిస్ పాపుగారు తల్లి శ్రీసభను ఒక ఉన్నత హెూదాలో వుంచడానికి ఆహర్నిశలు శ్రమిస్తూ, తమ లేఖల ద్వారా ప్రజలను, గురువులను చైతన్యంప జేస్తున్నారు. ఫ్రాన్సిస్‌గారి మాటల్లో, "మీ మంద యొక్క వాసన తెలుసుకోవాలి". అనగా ప్రతి గురువు కాపరి వలె తన మంద వద్దకు వెళ్ళాలి. వారిని శ్రీసభలో భాగస్వామి చేయండి, సమానహెూదా కల్పించండి. క్రైస్తవ విశ్వాసులు లేనిదే శ్రీసభ లేదు. ప్రతి పిఠాధిపతి, గురువు, మఠకన్యలు, గురువిద్యార్థులు సువార్త పరిచర్యలో దైవప్రజలతో కలసి నడవాలి, వారికి మనము ఆదర్శంగా, ప్రత్యేక వ్యక్తిగా కనిపించాలి. వారు మనలో దైవత్వం చూడాలి. పునీత శౌరివారి వలె గర్వం విడనాడి ఇహంతో జీవించాలి. ప్రతి ఒక్కరు క్రీస్తు ప్రతినిధిగా, అపోస్తలునిగా మెలగాలి, దేవుడు అందించే పవిత్ర ఫలాలను ప్రజలకు ఒసగేలా ఉండాలి. ఆధ్యాతిక వ్యక్తులుగా స్మరించే అంశం: పునీత పౌలుగారి మాటల్లో, "ఈ లోకాన్ని చెత్తగా భావిస్తాను. ఇక మీదట జీవించునది నేనుకాదు, క్రీస్తే నాలో జీవిస్తున్నారు". గురువు, ప్రతీ ఒక్కరితో వ్యక్తిగతమైన, స్వచ్ఛమైన సంబంధాన్ని కలుపుకొండి. మొదట కుటుంబంతో మొదలుపెట్టి, సాంఘిక, సంస్కృతిక, రాజకీయ స్థాయిలన్నిటిలోను సామాజిక మంచి కోసం సంసిద్ధతను తెలుపుతూ పాల్గొనండి. అనే సిద్ధాంతంతో సువార్తీ కరణ వేగవంతం చేయడానికి కృషిచేద్దాం, శ్రమిద్దాం.

# 3. క్రీస్తు ఉత్థాన మహిమ

- ఫాదర్ పసుపులేటి ఫ్రాన్సిస్



## 1. పండుగ ప్రాధాన్యత - పరమార్థం

మనం కొనియాడే క్రీస్తు పునరుత్థాన పండుగకన్నా గొప్పదైనది మరొకటి లేదు. సంవత్సరం పొడుగునా మనం అనేక పండుగలను కొనియాడు తుంటాం, అయినా అవేవి, క్రిస్మస్తోసహా, ఈ పండుగకు సాటిరావు. మానవ చరిత్రలో మహా శ్రేష్టమైన పండుగ ఈ పాస్కా మహోత్సవం. ఈ కారణం చేతనే ప్రతీ ఆదివారాన్ని పవిత్రంగాను, సంతోషకరంగాను దైవార్చన ఏర్పాటు చేసింది. క్రైస్తవ పండుగ లన్నింటిలోను పాస్కా పండుగ అతి ప్రాచీనమైంది. దీని ఆదారంగానే మోక్షారోహణం, పెంతెకోస్తు, ఆదివారాలు ఏర్పాటయినాయి. శ్రీసభ క్యాలండరుకు పాస్కాపండుగ సూర్యుని లాంటిది. ఆ వెలుగేమిటో చూద్దాం.

ఈ పాస్కాకాల ఉత్సాహంతో అపోస్తలుల కార్యాలను చదివినట్లయితే, అపోస్తలులు క్రీస్తు ఉత్థాన సంఘటనకు ఎంతలా హత్తుకుపోయారో మనకు చక్కగా అర్థమౌతుంది. అందుకుగల కారణాలు: 1. క్రీస్తుని బలియాగాన్ని తండ్రిదేవుడు బహిరంగంగా అంగీకరించినట్లు ఈ ఉత్థానం తెలుపుతుంది. ఆ విధంగా క్రీస్తుని రక్షణకార్యం పరిపుష్టమైనదని ప్రకటిస్తుంది. 2. ప్రభువు చేసిన అద్భుతాలకంటే, ఈ ఉత్థాన మహిమ క్రీస్తుని దైవత్వాన్ని నిరూపిస్తుంది (యోహాను 2:19). అందుకోసమే ప్రధానార్చకులు రాతిపై ముద్రవేసి, కావలివారిని పెట్టి, సమాధిని భద్రపరిచారు (మత్తయి 27:66). 3. బహిరంగంగా సిలువపై తననుతాను పూర్తిగా రిక్తుని చేసికొని, మరణించిన క్రీస్తుకు ఈ పునరుత్థానం బహిరంగ మహిమను, బహుమానాన్ని తెచ్చింది. న్యాయం, ధర్మం విజయం పొందాలని మనం ఎదురుచూస్తుంటాం. దానికి ఈ ఉత్థానంలో జవాబు

లభిస్తుంది. "ఇతడు దేవుని వలన పంపబడిన క్రీస్తు అయినచో తననుతాను రక్షించుకొననిమ్ము" అని అధికారులు కూడ ఆయనను హేళన చేసారు (లూకా 23:35). వారికి ధీటైన సమాధానం ఈ పునరుత్థానం. 4. ఈ ఉత్థానం వలన ఆయన విశ్వాసులు పొందే భాగ్యం ఏమంటే – క్రీస్తు నిగూఢ శరీరంలో మనం భాగస్థులయినపుడు క్రీస్తుని రెండింతల విజయంలో కూడ పాలుపొందుతాం. ఆత్మ నాశనం నుండి, అనగా మరణం నుండి లేవనెత్తబడతాం. తమ ఆత్మలను పవిత్రంగా ఉంచడానికి శుద్ధీకరణ–పవిత్రీకరణ మొనర్చు అనుగ్రహాన్ని పొందుతాం. అంత్య దినాన శరీరాలు ఉత్థానమౌతాయి (రోమీ 8:11). నూతన జీవంలోకి మొలకెత్తిన విత్తనాలు తదుపరి ఎదుగుదలకు ఎంత హామీ నిస్తాయో, అలానే పౌలు చెప్పినట్లు, " . . . ప్రథమ ఫలము క్రీస్తు, తరువాత ఆయన రాకడ సమయమున ఆయనకు చెందినవారు" (1 కొరింతీ 15:23) అవుతామని హామీ ఇస్తుంది.

కనుక, మనం సంతసిస్తున్నాం. క్రీస్తునిబట్టి, మనకు నూతన జీవనం లభించినందుకు, క్రీస్తునందు సమస్తం నూతన పరచినందుకు సంతసిస్తున్నాం (2 కొరింతీ 5:17). అందుకే, శ్రీసభ కొత్త అగ్ని, పాస్కవత్తిని వెలిగించుట, స్తుతిగీతం పాడుట, నూతన జల ఆశీర్వాదం, తెల్లని పూజా వస్త్రాలు, గ్లోరియా, గుడిగంటలు, అల్లేలూయ, "వహ్" ఎంత సందడి చేస్తుంది, ఆనందంతో కేరింతలు కొడుతుంది. అయితే, చావైన పాపంవలన క్రీస్తునుండి విడిపోయి, తెగిపడిన ఎవరైనాసరే ఈ సంతోషాన్ని అర్థవంతంగా పొందలేరు. కాబట్టి, మనం పాపం, పాపపు అలవాట్ల నుండి శుద్ధిని పొందాలి. మంచి పాపసంకీర్తనను చేసుకోవాలి. అలా ఉత్థాన క్రీస్తునందు మనం ఐక్యమై ఉంటేనే అతని ఉత్థానమందును, మహిమయందును పాలుపొందగలం. యూదా, సూర్యుడు క్రుంకే దిశగా పయనించి, చీకటిలో కలిసిపోయాడు. క్రీస్తు ఉదయించే దిశగా పయనించి, విశ్వాసపాత్రునిగా ప్రేమబాటలో నడిచి, మనకు నిత్యానంద మోక్షభాగ్యాన్ని అందించాడు. "నా జీవితం, నా నిర్ణయం, నా యిష్టం" అని అనుకుంటే, యూదా వెళ్ళిన పడమర అవుతుంది. అలాగాక, నా ఆత్మతో జీవితం, నా రక్షకుని నిర్ణయం, నా దైవాభిష్టం" అని అనుకుంటే, క్రీస్తు వెళ్ళిన తూర్పు అవుతుంది. అప్పుడు ముచ్చటగా ఉత్థాన క్రీస్తుతో కలకాలం జీవిస్తాం.

## 2. సప్తాహంపై క్రీస్తు విజయం

క్రీస్తు ఉత్థానం గురించి మరింత లోతుగా చూద్దాం. ఉత్థాన క్రీస్తును ముందుగా దర్శించిన మరియ మగ్దలా క్రీస్తు ఆజ్ఞమీద శిష్యులకు శుభ సమాచారం తెలుపటానికి పరుగునా వెళ్ళింది. మొదట శంకించిన పేతురు సమాధి వద్దకు పరుగుతీసాడు. యువకుడైన యోహాను ముందుగాచేరి, సమాధిముందు ఆగాడు. పేతురు వచ్చి, లోనికి వెళ్లాడు యోహాను అనుసరించాడు. సమాధి ఖాళీగా ఉంది. నారవస్త్రం మడతపెట్టి ఉంది. తలకు చుట్టిన తుండు వస్త్రం ప్రక్కగ పెట్టుంది. దీనినంతా యోహాను జాగ్రత్తగా గమనించాడు. మనసులోనే ఉత్థానాన్ని నమ్మాడు. అందుకే తరువాతి కాలంలో శుభవార్త వ్రాస్తూ, క్రీస్తు ఉత్థానం నిజమని వస్త్రాలను రుజువుగ వాడాడు. క్రీస్తుకు ఆ వస్త్రాలతో ఇక పనిలేదు. ఉత్థానమైన శరీరం మహిమాన్వితమైంది. ఈ విషయాన్నికూడ యోహాను గుర్తించాడు.

సప్తాహంపై క్రీస్తు విజయం విశ్వకళ్యాణానికే కేంద్ర బిందువు. ఆయన పునరుత్థానం ప్రతి ఒక్కరికి ఊపిరి పోసిన గర్భం. ఖాళీ సమాధి విశ్వాసులకు పునాది. మనుష్యులకు మరుజన్మ నిచ్చిన క్రీస్తు తాను ఏడింటిమీద విజయాన్ని సాధించాడు. అవి: 1. దేహం, 2. లోకం, 3. సాతాను, 4. పాపం, 5. మరణం, 6. స్థలం, 7. కాలం.

మొదటివి మూడు జ్ఞాన శత్రువులు. తల్లి శ్రీసభ వీటి గురించి ఆదినుండి జాగ్రత్తలు పడమని బోధ చేస్తూనే ఉంది. వీటిమీద క్రీస్తు విజయాన్ని సాధించాడు. ఒక్కొక్కదానిని విపులంగా చూద్దాం:

**1. శరీరం:** ఇది మన దగ్గరే, మనతోనే ఉంది. దీనికి అనేకమైన కోరికలు, సుఖాలను కూడ బాగా వెదకుతుంది. జిహ్వా చాపల్యం మొదలుకొని కామకలాపాల వరకు మనిషికి తియ్యటి కోరికలు. కాని ప్రభువు వీటిని జయంచాడు. కనుక, మనమూ వీటిని జయించాలి. పేతురు మాటలను గుర్తించండి – "శారీరక వ్యామోహాలు ఎప్పుడును ఆత్మతో పోరాడుచుండును. కనుక, వ్యామోహితులు కాకుండుడు" (1 పేతురు 1:11). ప్రభువు శరీరం మహిమాన్వితం అయినట్లే మన శరీరాలు మహిమాన్వితం కాటానికి ఆయన తన శరీరరక్తాలను దివ్య భోజనంగా ఇచ్చాడు. దీనిద్వారా మనం మన శరీరాన్ని పవిత్రంగా ఉంచగలం.

**2. లోకం:** మనచుట్టూ ఉన్న ప్రపంచం మనలను పల్టీ కొట్టిస్తుంది. ఈ నవీన ప్రపంచంలో అనేకనేక ప్రకటనలు, ఆధునిక వస్తువులు, కళ్లకు మిరుమిట్లు గొలిపే సామగ్రి – సెల్ఫోన్ మొదలుకొని ఇంటర్ నెట్, యూట్యూబ్ల వరకు మనలను ఊపిరి పీల్చుకోనివ్వవు. వస్త్రాలు మొదలుకొని అందమైన ఆభరణాల వరకు మనలను అల్లరి పెడతాయి. అరచేతిలో స్వర్గం అంటూ కవ్వించే యువతకు మోక్షానికి ద్వారాలను మూసేస్తున్నాయి. మనస్తత్వ శాస్త్రజ్ఞులు, సాంకేతిక నిపుణులు కలిసి, సాతానుకన్నా తెలివిని ఉపయోగించి, ప్రకటనల ద్వారా ప్రజలను పడగొట్టేస్తున్నారు. అందుకే, 1 పేతురు 4:2 లౌకిక వ్యామోహములకు లోనుకాకుండుడు అని హితబోధ చేస్తున్నాడు. క్రీస్తు ఈ లోకంపై గెలుపొందాడు. అందుకే ఆయన విశ్వపతి అయ్యాడు. క్రీస్తు అండతో మనంకూడ కాగలం.

**3. సాతాను:** దేవుని తరువాత శక్తిమంతమైంది సాతానే. పైగా అది మహా జిత్తులమారి. ఏవమ్మ బుర్రను ఏవిధంగా తిన్నదో బైబిలు కథనంబట్టి మనకు తెలుసు. క్రీస్తు ప్రభువుని సైతం ఇది విడిచిపెట్ట లేదు. ఇక మనం ఏపాటివారం? దీని తంత్రోపాయాలు, దగల్బాజీ వేషాలు సహస్ర విధాలు. 1 పేతురు చెప్పినట్లు జాగురూకులమై ఉండాలి (5:8). మీరు శోధనలకు గురికాండుటకు మేలుకొని ప్రార్థింపుడు (మత్తయి 26:41) అని ప్రభువు చెప్పాడు. ఈ యుగంలో అది టివి, ఇంటర్నెట్, యూట్యూబ్, సెల్ఫోన్ల వెనుక దాగుందని చెప్పటానికి అనేక తార్కాణాలు ఉన్నాయి. ప్రభువు సాతానును ఓడించాడు. కనుక, మనంకూడ ఆయన చలువతో దానిని మట్టుపెట్టగలం.

**4 & 5. పాపం – మరణం:** పాపం మరణం అన్నవి బైబిలు గ్రంథంలో ఒకదానికొకటి పర్యాయపదాలు లాంటివి, సంపూరకాలు (complementary). రెండూకూడ మనలను దేవునినుండి దూరం చేస్తాయి. ఇక్కడ మరణం అన్నది ఆధ్యాత్మికమైంది. క్రీస్తు రెండింటిపై అవజితి పొందాడు. ఇప్పుడు మనం క్రీస్తునందు మరణించాలి. మన కోరికలకు, బలహీనతలకు, పాపానికి మరణించాలి (రోమీ 5:12, 21). అప్పుడు మనం క్రీస్తునందు ఉత్థానం అవుతాం.

**6 & 7. స్థలం–కాలం:** దేవుడు స్థలానికి కాలానికి అతీతుడు. అందుకే అతనిని కాల విషయంలో కాలాతీతుడని అంటారు. క్రీస్తు త్రీత్వంలో రెండవ

వ్యక్తి. కనుక, ఆయనకూడ స్థలకాలాదులకు అతీతుడు. తన ఉత్థానం ద్వారా దీనిని నిరూపించుకున్నాడు. యెరూషలేంలో దర్శనమిస్తాడు, గలిలియాలో అగుపిస్తాడు. స్థలం అతనికి అడ్డుకాదు. అలానే మూసిన తలుపులు మూసినట్లుండగనే శిష్యుల గదిలోనికి ప్రవేశిస్తాడు. ఏక కాలంలో అనేక స్థలాల్లో కనిపించి, ఆయన దేవుడు, మిత్తిగొంగ అని రుజువుపరచుకున్నాడు. మానవులముగ ఈ స్థలకాలాదులను అధిగమించటానికే క్రీస్తు ఉత్థానమయ్యాడు. బంధువులను, రోగులను, అనాథులను దర్శించటానికి సమయం లేదని, దూరభారాలని క్రైస్తవబిడ్డ వెనుకంజ వేయకూడదు. ఇతరులకు సేవ చేయుటలో ఏదీ ఆటంకంగా నిలువకూడదు, ఏకుంటి సాకు చెప్పకూడదు. అటువంటి పునరుత్థానం మనకు ఈ లోకంలోనే ఇలా మొదలయ్యేది. దీనిని గుర్తించి, క్రీస్తుతోబాటు సప్తాహంపై విజయాన్ని సాధించాలి.

## 3. ఈస్టర్ తెచ్చే ధైర్యం

నేషనల్ కేథలిక్ రిపోర్టర్ వాళ్లు ఈస్టర్ గురించి ఒక ప్రకటన వేసారిలా – "ఈస్టర్ ఉదయం ఏదో జరిగింది. అది చెడ్డ శుక్రవారాలను మంచివిగాను, జీవితం తెగింపు తీసుకోదగిందిగాను మార్చివేసింది." ఒక సువార్తికుడు ఇలా అన్నాడు: "ఈ భూమిమీద ఈస్టర్ అత్యద్భుతమైన ప్రదర్శన. దొడ్డ నగుమోముతో దేవుడు మనం విందు చేసికొందాం రండి అని మనలను ఆహ్వానించే రోజే పాస్కాపండుగ."

విభూతి బుధవారం నాడు మనం ప్రారంభించిన నలుబది రోజుల తపస్సుకాలం పునరుత్థాన ఆదివారానికి చేరుతుంది. కఠినమైన తపస్సుకాలాన్ని అనేక త్యాగకృత్యాలతో గడిపి, ఈ సువర్ణ కాలానికి చేరుకున్నాం. తల్లి శ్రీసభ ఇచ్చిన అవకాసాన్ని మనకు సాధ్యమయినంతగ ఉపయోగించుకొని, ఈ మధురమైన వేళకు చేరుకున్నాం. మరణం మీద విజయాన్ని సాధించిన యేసు తనతో ఆనందించమని మనలను ఆహ్వానిస్తున్నాడు. ఆయన మృతులకును, జీవవంతులకును ప్రభువుగా కొనసాగుతుంటాడు. ఈ పాస్కా పండుగయొక్క విశిష్టతను మనం అర్థం చేసుకోవాలనుకుంటే, పేతురుని గురించి కొంత తరచిచూడాలి.

పేతురు సాదాసీదా అయిన మనిషి. చేపలు పట్టుకొని జీవించాడు. అపోస్తలునిగ ప్రభువు అతనిని పిలిచాడు. శిష్యులకు అతనిని నాయకునిగ నియమించాడు. కాని యేసు బంధీ అయిన సమయంలోను, తీర్పు విధించిన కాలంలోను ప్రభువుతో సంబంధం లేనట్లు చాటుగా తిరిగాడు. ఇక్కడ పేతురు తన విశ్వాసాన్ని పోగొట్టుకోలేదు. కాని భయంతో ముమ్మారు బొంకాడు. కొందరు దీని గురించి మనం అంతగా ఆరా తీయనక్కర లేదని, భయం భావోద్రేకాలలో ఒకటని కొట్టిపారేస్తారు. మరికొందరు, శ్రీసభ బోధించినట్లు, యూదాసు తప్పుకన్నా ఘోరమైంది పేతురుని తప్పు అని చెబుతారు. పేతురుని రోధన యేడ్పు మనకు తెలుసు. ఏదియేమైనా, క్రీస్తుని పునరుత్థానం తరువాత పేతురుని జీవితమే వేరు. ఆ విశ్వాసపు వరవడిలో పడిన తరువాత పేతురు భయాన్ని పటాపంచలు చేసి, అందరి తరపున యేసుక్రీస్తు గురించి మొట్టమొదటి ప్రసంగం ఇచ్చాడు. యూదామత నాయకులు దానిని ఆపలేకపోయారు. క్రైస్తవం వెల్లువిరిసింది. ఆ మచ్చుతునకను మనం అపోస్తులుల కార్యం 10వ అధ్యాయంలో వింటున్నాం. యేసును మీరు సిలువ వేసారని నాయకుల ముఖాలమీద చెప్పటానికి పేతురు జంక లేదు. అదీ ఈస్టర్ అంటే – భయపడిన పేతురు ఇప్పుడు ధైర్యశాలి. అదే పునరుత్థాన సందేశం. ఇపుడు మనం పేతురుని వలె ప్రకటిస్తు, యేసు జీవవంతుడై లేచాడని లోకానికి చెప్పాలి. ఆ శక్తి, ఆ ధైర్యం ఉత్థానుడైన క్రీస్తు మనకు అనుగ్రహిస్తాడు.

ఏ కోణంలోనైన ఎదుగుదలకు కొంత కాలం పడుతుంది. ఆధ్యాత్మిక జీవితానికైనా సమయం పడుతుంది. సంవత్సరాలు పట్టవచ్చు. ఈ జీవితం, దాని పరమార్థం అర్థం కావటానికి కొంతకాలం ఆగాలి. అలానే శుభవార్తలు అర్థం కావటానికి, వాటిని జీర్ణించుకోవటానికి కొంతకాలం ఓపికపట్టాలి. మరలమరలా ప్రయత్నం చేస్తుండాలి. విశ్వాసంలో పరిపక్వతను సాధించడానికి యేండ్లు పట్టవచ్చు. కాని విశ్వాసంలో కొనసాగుతూ ఉండాలి. అనేక మార్లు ప్రయత్నం చేస్తుండాలి. అపుడు ఉత్థానమందు విశ్వాసం ఒక పరిపూర్ణ దశకు చేరుకున్నపుడు క్రైస్తవులు పేతురునిలా భయం లేకుండ సువార్తను బోధిస్తారు.

## 4. ఉత్థానం – ఉప్పుడే, ఇక్కడే

దేవుడు, "సమాధులను తెరచి, మిమ్ము లేపుదును" అని అంటున్నాడు (యెహెజ్కేలు 37:12). అందుకే క్రీస్తు తండ్రి దేవునిగూర్చి ప్రస్తావిస్తు అంటాడు: "నేను అబ్రహాము దేవుడను, ఈసాకు దేవుడను, యాకోబు దేవుడను . . . ఆయన సజీవులకే దేవుడుకాని, మృతులకు దేవుడు కాదు" (మత్తయి 22:32). దేవుడు ఈ జీవాన్ని ఇవ్వగలిగినప్పుడు, దేవుని నుండి దేవునిగా, జ్యోతి నుండి జ్యోతిగా, నిజ దేవుని నుండి నిజ దేవునిగా జనించిన క్రీస్తు కూడ చనిపోయిన వారిని లేపగలడు. క్రీస్తుప్రభువు దేవుడన్న విషయాన్ని యోహాను శుభవార్తలో దృవపరుస్తున్నాడు (1:1). కనుక, యేసుకూడ జీవానికి దేవుడు అనే విషయాన్ని ప్రతియొక్కరు గుర్తించాలి. యోహాను సువార్త 11:25, 26 వచనాలను మనం గమనించినపుడు ఇరవైమూడు పదాలు మాత్రమే కలిగున్న వీటిలో క్రీస్తు ముమ్మారు తానే పునరుత్థానం, జీవం అని నొక్కి చెబుతున్నాడు. అంతేగాక, ఎప్పుడో భవిష్యత్తులో జరిగే లోకాంత్య సమయంలోగాక ఇప్పుడే, ఇక్కడే ఆ పునరుత్థానం, జీవం ప్రారంభమౌతుందన్న విషయం క్రీస్తు మాటలలో గట్టిగా ధ్వనిస్తుంది. ఉత్థానం భౌష్యత్తులో జరుగుతుందని మార్తా విశ్వసిస్తే, ప్రభువు వర్తమానంలో దానిని విశ్వసించమని మార్తా విశ్వాసాన్ని సరిదిద్దుతున్నాడు. అందుకు సూచనగా లాజరును జీవంతో లేపుతున్నాడు. కనుక, క్రైస్తవబిడ్డ తాను నమ్ముతున్న ఈ పునరుత్థానాన్ని స్వంతం చేసికొని, క్రీస్తునందు ఎదుగుతూ, బలహీనతల నుండి ఉత్థానం అవ్వాలి. వ్యసనాలనుండి, పాపకూపంనుండి మనలను లేవనెత్తడానికే క్రీస్తు శ్రమలనుభవించి, మరణించి, ఉత్థానమైనాడు. మనలోగల బలహీనతలను గమనించి, వాటినుండి విముక్తి పొందడానికి మనం గట్టి ప్రయత్నం చేస్తుండాలి. ఈ ప్రయత్నంలో ప్రభువుయొక్క సాయం ఉంటుంది. అందుకే ఆయన శ్రీసభను స్థాపించాడు. సప్తసంస్కారాల ద్వారా, ముఖ్యంగా, సంస్కారాలలో ప్రముఖమైన దివ్యబలి, దివ్యసత్ప్రసాదం వలన, దివ్యవాక్కు – ధ్యానం, ప్రార్థనల ద్వారా, రోజురోజుకు క్రీస్తునందు మారాకు తొడగాలి. పరిపూర్ణతను చేరుకోటానికి ప్రయత్నిస్తూ, ఫలాన్ని అందించాలి. మన క్రైస్తవ జీవిత పంటనుండి మంచి దిగుబడి ఉండాలి.

మరణించిన లాజరును సమాధి చేయటానికి మార్తా మరియలకు చాలా ఖర్చు అయ్యుంటుంది. అయినా, వారు భరించారు. తమ సోదరుడైన లాజరునిమీద ప్రేమ వల్లనేగాక, పునరుత్థానం మీద విశ్వాసం వలన అంత ఖర్చును భరించారు. కళ్లముందు కనిపించే ఈ పార్థివ శరీరం రేపు క్రీస్తుతో ఉత్థానమౌతుంది. అందుకే క్రైస్తవులు ఎంతో డబ్బును వెచ్చించి, ముఖ్యంగ భూస్థాపిత పూజను పెట్టించి, ఎంతో గౌరవంగ, మేరమర్యాదలతో ప్రదక్షిణగా వెళ్ళి, ప్రార్థనలతో గురువుద్వారా ఖననం చేస్తారు. పాతిపెట్టిన ఈ శరీరం మరలా జీవంతో లేస్తుంది. అంత్యదినాన్న అన్ని సమాధులను తెరచి, దేవుడు వారికి జీవం పోస్తాడు (రోమీ 8:8-11). ఈ కారణం చేతనే భూస్థాపన వ్యయానికి క్రైస్తవులు వెరువరు. పైగా మరణించిన వీరు మోక్షరాజ్యపు విందులో పాల్గొంటారు. కనుక, స్నానం చేయించి, వీలైతే కొత్తబట్టలు ధరింపజేసి, చక్కగా అలంకరించిన పేటీకలో పరుండబెట్టి, చేతిలో జపమాలను ఉంచి, నిండుగా సాగనంపాలి. మరలా వారిని మోక్షరాజ్యంలో కలుస్తామన్న విశ్వాసంతో వీడ్కోలు పలకాలి. భయంతోగాక, ప్రేమతో క్రీస్తునందు మరణించటానికి సిద్ధమవ్వాలి. ఈ క్షణమే ఆయనయందు మరణించటానికి మనం ప్రారంభించాలి.

## 5. క్రీస్తుని నిగూఢ శరీరంలోకి ఉత్థానం

మొదటి అంశంలో నాల్గవ సంగతిలో దీనిని ప్రస్తావించుకున్నాం. మూడవ శతాబ్దంలో అంతియోకులో పునీత మర్గరెట్ తాను హతసాక్షిగా మరణించే ముందు, అధికారియైన అమలుదారు, ఓలిబ్రి ఇలా అంటాడు, "అపఖ్యాతికి గురైన సిలువపై మరణించిన మానవున్ని దేవునిగా పూజించటం మూర్ఖత్వం కాదా?" అందుకు మర్గరెట్ ఇలా సమాధానం చెప్పాడు: "సిలువ వేయబడిన యేసుని మాత్రం గుర్తించుకున్నావు. కాని, ఉత్థానమైన క్రీస్తును ఎందుకు గుర్తించుకోవు? మొదటిది అతడు మనుష్యుడని, రెండవది అతడు నిజమైన దేవుడని రుజువుచేస్తున్నాయి."

మన రక్షణ విషయంలో ఉత్థానమన్నది కేంద్రీయ సందేశం. దీనికి క్రీస్తు ఉత్థానంతో విడదీయలేని లంకె ఉంది. అటువంటి రక్షణ గురించి మనమంతా నమ్మికతో ఎదురు చూస్తున్నాం. దేవునితో సంబంధం అంటే ప్రాణాలతో ఉండటమే! మానవ జీవితం కేవలం జీవసంబంధమైనదే కాదు. దానికి దైవీకమైన

భావసార్థకత (significance) ఉంది. ఎందుకంటే, భౌతిక జీవం, దేవుని బహుమానం. జీవంగల దేవుడు జీవాన్ని పోసాడు గనుక, మానవులు జీవిస్తున్నారు (ఆది 2:7). దేవుని నుండి విడిపోవడ మంటే దానర్థం – చావడమే!

చాలా మంది క్రైస్తవులు కడతీర్పు నాడు తమ ఇహలోక శరీరం మాత్రమే ఉత్థాన శరీరంగా రూపాంతరం చెందుతుందని నమ్ముతారు. అందు మూలంగా సహాలోచనైన (companion notion) క్రీస్తుని నిగూఢ శరీరంతో కూడ మనం పూర్తిగా భాగస్తులం అవుతామన్నది గమనించటం లేదని జోసఫ్ బ్రకెన్ అంటారు. క్రీస్తు ఉత్థానమైన తరువాత ఆయన వ్యవహారం ఇహలోక జీవితంలాకాక, వేరే రకంగా ఉండటం మనం శుభవార్తల్లో గమనించవచ్చు. అకస్మాత్తుగా కనిపిస్తాడు, మరలా మాయమౌతాడు. దూరం, సమయం అతనికి అతీతం. (ఈ విషయాన్ని రెండవ అంశంలో చూశాం) శిష్యులకు తన గాయాలను చూపుతాడు, వారితో భోంచేస్తాడు. శరీరమన్నది శిథిలమవలేదు. శిష్యులకు కనిపించినపుడు శరీరం అయనతోనే ఉంది. మరలా దానికి భౌతికంగా ఏదీ అడ్డు పడలేదు. ఇవి ఆయన నూతన జీవితాన్ని సూచిస్తున్నాయి. కనుక, మరణానంతరం కూడ మన శరీరంతో జీవిస్తామని క్రైస్తవులు నమ్మగలగాలి. ఇపుడు ఎలా ఉందో అలానే ఉంటుంది. కాకుంటే – నొప్పి, బాధలు, ఆకలిదప్పులు ఉండవు. ఇలా అయితే ఇతరులతో మన బంధం ఉత్థాన జీవితంలో ఎలా ఉంటుంది?

చరిత్ర ఉద్ధరించబడుతుంది, క్రీస్తునందు పరిపూర్ణం అవుతుంది. మోక్ష నగరం ఏర్పడినపుడు ఈ చరిత్ర పూర్తవుతుంది. కొత్త భువి, కొత్త దివి ఏర్పడతాయి. అపుడు దేవుడు సమస్తంలో సమస్తమై ఉంటాడు. కాబట్టి, మనల్ని మనం ఉత్థానానికి తయారు చేసుకోవటమేగాక, క్రీస్తుని నిగూఢ శరీరంలో కూడ భాగస్తులు కాటానికి సిద్ధపడాలి. ఎందుకంటే, మన ఉత్థానం క్రీస్తుని నిగూఢ శరీరంలోకి కూడ ఉంటుంది.






భక్త యోహాను ప్రచురణలు



భక్త యోహాను ప్రాంతీయ గురువిద్యాలయం
రామంతపురం, హైదరాబాదు - 500 013. ఫోన్ : 040-27201427, 27200370
e-mail: stjohnshyd2@gmail.com | www.stjohnseminaryhyd.org



Printed at : Jeevan Institute of Printing